www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ఉగాది శుభాకాంక్షలు

మంగళవారం | 9-4-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 10 | వరంగల్

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్లపక్షం; తిథి: పాడ్యమి రా. 8.30 తదుపరి విదియ; నక్షత్రం: రేవతి ఉ. 7.33 తదుపరి అశ్విని తె. 5.06 వరకు; వర్జ్యం: రా.1.31-2.57; దుర్ముహూర్తం: ఉ.8.35-9.25, రా.10.16-11.01; అమృతఘడియలు: తె.ఉ.6.50 వరకు, రా.10.38-12.05; రాహుకాలం: మ.3.00-4.30; సూర్యోదయం: 6.08; సూర్యాస్తమయం: 6.27

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



రూ.400 లక్షల కోట్లు

సరికొత్త మైలురాయికి స్టాక్ మార్కెట్ సంపద



న్యూఢిల్లీ: మన స్టాక్ మార్కెట్ సంపద సోమవారం సరికొత్త ఆల్‌టైం రికార్డు స్థాయికి ఎగబాకింది. బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ సరికొత్త జీవనకాల గరిష్ఠ స్థాయి రూ.400.86 లక్షల కోట్లకు (4.81 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది. బీఎస్ఈ మార్కెట్ క్యాప్ రూ.400 లక్షల కోట్ల మైలురాయిని తాకడం ఇదే తొలిసారి. 2023 జూలై 5న రూ.300 లక్షల కోట్ల స్థాయికి చేరిన బీఎస్ఈ మార్కెట్ క్యాప్.. దాదాపు 9 నెలల్లోనే మరో రూ.100 లక్షల కోట్లు పెరగడం విశేషం. కాగా, గడిచిన ఏడాది కాలంలో మార్కెట్ సంపద రూ.145 లక్షల కోట్లు (57 శాతం) పుంజుకుంది. 2007లో రూ.50 లక్షల కోట్లకు చేరిన బీఎస్ఈ మార్కెట్ క్యాప్.. 2014 మార్చిలో తొలిసారిగా రూ.100 లక్షల కోట్ల మైలురాయిని తాకింది. అంటే, రూ.50 లక్షల కోట్ల సంపద వృద్ధికి ఏడేళ్లు పట్టింది. ఆ తర్వాత ఏడేళ్లలో మరో రూ.100 లక్షల కోట్లు పెరిగి 2021 ఫిబ్రవరిలో రూ.200 లక్షల కోట్ల మార్క్‌ను దాటింది. ఆ తర్వాత 30 నెలల్లోనే (రెండున్నరేళ్లు) రూ.200 లక్షల కోట్ల నుంచి రూ.300 కోట్లకు పెరిగింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) మార్కెట్ విలువ సైతం రూ.400 లక్షల కోట్లకు చేరువలో (రూ.397.76 లక్షల కోట్లు) ఉంది. డాలర్ రూపేణా బీఎస్ఈ మార్కెట్ క్యాప్ తొలిసారిగా 4 లక్షల కోట్ల డాలర్ల మైలురాయిని 2023 నవంబరు 29న చేరుకుంది. అమెరికా, చైనా, జపాన్, హాంకాంగ్ తర్వాత ఈ స్థాయి మార్కెట్ క్యాపిటలైజేషన్‌ను సాధించిన ఐదో దేశం భారత్. అంతేకాదు, మార్కెట్ క్యాప్ పరంగా భారత్ ఈమధ్యనే హాంకాంగ్‌ను వెనక్కి నెట్టి నాలుగో అతిపెద్ద దేశంగా అవతరించింది. 2021లోనే స్టాక్ మార్కెట్ సంపద మన జీడీపీ స్థాయికి చేరుకుంది. ప్రస్తుతం మార్కెట్ క్యాప్-జీడీపీ నిష్పత్తి 1.33గా (133 శాతం) ఉంది.

మార్కెట్ క్యాప్ మైలురాళ్లు

సంవత్సరం	రూ.లక్షల కోట్లు
2007	50
2014 మార్చి	100
2021 ఫిబ్రవరి	200
2023 జూలై	300
2024 ఏప్రిల్	400

రికార్డు గరిష్ఠాలకు సూచీలు

22,600 ఎగువకు నిఫ్టీ

స్టాక్ మార్కెట్ ప్రధాన సూచీలు సెన్సెక్స్, నిఫ్టీ సరికొత్త ఉన్నత శిఖరాలను అధిరోహించాయి. అంతర్జాతీయ మార్కెట్ సానుకూల సంకేతాలు, విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల కొత్త పెట్టుబడులతోపాటు మార్కెట్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లలో కొనుగోళ్లు పుంజుకోవడం సూచీల ర్యాలీకి దోహదపడింది. సెన్సెక్స్ ఒకదశలో 621.08 పాయింట్లు ఎగబాకి 74,869.30 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేసింది. చివరికి 494.28 పాయింట్ల లాభంతో 74,742.50 పాయింట్ల వద్ద స్థిరపడింది. నిఫ్టీ ఒక దశలో 183.6 పాయింట్ల వృద్ధితో 22,697.30 వద్ద ఇంట్రాడే రికార్డును నమోదు చేసింది. చివరికి 152.60 పాయింట్ల లాభంతో 22,666.30 వద్ద క్లోజైంది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 22 లాభపడగా.. మారుతి సుజుకీ, ఎం అండ్ ఎం 3 శాతానికి పైగా వృద్ధి చెంది సూచీ టాప్ గెయినర్లుగా నిలిచాయి. కాగా, బీఎస్ఈలోని మిడ్‌క్యాప్ సూచీ 0.26 శాతం లాభపడగా.. స్మాల్‌క్యాప్ సూచీ 0.06 శాతం తగ్గింది. రంగాల వారీ సూచీల్లో ఆటో, ఆయిల్ అండ్ గ్యాస్, ఎనర్జీ, కన్స్యూమర్ డిస్క్రెషనరీ, రియల్టీ, మెటల్ సూచీలు 1.65 శాతం వరకు పెరిగాయి. సేవలు, ఐటీ, టెక్ సూచీలు మాత్రం నేలచూపులు చూశాయి.

మే 20న స్టాక్ మార్కెట్‌కు సెలవు

వచ్చేనెల 20న (సోమవారం) ముంబైలో లోక్‌సభ ఎన్నికల ఓటింగ్ జరగనున్న సందర్భంగా ట్రేడింగ్‌కు సెలవు పాటించనున్నట్లు బీఎస్ఈ, ఎన్ఎస్ఈ ప్రకటించాయి. ఈక్విటీ, ఈక్విటీ డెరివేటివ్స్, సెక్యూరిటీస్ లెండింగ్ అండ్ బారోయింగ్ (ఎస్ఎల్‌బీ) విభాగాల్లో ఆ రోజు ట్రేడింగ్ జరగదని స్టాక్ ఎక్స్ఛేంజీలు విడివిడిగా విడుదల చేసిన సర్క్యులర్‌లో పేర్కొన్నాయి. అంతేకాదు, రంజాన్ సందర్భంగా ఈ నెల 11న, శ్రీరామనవమి సందర్భంగా ఈ నెల 17న, మహారాష్ట్ర దినోత్సవం సందర్భంగా వచ్చే నెల 1న కూడా స్టాక్ ఎక్స్ఛేంజీలు సెలవు పాటించనున్నాయి.

ఎడెల్‌వీజ్ రూ.200 కోట్ల ఎన్‌సీడీల జారీ

ఎడెల్‌వీజ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రూ.200 కోట్ల నాన్ కన్వర్టిబుల్ డిబెంచర్ల (ఎన్‌సీడీ) జారీ సోమవారం ప్రారంభమైంది. ఈనెల 23న ఇష్యూ ముగియనుంది. 24, 36, 60, 120 నెలల కాలపరిమితితో కూడిన ఈ ఫిక్స్‌డ్ కూపన్ రేటు ఎన్‌సీడీలపై 9 నుంచి 10.46 శాతం వార్షిక వడ్డీ ఆఫర్ చేస్తున్నట్లు కంపెనీ తెలిపింది.

ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్ ఐపీఓకు సెబీ ఓకే

అంతర్జాతీయ ప్రైవేట్ ఈక్విటీ దిగ్గజం బ్లాక్‌స్టోన్ పెట్టుబడులు కలిగిన ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్ రూ.5,000 కోట్ల ఐపీఓకు సెబీ ఆమోదం తెలిపింది. ఐపీఓలో భాగంగా ఈ కంపెనీ రూ.1,000 కోట్ల తాజా ఈక్విటీ జారీతోపాటు ప్రమోటర్‌కు చెందిన రూ.4,000 కోట్ల విలువైన ఈక్విటీ వాటాను ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిన విక్రయించనుంది.

పసిడి పైపైకే..



ఈ వేసవిలో భానుడితో పాటు బంగారం, వెండీ భగ్గుమంటున్నాయి. ఈ విలువైన లోహాల ధరలు సోమవారం సరికొత్త రికార్డు గరిష్ఠ స్థాయికి పెరిగాయి. ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (24 క్యారెట్లు) బంగారం రేటు మరో రూ.350 పెరిగి రూ.71,700కు చేరుకుంది. కిలో వెండి రూ.800 ఎగబాకి రూ.84,000 ధర పలికింది. అంతర్జాతీయంగా వీటి ధరల పెరుగుదలే ఇందుకు ప్రధాన కారణం. ఇంటర్నేషనల్ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ 2,336 డాలర్లకు పెరగగా.. వెండి 27 డాలర్ల ఎగువన ట్రేడైంది. ఫెడ్ రేట్ల తగ్గింపు అంచనాలు ఊపందుకోవడంతోపాటు భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, సెంట్రల్ బ్యాంక్‌లు భారీగా బంగారం కొనుగోళ్లకు పాల్పడుతుండటం ప్రస్తుత గోల్డెన్ ర్యాలీకి కారణమని బులియన్ విశ్లేషకులు పేర్కొన్నారు.

25 మంది ఐఎస్‌బీ విద్యార్థులకు విదేశీ ప్లేస్‌మెంట్లు

హైదరాబాద్: ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) హైదరాబాద్, మొహాలీ క్యాంపస్‌ల్లో ఈ సంవత్సరం పోస్టు గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్ (పీజీపీ) పూర్తి చేసుకున్న విద్యార్థులకు ప్లేస్‌మెంట్లు పూర్తయ్యాయి. పీజీపీ పూర్తి చేసిన విద్యార్థులందరికీ మంచి మంచి కంపెనీల్లో ప్లేస్‌మెంట్లు వచ్చాయి. యాభై శాతానికిపైగా ప్లేస్‌మెంట్ ఆఫర్లు కన్సల్టెన్సీ, టెక్నాలజీ కంపెనీల నుంచే వచ్చాయి. పది శాతం ఆఫర్లు మాత్రం బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా (బీఎఫ్ఎస్ఐ) కంపెనీల నుంచి వచ్చినట్టు ఐఎస్‌బీ తెలిపింది. దాదాపు 25 మంది విద్యార్థులకు మాత్రం విదేశీ కంపెనీల నుంచి ఆఫర్లు లభించాయి. ప్లేస్‌మెంట్లలో ఎక్కువ భాగం ప్రొడక్ట్ మేనేజ్‌మెంట్, సేల్స్ అండ్ బిజినెస్ డెవలప్‌మెంట్, డిజిటల్ మార్కెటింగ్ అండ్ ట్రాన్స్‌ఫర్మేషన్, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్స్‌లో (జీసీసీ) లభించాయి. కొన్ని మొబిలిటీ కంపెనీలు కూడా ఈ ప్లేస్‌మెంట్ ఆఫర్స్‌లో పాల్గొన్నాయి. అక్సెంచర్, డెలాయిట్, నగారో, మెకెన్సీ, నవీ టెక్నాలజీస్ వంటి కంపెనీలు ఒక్కోటి 20 మంది పీజీపీ పూర్తి చేసిన విద్యార్థులను తీసుకున్నాయి. బీసీజీ, ఓలా, మెరిలిటిక్స్, టీవీఎస్ మోటార్ కంపెనీ, నైకా, జెన్‌పాక్ట్, యూనిలీవర్, రిలయన్స్ ఇండస్ట్రీస్ కూడా మంచి ఆఫర్లతో ప్లేస్‌మెంట్లు ఇచ్చాయి. మొత్తం 394 కంపెనీలు ఈ సారి ప్లేస్‌మెంట్ల కోసం నమోదు చేసుకుంటే అందులో 70 కంపెనీలు తొలిసారిగా ఐఎస్‌బీకి వచ్చాయి.

బజాజ్ ఫైనాన్స్ ఎఫ్‌డీ రేట్లు పెంపు

న్యూఢిల్లీ: బజాజ్ ఫైనాన్స్ వివిధ కాలపరిమితులు గల ఫిక్స్‌డ్ డిపాజిట్లపై (ఎఫ్‌డీ) వడ్డీరేట్లను 0.60 శాతం మేరకు పెంచింది. ఈ రేట్లు ఏప్రిల్ 3వ తేదీ నుంచే అమలుపరుస్తున్నట్టు కంపెనీ ప్రకటించింది. సీనియర్ సిటి.జెన్లకు 25-35 నెలల కాలపరిమితి గల ఎఫ్‌డీలపై 0.60 శాతం, 18-24 నెలల కాలపరిమితి గల ఎఫ్‌డీలపై 0.45 శాతం వడ్డీ పెంచింది. 42 నెలల కాలపరిమితికి డిజిటల్‌గా ఎఫ్‌డీ చేసిన సీనియర్ సిటిజెన్లు 8.85 శాతం, ఇతరులు 8.6 శాతం వడ్డీ యథాతథంగా పొందవచ్చునని కంపెనీ తెలిపింది.

గ్లాండ్ ఫార్మా షేర్లలో భారీ బ్లాక్ డీల్!

హైదరాబాద్: స్థానిక గ్లాండ్ ఫార్మా షేర్లలో భారీ బ్లాక్ డీల్ చోటు చేసుకోనుంది. కంపెనీ మాజీ ప్రమోటర్ డాక్టర్ రవి పెన్మత్స నిర్వహణలోని నికోమాక్ మెషినరీ ప్రైవేట్ లిమిటెడ్, ఆర్‌పీ అడ్వైజరీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలు గ్లాండ్ ఫార్మా ఈక్విటీలో తమ వద్ద ఉన్న షేర్లలో 15 కోట్ల డాలర్ల (సుమారు రూ.1,249 కోట్లు) విలువైన షేర్లను బ్లాక్ డీల్ ద్వారా అమ్మకానికి పెట్టినట్టు సమాచారం. అవసరమైతే మరో 1.8 కోట్ల డాలర్ల విలువైన షేర్లనూ అమ్మేందుకు ఈ సంస్థలు సంసిద్ధత వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. ఒక్కో షేరును రూ.1,725కు ఆఫర్ చేస్తున్నట్టు సమాచారం. సోమవారం నాటి ముగింపు ధరతో పోలిస్తే 7.34 శాతం డిస్కౌంట్‌తోనే డాక్టర్ రవి పెన్మత్స నిర్వహణలోని కంపెనీలు ఈ షేర్ల అమ్మకానికి సిద్ధపడడం విశేషం. ఇది కంపెనీ ఈక్విటీలో 4.4 శాతం నుంచి ఐదు శాతానికి సమానం. ఈ అమ్మకం తర్వాత కూడా డాక్టర్ పెన్మత్స వద్ద ఇంకా కంపెనీ ఈక్విటీలో ఒక శాతం షేర్లు ఉంటాయని భావిస్తున్నారు.

వాతావరణ మార్పులు ద్రవ్య విధానాలకు సవాలే

ఆర్‌బీఐ నివేదిక

ముంబై: వాతావరణంలో తరచుగా ఏర్పడే మార్పులు ఆర్థిక వృద్ధికి, ద్రవ్య విధానాలకూ సవాలుగా పరిణమించనున్నాయని ఆర్‌బీఐ ఆందోళన ప్రకటించింది. వాతావరణ మార్పుల కారణంగా ద్రవ్యోల్బణం పోటెత్తే ప్రమాదం ఉన్నట్టు 'ద్రవ్య విధాన నివేదిక - ఏప్రిల్ 2024' పేరుతో విడుదల చేసిన నివేదికలో తెలిపింది. వాతావరణ మార్పులతో వ్యవసాయ ఉత్పత్తి, సరఫరా దెబ్బతింటాయని పేర్కొంది. సరైన విధానాలు లేకపోతే వాతావరణ మార్పుల ప్రభావం వల్ల 2050 నాటికి వ్యవసాయ ఉత్పత్తి ప్రపంచవ్యాప్తంగా తొమ్మిది శాతం తగ్గే ప్రమాదం ఉందని హెచ్చరించింది

రూపీ డెరివేటివ్స్‌లో పాల్గొనండి: దాస్

దేశ, విదేశాల్లో జరిగే రూపీ డెరివేటివ్స్ ట్రేడింగ్‌లో దేశీయ బ్యాంకులు చురుగ్గా పాల్గొనాలని ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ కోరారు. అదే సమయంలో తమ నష్ట భయాలనూ బ్యాంకులు జాగ్రత్తగా బేరీజు వేసుకోవాలని సూచించారు. బార్సిలోనాలో జరిగిన ఒక సదస్సులో ఆయన ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఈ విషయంలో భారతీయ బ్యాంకుల పాత్ర చాలా పరిమితంగా ఉండడంపై దాస్ ఒకింత అసంతృప్తి వ్యక్తం చేశారు. రూపీ డెరివేటివ్స్ వేగంగా వృద్ధి చెందుతున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని దేశీయ బ్యాంకులు మార్కెట్ మేకర్స్‌తో కాకుండా, నేరుగా తుది ఖాతాదారులతోనే డెరివేటివ్స్ ట్రేడింగ్ చేయాలని కోరారు. ఈ ట్రేడింగ్‌లో దేశీయ బ్యాంకుల పాత్రను మరింత పెంపొందించాలన్నదే ఆర్‌బీఐ లక్ష్యమని దాస్ తెలిపారు.

కస్టమర్ల విశ్వాసమే మా విజయం

సంగీతా మొబైల్స్ ఎండీ సుభాష్ చంద్ర



బెంగళూరు: సంగీత మొబైల్స్‌లో కొనుగోళ్ల ప్రతి వినియోగదారుడి నమ్మకమని కంపెనీ ఎండీ సుభాష్ చంద్ర అన్నారు. లక్షలాది కస్టమర్ల విశ్వాసమే పునాదిగా మొబైల్ రిటైల్ రంగంలో ఐదు దశాబ్దాలు పూర్తి చేసుకోగలిగామని అభిప్రాయపడ్డారు. సంగీతలో కొన్న మొబైల్ ఏ కారణంగా డామేజ్ అయినా కేవలం 10 నిమిషాలలో 50 శాతం చెల్లింపుతో కొత్త ఫోన్ సొంతం చేసుకోవచ్చునని సోమవారం ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ చెప్పారు. ధరల తగ్గుదల నిరంతర ప్రక్రియ అన్నారు. కస్టమర్ల భద్రత కోసం సైబర్ సొల్యూషన్లు కూడా అందుబాటులో ఉంచామని చెప్పారు. వినియోగదారులకోసం మొబైల్స్‌తో పాటు టెలివిజన్‌లు, ఎయిర్ కండిషనర్లు, అన్ని ప్రధాన కంపెనీల లాప్‌టాప్‌లు; 20 వాట్స్ స్పీకర్, ఎఫ్ఎం రేడియో, కాల్ రికార్డింగ్ సౌకర్యం కల్గిన గాడ్జెట్లు కూడా సంగీత విక్రయిస్తోందని చెప్పారు. సంగీత గోల్డెన్ జుబిలీని పురస్కరించుకుని ఏడాది పాటు ఆఫర్లు అందిస్తున్నామని, కస్టమర్లకు ఉగాది రాయితీలు కూడా ఇస్తున్నామని ఆయన తెలిపారు. తమకు 7 రాష్ట్రాల్లో 800 షోరూంలున్నాయని వెల్లడించారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	71,620 ▲	65,650 ▲	88,000 ▲
ముంబై	71,280 ▲	65,290 ▲	81,500 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



8వ తేదీ

హైదరాబాద్	375	విజయవాడ	390
చిత్తూరు	458	విశాఖపట్నం	405
గోదావరి	390	వరంగల్	377
		దజను గుడ్లు రూ.60	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	156	గోదావరి	152
వరంగల్	156	విజయవాడ	152
కరీంనగర్	156	గుంటూరు	152
మహబూబ్‌నగర్	156	ఒంగోలు	152
కర్నూలు	156	చిత్తూరు	148
విశాఖపట్నం	134		

స్పోర్ట్స్

ఇప్పటికి వీరే..



పరుగులు	వికెట్లు
విరాట్ కోహ్లీ (బెంగళూరు)	ముస్తాఫిజుర్ (చెన్నై)
316 పరుగులు	9 వికెట్లు

నేటి మ్యాచ్

పంజాబ్ X హైదరాబాద్

వేదిక: ముల్లాపూర్-రా.7.30 గం.

పట్టాలెక్కిన చెన్నై

- కోల్‌కతాపై ఘనవిజయం
- చెలరేగిన బౌలర్లు
- రుతురాజ్ అర్ధసెంచరీ



జడేజా (3/18)



3 చెన్నై తరపున తొలి బంతికే వికెట్ తీసిన మూడో బౌలర్‌గా తుషార్

తుషార్ దేశ్‌పాండే (3/33)

చెన్నై: భారీ స్కోర్లతో బెంబేలెత్తిస్తూ.. తాజా సీజన్‌లో ఓటమనేదే లేకుండా దూసుకెళుతున్న కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్)కు ఝలక్. తమ సొంత ఇలాకాలో చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) వారి జోరుకు బ్రేక్ వేసింది. అలాగే చెన్నై రెండు వరుస ఓటముల తర్వాత గెలుపు బాట పట్టింది. బౌలింగ్‌లో స్పిన్నర్ రవీంద్ర జడేజా (3/18), పేసర్లు తుషార్ దేశ్‌పాండే (3/33), ముస్తాఫిజుర్ (2/22) కేకేఆర్ బ్యాటర్లకు ముకుతాడు వేశారు. అటు బ్యాటింగ్‌లో కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (67 నాటౌట్) అజేయ అర్ధసెంచరీ సాధించడంతో సోమవారం జరిగిన ఈ మ్యాచ్‌లో సీఎస్‌కే 7 వికెట్లతో ఘనవిజయం సాధించింది. చెపాక్‌లో చెన్నైకిది హ్యాట్రిక్ విజయం. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా 20 ఓవర్లలో 9 వికెట్లకు 137 పరుగులు చేసింది. శ్రేయాస్ (34), నరైన్ (27), రఘువంశీ (24) మాత్రమే ఆకట్టుకున్నారు. ఆ తర్వాత ఛేదనలో చెన్నై 17.4 ఓవర్లలో 3 వికెట్లకు 141 పరుగులు చేసి గెలిచింది. శివమ్ దూబే (28), మిచెల్ (25) సహకరించారు. వైభవ్‌కు 2 వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా జడేజా నిలిచాడు.

సునాయాసంగా..: స్వల్ప ఛేదన.. పైగా మంచు ప్రభావం ఉండడంతో సీఎస్‌కే ఎలాంటి ఇబ్బంది లేకుండా మ్యాచ్‌ను ముగించింది. స్లో వికెట్‌పై రుతురాజ్ కెప్టెన్సీ ఇన్నింగ్స్‌తో తుదికంటా నిలిచాడు. ఉన్న కాసేపు ఓపెనర్ రచిన్ రవీంద్ర (15) మూడు ఫోర్లతో జోరు చూపి పేసర్ వైభవ్‌కు చిక్కాడు. అయితే కెప్టెన్ రుతురాజ్ ఫామ్‌ను అందుకుంటూ వరుస ఫోర్లతో చెలరేగడంతో పవర్‌ప్లేలో జట్టు 52/1 స్కోరుతో నిలిచింది. అతడికి మిచెల్ అండగా నిలిచి నరైన్ ఓవర్‌లో 6,4తో అలరించాడు. అయితే స్పిన్నర్ వరుణ్ మాత్రం పరుగులను కట్టడి చేశాడు. దీంతో ఇద్దరూ ఎక్కువగా సింగిల్స్‌పై దృష్టి సారించారు. అటు 12వ ఓవర్‌లో రుతురాజ్ ఈ సీజన్‌లో తొలి అర్ధసెంచరీ పూర్తి చేశాడు. అయితే చక్కగా కుదురుకున్న వేళ మిచెల్ అనవసర షాట్‌కు వెళ్లి నరైన్ ఓవర్‌లో బౌల్డ్ అయ్యాడు. దీంతో రెండో వికెట్‌కు 70 పరుగుల విలువైన భాగస్వామ్యం ముగిసింది. అనంతరం స్పిన్ స్పెషలిస్ట్ శివమ్ దూబే 16వ ఓవర్‌లో రెండు, 17వ ఓవర్‌లో మరో సిక్సర్ బాది అవుటైనా సమీకరణం 19 బంతుల్లో 3 పరుగులకు మార్చాడు. ఇక విజయ లాంఛనాన్ని పూర్తి చేసేందుకు అనూహ్యంగా ఎంఎస్ ధోనీ (1 నాటౌట్) క్రీజులోకి రావడంతో చెపాక్ ఊగిపోయింది. అయితే గైక్వాడ్ విన్నింగ్ షాట్ ఫోర్‌తో మరో 14 బంతులుండగానే మ్యాచ్‌ను ముగించాడు.

బౌలర్ల హవా: 85, 88.. తమ చివరి రెండు మ్యాచ్‌ల్లో కేకేఆర్ పవర్‌ప్లే స్కోర్లివి. చెపాక్‌లో ఆ స్థాయి జోరు చూపలేకపోయినా.. తొలి ఐదు ఓవర్లలో 50 పరుగులతో ఫర్వాలేదనిపించింది. కానీ స్పిన్నర్ జడేజా బంతి చేపట్టాక అంతా తారుమారైంది. అటు ట్రాక్ కూడా ఒక్కసారిగా టర్న్ కావడంతో బ్యాటర్లకు షాట్లు ఆడేందుకే కష్టమైంది. పేసర్లు తుషార్, ముస్తాఫిజుర్ తమ వంతు సహకారం అందించడంతో కేకేఆర్ స్వల్ప స్కోరుకే పరిమితమైంది. మొదట టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఈ జట్టు ఇన్నింగ్స్ తొలి బంతికే జడేజా మెరుపు క్యాచ్‌తో ఓపెనర్ సాల్ట్ వికెట్ కోల్పోయింది. పేసర్ తుషార్ ఈ వికెట్ తీసి ఒక్క పరుగే ఇచ్చాడు. కానీ అతడి రెండో ఓవర్‌లో ఓపెనర్ నరైన్ 4,4,6తో 19 రన్స్ రాబట్టాడు. ఐదో ఓవర్‌లో నరైన్, రఘువంశీ చెరో సిక్సర్ సహాయంతో పవర్‌ప్లేలో 56 పరుగులు చేయగలిగింది. ఇద్దరూ ధాటిగా ఆడుతున్నవేళ.. ఏడో ఓవర్‌లో స్పిన్నర్ జడేజా కేకేఆర్ లయను దెబ్బతీశాడు. రఘువంశీ, నరైన్ ఇద్దరినీ పెవిలియన్‌కు చేర్చడంతో రెండో వికెట్‌కు 56 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఇక బంతిని టచ్ చేసేందుకే కష్టపడిన వెంకటేశ్ అయ్యర్ (3)ను తన తర్వాతి ఓవర్‌లోనే జడ్డూ అవుట్ చేశాడు. మరోవైపు శ్రేయాస్‌తో పాటు బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందుగా వచ్చిన రమణ్‌దీప్ డిఫెన్సివ్ ఆటతీరుతో దాదాపు ఆరు ఓవర్లపాటు ఫోర్ కూడా నమోదు కాలేదు. 12వ ఓవర్‌లో సిక్సర్‌తో ఆకట్టుకున్న రమణ్‌దీప్ (13)ను తర్వాతి బంతికే తీక్షణ బౌల్డ్ చేశాడు. రింకూ సింగ్ (9) బరిలోకి దిగినా షాట్లు ఆడడంలో విఫలమయ్యాడు. డెత్ ఓవర్లలోనూ పరిస్థితి మారలేదు. సీఎస్‌కే పేసర్లు తమ పదునేంటో చూపించారు. 17వ ఓవర్‌లో రింకూను తుషార్ బౌల్డ్ చేశాడు. అలాగే హిట్టర్ రస్సెల్ సైతం 18వ ఓవర్‌లో ఐదు డాట్ బాల్స్ ఆడడం గమనార్హం. అలాగే అతడిచ్చిన క్యాచ్‌ను కీపర్ ధోనీ అందుకోలేకపోయినా.. తర్వాతి ఓవర్‌లోనే రస్సెల్‌ను తుషార్ వెనక్కిపంపాడు. చివరి ఓవర్‌లో ముస్తాఫిజుర్ తన కట్టర్ బంతులతో రెండు పరుగులే ఇచ్చి శ్రేయాస్, స్టార్క్ (0) వికెట్లు తీశాడు.

స్కోరుబోర్డు

కోల్‌కతా: సాల్ట్ (సి) జడేజా (బి) తుషార్ 0, నరైన్ (సి) తీక్షణ (బి) జడేజా 27, రఘువంశీ (ఎల్బీ) జడేజా 24, శ్రేయాస్ (సి) జడేజా (బి) ముస్తాఫిజుర్ 34, వెంకటేష్ (సి) మిచెల్ (బి) జడేజా 3, రమణ్‌దీప్ (బి) తీక్షణ 13, రింకూ సింగ్ (బి) తుషార్ 9, రస్సెల్ (సి) మిచెల్ (బి) తుషార్ 10, అనుకూల్ రాయ్ (నాటౌట్) 3, స్టార్క్ (సి) రచిన్ (బి) ముస్తాఫిజుర్ 0, వైభవ్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు: 13; **మొత్తం: 20 ఓవర్లలో 137/9;** వికెట్ల పతనం: 1-0, 2-56, 3-60, 4-64, 5-85, 6-112, 7-127, 8-135, 9-135; **బౌలింగ్:** తుషార్ దేశ్‌పాండే 4-0-33-3, ముస్తాఫిజుర్ 4-0-22-2, శార్దూల్ 3-0-27-0, తీక్షణ 4-0-28-1, జడేజా 4-0-18-3, రచిన్ 1-0-4-0.


చెన్నై: రచిన్ (సి) వరుణ్ (బి) వైభవ్ 15, రుతురాజ్ (నాటౌట్) 67, మిచెల్ (బి) నరైన్ 25, దూబే (బి) వైభవ్ 28, ధోనీ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు: 5; **మొత్తం: 17.4 ఓవర్లలో 141/3;** వికెట్ల పతనం: 1-27, 2-97, 3-135; **బౌలింగ్:** స్టార్క్ 3-0-29-0, వైభవ్ అరోరా 4-0-28-2, అనుకూల్ రాయ్ 1.4-0-18-0, నరైన్ 4-0-30-1, వరుణ్ 4-0-26-0, రస్సెల్ 1-0-8-0.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
రాజస్థాన్	4	4	0	0	8	1.120
కోల్‌కతా	4	3	1	0	6	1.528
లఖ్‌నవూ	4	3	1	0	6	0.775
చెన్నై	5	3	2	0	6	0.666
హైదరాబాద్	4	2	2	0	4	0.409
పంజాబ్	4	2	2	0	4	-0.220
గుజరాత్	5	2	3	0	4	-0.797
ముంబై	4	1	3	0	2	-0.704
బెంగళూరు	5	1	4	0	2	-0.843
ఢిల్లీ	5	1	4	0	2	-1.370

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

సుమిత్ సంచలనం



మాంటే కార్లో: భారత టెన్నిస్ యువ ఆటగాడు సుమిత్ నగాల్ సంచలన విజయం సాధించాడు. మాంటే కార్లో టోర్నమెంట్‌లో ప్రపంచ 38వ ర్యాంకర్ మాటెఅర్నాల్డికి షాకిచ్చి వహ్వా అనిపించాడు. సోమవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో క్వాలిఫయర్, 93వ ర్యాంకరైన సుమిత్ 5-7, 6-2, 6-4తో అర్నాల్డి (ఇటలీ)ని వరుససెట్లలో చిత్తుచేశాడు. ఈ ప్రదర్శనతో 26 ఏళ్ల సుమిత్.. ఏటీపీ మాస్టర్స్ క్లే కోర్టు ఈవెంట్‌లో మెయిన్ డ్రాలో గెలుపు నమోదు చేసిన తొలి భారత ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. టాప్-50లోపు ర్యాంకర్‌ను ఓడించడం నగాల్‌కు ఈ సీజన్‌లో ఇది మూడోసారి. రెండో రౌండ్లో ప్రపంచ ఏడో ర్యాంకర్ హోల్గర్ రూన్ (డెన్మార్క్)తో సుమిత్ అమీతుమీ తేల్చుకోనున్నాడు.

సింధుకు కఠిన పరీక్ష

నేటి నుంచి ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్



నింగ్‌బో (చైనా): ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో ఏస్ షట్లర్ పీవీ సింధుకు కఠిన సవాల్ ఎదురుకానుంది. ఒలింపిక్ క్వాలిఫికేషన్ ర్యాంకింగ్ పాయింట్లు లభించే ఆఖరి ఈవెంట్ కావడంతో.. మంగళవారం నుంచి జరిగే ఈ టోర్నీలో వరల్డ్ టాప్ ర్యాంక్ ప్లేయర్లు అన్ సి యంగ్, తైజు యింగ్, యమగూచి, ఒకుహరా..తదితరులు బరిలో నిలవనున్నారు. తీవ్రమైన పోటీ నెలకొన్న నేపథ్యంలో మెరుగైన ప్రదర్శనతో పారిస్ బెర్త్‌ను సొంతం చేసుకోవడానికి సింధు మరింతగా శ్రమించాల్సి ఉంటుంది. తొలి రౌండ్‌లో జిన్ వి గో (మలేసియా)తో ఆమె తలపడనుంది. థాయ్ షట్లర్ బుసానన్‌తో ఆకర్షి కశ్యప్ ఆడనుంది. పురుషుల్లో లక్ష్య సేన్, హెచ్ఎస్ ప్రణయ్, కిడాంబి శ్రీకాంత్, ప్రియాన్షు రజావత్ బరిలో నిలవనున్నారు. డబుల్స్‌లో ట్రీసా జాలీ-గాయత్రి పుల్లెల, అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో, అర్జున్-ధ్రువ్, కృష్ణ ప్రసాద్-సాయి ప్రతీక్ జంటలు టైటిల్ కోసం తలపడనున్నాయి. కాగా, డబుల్స్ డిఫెండింగ్ చాంప్ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టి జంట చివరి నిమిషంలో టోర్నీ నుంచి తప్పుకొంది.

నన్ను పక్కనపెట్టేలా కుట్రలు

- ఈసీ సభ్యులపై ఉష ఆరోపణ
- ఐఓఏలో ముదిరిన అంతర్గత విభేదాలు



న్యూఢిల్లీ: భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ)లో అంతర్గత విభేదాలు మరింతగా ముదురుతున్నాయి. ఐఓఏ అధ్యక్షురాలు పీటీ ఉష-కార్యనిర్వాహక వర్గం (ఈసీ) సభ్యుల మధ్య ఏమాత్రం పొసగడం లేదు. ఉష తీసుకొన్న నిర్ణయాలను రెబల్ ఈసీ సభ్యులు బహిరంగంగానే ధిక్కరిస్తున్నారు. కీలక నిర్ణయాల్లో తన ప్రమేయం లేకుండా చేసే విధంగా రెబల్ ఈసీ సభ్యులు వ్యవహరిస్తున్నారని ఉష సోమవారమిక్కడ ఆరోపించింది. ఐఓఏ హెడ్ క్వార్టర్స్‌లోకి అనధికార వ్యక్తులకు అనుమతిలేదంటూ తొమ్మిది మంది ఈసీ సభ్యుల సంతకాలతో కూడిన నోటీసును ఆఫీసు పరిసరాల్లో అంటించడం వాతావరణాన్ని మరింతగా వేడెక్కించింది. ఇటీవలే తాను చేసిన రెండు నియామకాలే లక్ష్యంగానే ఈ నోటీసులు అని ఉష వాపోయింది. 'మనం ఐక్యంగా పని చేయలేక పోతుండడం బాధ కలిగిస్తోంది. నన్ను పక్కనపెట్టే విధంగా మీ చర్యలుంటున్నాయ'ని ఈసీ సభ్యులకు ఉష చెప్పింది.

హాకీ కోర్ గ్రూప్‌లో జ్యోతి



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): టీమిండియా సీనియర్ మహిళల హాకీ కోర్ ప్రాబబుల్స్‌లో హైదరాబాద్ అమ్మాయి ఈదుల జ్యోతి రెడ్డి చోటు దక్కించుకుంది. సోమవారం హాకీ ఇండియా ప్రకటించిన 33మంది సభ్యులతో కూడిన కోర్ గ్రూప్‌లో మిడ్ ఫీల్డర్‌గా 21 ఏళ్ల జ్యోతి ఎంపికైంది. వచ్చే నెలలో జరిగే ఎఫ్ఐహెచ్ హాకీ ప్రొ లీగ్‌కు ఈ కోర్ గ్రూప్ నుంచే తుది జట్టును ఎంపిక చేస్తారు.

హంపికి షాక్

టొరంటో: క్యాండిడేట్స్ చెస్ టోర్నీలో కోనేరు హంపికి బల్గేరియా జీఎం సాలిమోవా నుర్గ్యుల్ షాకిచ్చింది. నాలుగో రౌండ్‌లో నల్ల పావులతో బరిలోకి దిగిన హంపికి 62వ ఎత్తులో సాలిమోవా చెక్ చెప్పింది. దీంతో హంపి 3 నుంచి ఆరోస్థానానికి పడిపోయింది. గోరియాచ్కినా (రష్యా)తో తలపడిన వైశాలి 40 ఎత్తుల తర్వాత డ్రా చేసుకుంది. పురుషుల నాలుగో రౌండ్‌లో ప్రజ్ఞానంద, గుకేష్ డ్రాతో సరిపెట్టుకోగా, విదిత్ గుజరాతి ఓటమి పాలయ్యాడు. నకమురాతో గేమ్‌ను ప్రజ్ఞానంద డ్రా చేసుకోగా, ఫాబియానో (అమెరికా)తో పోరులో గుకేష్ డ్రాకు అంగీకరించాడు. నాలుగు రౌండ్లు ముగిసేసరికి గుకేష్ 3వ, ప్రజ్ఞానంద 4వ స్థానంలో ఉన్నారు.

బ్రూక్ స్థానంలో లిజాడ్



న్యూఢిల్లీ: ఢిల్లీ క్యాపిటల్స్ బ్యాటర్ హ్యారీ బ్రూక్ స్థానంలో దక్షిణాఫ్రికా పేసర్ లిజాడ్ విలియమ్స్‌ను తీసుకున్నారు. లీగ్ ఆరంభానికి ముందే బ్రూక్ వ్యక్తిగత కారణాలతో వైదొలిగాడు. దీంతో లిజాడ్‌ను అతడి కనీస ధర రూ.50 లక్షలకే డీసీ జట్టులోకి తీసుకుంది. మొత్తంగా 83 టీ20ల్లో 103 వికెట్లు తీసిన లిజాడ్ గతేడాది వన్డే వరల్డ్‌కప్‌లో బంగ్లాదేశ్‌పై ఓ మ్యాచ్ ఆడాడు. ప్రస్తుతం డీసీ జట్టు తానాడిన ఐదు మ్యాచ్‌ల్లో ఒకే విజయంతో పట్టికలో చివరన కొనసాగుతోంది.




www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ఉగాది శుభాకాంక్షలు



మంగళవారం | 9-4-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 | సంచిక (Issue) : 10 | Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | వరంగల్

మేడిగడ్డ మరింత
కుంగింది!


ఏప్రిల్ 8న


మార్చి 7న

గతంలో ఒకటిన్నర అడుగుల మేరకే

ఇప్పుడు 4-5 అడుగుల మేర కుంగుబాటు

నెల రోజుల వ్యవధిలోనే స్పష్టమైన మార్పు

మరింత లోపలికి వెళ్లిన పియర్లు, ఏప్రన్

క్రస్ట్ స్పిల్ వేలోనూ పెరుగుతున్న పగుళ్లు

మట్టికట్ట కింద నుంచి లీకవుతున్న నీళ్లు

నిర్మాణంలో బొగ్గు బయటపడినట్లు ప్రచారం

భూపాలపల్లి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బ్యారేజీ పియర్లు, ఏప్రన్ మరింత కుంగాయి. గత అక్టోబరులో డ్యామేజీ విషయం బయట పడినపుడు ఏడో బ్లాక్‌లోని 19, 20, 21 పియర్లు, వాటికి కింద ఉండే ఏప్రన్ ఒకటిన్నర అడుగుల మేర కుంగాయి. ఇప్పుడు తాజాగా నాలుగైదు అడుగుల మేర కుంగినట్లు కనిపిస్తోంది. ఏడో బ్లాక్ పియర్లు రోజురోజుకూ భూమిలోకి కుంగిపోతున్నాయని, బ్యారేజీ మరింత ప్రమాదంలోకి వెళుతోందని తాజా పరిణామాలు సూచిస్తున్నాయి. పియర్లతోపాటు బ్యారేజ్ బే ఏరియా, క్రస్ట్ స్పిల్‌వేలోనూ

మిగతా 11వ పేజీలో...

కాళేశ్వరంపై కావాలనే సర్కారు
దుష్ప్రచారం

భవిష్యత్తు తరాలకు

ఆ ప్రాజెక్టే పెద్ద వరం: కేటీఆర్

3



కవితకు బెయిలిస్తే
మొదటికే మోసం

సాక్ష్యాలను తారుమారు చేసి,

సాక్షులపై ఒత్తిడి తెచ్చే ముప్పు

కుమారుడి పరీక్షలు కారణమే కాదు

పెద్ద కొడుకు స్పెయిన్‌లో ఉన్నాడు

బంధువులు పక్కనుండగా చిన్న

అబ్బాయి పరీక్షలెందుకు రాయలేదు?

కవితను ఈ కేసులో బలిపశువుగా

మార్చారని నమ్మడానికి వీల్లేదు

బెయిల్ నిరాకరిస్తూ ఈడీ

ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు ఈడీ ప్రత్యేక కోర్టు బెయిల్ నిరాకరించింది. దీంతో తిహాడ్ జైలు నుంచి కవిత ఇప్పట్లో బయటికి వచ్చే అవకాశాలు కనిపించడం లేదు. కవితకు బెయిల్ ఇస్తే సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందని, సాక్ష్యాధారాలను తారుమారు చేసి తప్పించుకునే ముప్పు ఉందని కోర్టు అభిప్రాయపడింది. కుమారుడి పరీక్షల కోసం కవితకు బెయిల్ ఇవ్వడం తప్పనిసరి కానేకాదని న్యాయమూర్తి కావేరి భవేజా వ్యాఖ్యానించారు. దర్యాప్తులో పాల్గొనకముందు, నోటీసులు

మిగతా 3వ పేజీలో...

అప్రూవర్లుగా ఇద్దరు!

ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం

వీరిలో ఒకరు ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావుకు నమ్మకస్తుడు

నేటితో ముగియనున్న మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు కస్టడీ

ఓ ఇన్‌స్పెక్టర్, నలుగురు కానిస్టేబుళ్ల విచారణ

పలు జిల్లాల్లో వార్‌రూంలు, ఏడు చోట్ల ట్యాపింగ్ కేంద్రాలు

ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మామిడి తోటలోనూ ఏర్పాటు

హైదరాబాద్ సిటీ/హైదరాబాద్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్(ఎస్ఐబీ) కేంద్రంగా సాగిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇద్దరు పోలీసు అధికారులు కీలకంగా మారనున్నారు! అవసరమైతే కేసులో వారి పాత్రను బట్టి, నిందితులుగా చేర్చి, ఆ తర్వాత అప్రూవర్లుగా మార్చే దిశలో దర్యాప్తు అధికారులు అడుగులు వేస్తున్నారా? ఈ ప్రశ్నలకు అత్యంత విశ్వసనీయవర్గాలు అవుననే చెబుతున్నాయి. ప్రస్తుతం పోలీసు కస్టడీలో ఉన్న టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ (ఓఎస్డీ) రాధాకిషన్‌రావు కూడా వారిద్దరి పేర్లను వెల్లడించినా.. దర్యాప్తు అధికారులు కనీసం నోటీసులు ఇచ్చి, వారిని విచారించిన దాఖలాలు లేవు. దీన్ని బట్టి.. రిటైర్ అయ్యాక కూడా ఎస్ఐబీలో ఓఎస్డీలుగా కొనసాగుతున్న ఆ ఇద్దరు అధికారులు కీలక సాక్షులుగా ఉన్నట్లు స్పష్టమవుతోంది. వారిద్దరూ సాక్ష్యం చెప్పడానికి సిద్ధపడ్డాకే.. దర్యాప్తు అధికారులు ఈ కేసులో టెలిగ్రాఫ్ చట్టాన్ని జోడించినట్లు(ఆల్టర్) తెలుస్తోంది. ఆ ఇద్దరు అధికారుల్లో ఒకరు ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావుకు అత్యంత నమ్మిన బంటుగా ఉన్నట్లు సమాచారం. నిజానికి ఈ కేసులో ప్రణీత్‌రావును విచారించడానికి ముందే.. దర్యాప్తు అధికారులు ఆ ఇద్దరు ఓఎస్డీల ద్వారా పలు జిల్లాల్లోని వార్‌రూమ్‌లు, ఏడు ప్రాంతాల్లో ట్యాపింగ్ కేంద్రాల ఏర్పాటు వంటి



మిగతా 3వ పేజీలో...



ట్యాపింగ్‌తో నాకు సంబంధం లేదు

ఎలాంటి తనిఖీలు జరగలేదు.. అంతా అసత్య ప్రచారం: ఎమ్మెల్సీ నవీన్

రాహుల్, మంత్రి సురేఖవి నిరాధార ఆరోపణలు.. చర్యలు తీసుకోండి

కేంద్ర ఎన్నికల సంఘానికి బీఆర్ఎస్ ఫిర్యాదు

3

షకీల్ కుమారుడు
రాహిల్ అరెస్టు

ప్రజాభవన్ వద్ద రోడ్డు ప్రమాదం కేసు..

3 నెలలకు అదుపులోకి

దుబాయ్ నుంచి రాక

పోలీసులకు ఎయిర్‌పోర్టు సిబ్బంది సమాచారం

14 రోజుల రిమాండ్

2

'పొగ'బట్టి చంపేసింది

యువతి సిగరెట్ తాగుతుండగా వీడియో తీసిన యువకుడు

అదే పనిగా ఆమెను చూడడంతో వాగ్వాదం

స్నేహితులను పిలిచి.. యువకుడిపై తీవ్ర దాడి

చికిత్స పొందుతూ మృతి

నాగపూర్‌లో ఘటన

12

నన్ను దెబ్బతీసే కుట్రలు

వెనక నుంచి కొందరు గూడుపుఠాణీ చేస్తున్నారు

కొడంగల్‌లో మెజారిటీ రాకుండా చేసే ప్రయత్నం

కాంగ్రెస్‌ను ఓడించేందుకు బీఆర్ఎస్, బీజేపీ పన్నాగం

ఓట్ల కోసం మతాల మధ్య గొడవలు పెట్టే ప్రయత్నం

మోదీకి మళ్లీ ఓటేస్తే చంద్రమండలానికి రాజవుతారా?

బీజేపీలో జాతీయ ఉపాధ్యక్ష పదవి తెచ్చుకున్న అరుణ..

పాలమూరు లిఫ్ట్‌కు జాతీయహోదా ఎందుకు తేలేదు?

ఎక్కడ ఉన్నా.. నా గుండెచప్పుడు కొడంగల్ మాత్రమే

దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా: రేవంత్

కొడంగల్ కాంగ్రెస్ నాయకులతో సీఎం సమీక్ష


కొడంగల్‌లో మాట్లాడుతున్న సీఎం, చిత్రంలో వంశీచంద్

కొడంగల్, ఏప్రిల్ 8: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తనను దెబ్బతీసేందుకు కొందరు కుట్రలు చేస్తున్నారని, వెనక నుంచి గూడుపుఠాణీ జరుగుతోందని ఆరోపించారు. ఓట్ల కోసం మతాల మధ్య గొడవలు పెట్టాలని కొందరు ప్రయత్నిస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బీఆర్ఎస్, బీజేపీ కలిసి కాంగ్రెస్‌ను ఓడించేందుకు పన్నాగాలు పన్నుతున్నాయని, వాటిని తిప్పికొట్టేందుకు పార్టీ కార్యకర్తలు, నాయకులు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. సోమవారం వికారాబాద్ జిల్లా కొడంగల్‌లోని తన నివాసంలో నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో మండలాల వారీగా లోక్‌సభ ఎన్నికలపై సీఎం రేవంత్ సమీక్ష నిర్వహించారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి, పార్టీ పరిశీలకుడు సంపత్‌కుమార్, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి

మిగతా 2వ పేజీలో...

యువకుడిని హతమార్చి..
ఇన్‌స్టాలో షేరింగ్


మృతుడు తేజస్

మృతుడు ఓ హత్యకేసులో నిందితుడు

ఆ కేసు బాధితుడి మిత్రుల ఘాతుకం

కూకట్‌పల్లి ప్రగతినగర్‌లో ఘటన

నిజాంపేట్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వారంతా యువకులు.. పది మంది ఉంటారు..! బైక్‌లపై వచ్చారు. నడిరోడ్డుపై ఓ యువకుడిని కత్తితో పొడిచి, దారుణంగా హతమార్చారు. ఆ దృశ్యాలను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. "స్నేహితుడి హత్యకు ప్రతీకారం" అని ఆ పోస్టులో పేర్కొన్నారు. ఈ దారుణ ఘటన హైదరాబాద్ కూకట్‌పల్లిలోని ప్రగతినగర్‌లో చోటుచేసుకుంది. బాచుపల్లి పోలీసుల కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడకు చెందిన తేజస్(21) బతుకుతెరువు కోసం నగరానికి వచ్చి, బోరబండలో

మిగతా 3వ పేజీలో...


బీజేపీ బూత్ అధ్యక్షుల సమ్మేళనంలో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

బీఆర్ఎస్‌కు డిపాజిట్లూ రావు

కాంగ్రెస్ పార్టీది హిందువుల వ్యతిరేక మ్యానిఫెస్టో

ఫిరాయింపులపై రాహుల్‌గాంధీ మాట్లాడడమా?: కిషన్‌రెడ్డి

డీ ఫ్యాక్టో సీఎంలా మంత్రి శ్రీధర్‌బాబు వ్యవహారం

రుణమాఫీ ఎగ్గొట్టే యోచనలో కాంగ్రెస్: ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

11

అవినీతిపరులు జైలుకే!

ఇది మోదీ గ్యారెంటీ.. కాంగ్రెస్‌కు పేదలు పట్టరు.. దానిది 'కాకర'బుద్ధి

'లూటీ లైసెన్స్' రద్దుచేసినందుకే నన్ను దూషిస్తున్నారు

ప్రజలే నాకు రక్షాకవచం.. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రల్లో ప్రధాని ధ్వజం



రాయ్‌పూర్/జగ్‌దల్‌పూర్/చంద్రాపూర్, ఏప్రిల్ 8: అవినీతిపరులను రక్షించడానికి కాంగ్రెస్, ఇతర విపక్షాలు ర్యాలీలు నిర్వహిస్తున్నాయని ప్రధాని మోదీ ఆక్షేపించారు. తనను ఎంత బెదిరించినా.. తప్పుచేసినవారు జైలుకు వెళ్లక తప్పదని.. ఇది 'మోదీ గ్యారెంటీ' అని స్పష్టం చేశారు. ఛత్తీస్‌గఢ్‌లోని మావోయిస్టుల ప్రభావిత బస్తర్ జిల్లాలో సోమవారం నిర్వహించిన 'విజయ సంకల్ప్ శంఖనాద్' సభలో, మహారాష్ట్రలోని చంద్రాపూర్ సభలో ఆయన ప్రసంగించారు. స్వాతంత్ర్యానంతరం అవినీతి కాంగ్రెస్.. పేదల అవసరాలను

మిగతా 12వ పేజీలో...

జనసేనకు చిరు విరాళం రూ.5 కోట్లు



- తన తమ్ముడిది నిస్వార్థమైన మనసని ప్రశంస
- మెగాస్టార్ ఆశీర్వాదం తీసుకున్న జనసేనాని

హైదరాబాద్, అమరావతి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): తన సోదరుడు, పవర్‌స్టార్ పవన్ కల్యాణ్ స్థాపించిన జనసేన పార్టీకి.. మెగాస్టార్ చిరంజీవి 5 కోట్ల రూపాయల విరాళం ఇచ్చారు. ఆదివారం అనకాపల్లిలో జరిగిన విజయ భేరి సభలో పవన్ కల్యాణ్ లోకపావని నూకాలమ్మ దీవెనలను కోరుతున్న సమయంలో ఆ దృశ్యాన్ని చిరంజీవి టీవీలో చూశారు. ఆక్షణంలోనే తన తమ్ముడికి తన ఆశీర్వాదంతో పాటు ఆర్థికంగానూ అండగా నిలబడాలని నిర్ణయించుకున్నారు. ఈమేరకు ఆయన.. హైదరాబాద్ శివార్లలోని ముచ్చింతల్లో 'విశ్వంభర' సినిమా షూటింగ్ జరుగుతున్న ప్రాంతానికి రావాల్సిందిగా పవన్‌ను ఆహ్వానించారు. దీంతో సోమవారం ఉదయం పదిగంటలకు.. పవన్ కళ్యాణ్, నాగబాబు ఇతర జనసేన నేతలు అక్కడికి వెళ్లారు. లోకేషన్‌కు చేరుకున్న పవన్‌ను చిరంజీవి ప్రేమపూర్వకంగా ఆలింగనం చేసుకుని స్వాగతం పలికారు. అనంతరం.. జనసేన పార్టీ నిర్వహణ కోసం పవన్ కళ్యాణ్‌కు రూ.5 కోట్ల విలువ చేసే చెక్‌లను అందజేశారు. ఆ చెక్కులను అందుకున్న వెంటనే పవన్ తన అన్న పాదాలకు నమస్కరించారు. ఆ సమయంలో ఆయన కొంత ఉద్వేగానికి గురయ్యారు. అనంతరం ముగ్గురు సోదరులూ చాలాసేపు మాట్లాడుకున్నారు. ఈ సందర్భంగా చిరు తన చిన్నతమ్ముడిపై ప్రశంసల వర్షం కురిపించారు. "అందరూ అధికారంలోకి వచ్చిన తరువాత సాయం చేస్తాం అంటారు. అధికారంలోకి రాక పోయినా పవన్ కల్యాణ్ తన సంపాదనను రైతు కూలీలు, జవాన్ల కోసం ఉపయోగించడం నాకెంతో సంతోషాన్ని కలిగించింది. గతంలోనూ వారి కోసం కల్యాణ్ తన డబ్బు ఎంతో ఖర్చుపెట్టాడు. స్వార్జితాన్ని సమాజం కోసం ఖర్చుపెట్టే నిస్వార్థమైన మనసున్నవాడు కళ్యాణ్. తన లక్ష్యాన్ని చేరుకోవడానికి తాను ఎంత తపన పడుతున్నాడో, ఎంత శ్రమపడుతున్నాడో నాకు తెలుసు. నేను ఇచ్చే ఈ విరాళం తన లక్ష్యాన్ని చేరుకోవడంలో కొంతైనా ఉపయోగపడుతుందని భావించాను. నా తమ్ముడు ఎలాంటి సత్కార్యం తలపెట్టినా నా ఆశీస్సులు ఉంటాయి. తను వేసే ప్రతి అడుగూ విజయం దిశగానే సాగాలని కోరుకుంటూ ఈ విరాళాన్ని అందించాను" అని చిరంజీవి పేర్కొన్నారు.

లోకం తీరు



సబ్సిడీ విత్తన టెండర్లకు ఈసీ బ్రేక్!

- మే 13వ తేదీ తర్వాత నిర్వహించాలని ఆదేశాలు

హైదరాబాద్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రైతులకు సబ్సిడీ విత్తనాల పంపిణీకి ఈసీ అనుమతించలేదు. మే నెల 13వ తేదీ తర్వాతే టెండర్లు పిలుచుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టం చేసింది. అయితే, పచ్చి రొట్ట సబ్సిడీ విత్తన పంపిణీ కార్యక్రమం కొత్తదేమీకాదని.. ఏటా ప్రతి సీజన్‌లో అమలు చేస్తామని రాష్ట్ర వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు ఈసీకి వివరణ ఇచ్చారు. విత్తన పంపిణీ టెండర్లకు అనుమతివ్వాలని గతంలో ఆయన లేఖ రాయగా ఈసీ తాజాగా అందుకు నిరాకరించింది. దీంతో విత్తన పంపిణీ ఆవశ్యకతను వివరిస్తూ ఈసీకి సోమవారం మరో లేఖ రాశారు. రైతులు మే నెలలోనే పచ్చిరొట్ట విత్తనాలు వేస్తారని, అందుకే ఈ నెలలో టెండర్ల ప్రక్రియ ప్రారంభించాల్సి ఉందని పేర్కొన్నారు.

రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోళ్లు

- 7,149 సెంటర్లకుగానూ 5,923 ప్రారంభం

హైదరాబాద్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రైతాంగానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అందరికీ అందుబాటులో ఉండేలా అన్ని ప్రాంతాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. గతేడాది ఇదే సమయానికి సెంటర్లు ప్రారంభం కాలేదని, ఈ ఏడాది మార్చి 25వ తేదీనే కొనుగోళ్లు ప్రారంభించామని చెప్పింది. ఈ యాసంగి సీజన్‌లో మొత్తం 7,149 కొనుగోలు కేంద్రాలు రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించగా ఇప్పటికే 5,923 సెంటర్లు ప్రారంభమయ్యాయి. మిగిలిన 1,226 కొనుగోలు కేంద్రాలు మరో రెండు రోజుల్లో తెరవనున్నట్లు వెల్లడించింది. ప్రభుత్వం తెలిపిన వివరాల ప్రకారం, ఇప్పటికే 6 జిల్లాల్లో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ద్వారా 556 కొనుగోలు కేంద్రాల్లో 10,325 మంది రైతుల నుంచి 72,071 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ఏవైనా సమస్యలుంటే రైతులు నేరుగా 1967 టోల్ ఫ్రీ నెంబరుకుగానీ, 1800 4250 0333 నెంబరుకు గానీ ఫోన్ చేయాలని ప్రభుత్వం సూచించింది.

యాదగిరిగుట్ట ప్రధానాలయంలోకి సెల్‌ఫోన్ల నిషేధం

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 8: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయంలోకి సెల్‌ఫోన్లను తీసుకువెళ్లటాన్ని నిషేధిస్తూ ఈవో భాస్కర్‌రావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే భక్తులకు సెల్‌ఫోన్లతో అనుమతి లేనప్పటికీ ప్రధాన, మినిస్టీరియల్, నాలుగో తరగతి ఉద్యోగులు, ఎస్పీఎఫ్, హోంగార్డు, అవుట్‌సోర్సింగ్ సిబ్బందితో పాటు మీడియా ప్రతినిధులకు అనుమతి ఉండేది. ప్రస్తుతం వీరికి కూడా నిషేధం విధించారు. మంగళవారం నుంచి ఇది అమలులోకి వస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. భద్రత నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందికి వాకీటాకీలతో సమాచారం అందుతున్న నేపథ్యంలో సెల్‌ఫోన్లు అవసరం లేదని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది.

రామయ్య కల్యాణానికి గవర్నర్‌కు ఆహ్వానం

భద్రాచలం, ఏప్రిల్ 8: భద్రాచలం దేవస్థానం ఆధ్వర్యంలో ఈనెల 18వ తేదీన నిర్వహించే శ్రీరామ మహాపట్టాభిషేకానికి రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను ఆహ్వానిస్తూ భద్రాద్రి దేవస్థానం అధికారులు రాజపత్రం అందజేశారు. భద్రాద్రి దేవస్థాన ఈవో ఎల్.రమాదేవి నేతృత్వంలో వైదిక పరిపాలన సిబ్బంది సోమవారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిశారు. శ్రీరామనవమి సందర్భంగా భద్రాద్రి దేవస్థానంలో నిర్వహించే మహాపట్టాభిషేకానికి ఆహ్వానం పలుకుతూ రాజపత్రాన్ని గవర్నర్‌కు అందజేశారు. కాగా, 17న శ్రీరామనవమి సందర్భంగా భద్రాద్రి శ్రీ సీతారామచంద్రస్వామి కల్యాణానికి పోచంపల్లి పట్టువస్త్రాల తయారీ ప్రారంభమైంది. సికింద్రాబాద్‌కు చెందిన చేనేత కళాకారులు ఎస్ఎస్ జయరాజ్, రాపోలు గణేష్, గుర్రం శ్రీనివాస్, మిరియాల సురేందర్‌లు భద్రాచలంలో ఇందుకు సంబంధించిన పనులకు శ్రీకారం చుట్టారు.

నేతన్న పేరుతో బీఆర్ఎస్, బీజేపీ శవరాజకీయాలు

- కేంద్రం ఎన్ని నిధులిచ్చిందో కరీంనగర్ అసమర్థ ఎంపీ చెప్పాలి
- చేనేతలకు పని కల్పిస్తాం: మంత్రి పొన్నం

సిరిసిల్ల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల కేంద్రంగా చేనేత కార్మికుల పేరుతో బీఆర్ఎస్, బీజేపీలు శవ రాజకీయాలు చేస్తున్నాయని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత నేతన్నల ప్రయోజనం కోసం పనిచేసిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రమేనని తెలిపారు. బీజేపీ ప్రభుత్వం వస్త్రపరిశ్రమ మీద జీఎస్టీ వేసిందని, జాతీయ చేనేత, టెక్స్‌టైల్ బోర్డు, మహాత్మాగాంధీ గుణకర్ బీమా యోజన, ఐసీఐసీఐ, నాబార్డు ఆరోగ్య బీమాలను రద్దు చేసిందని ఆరోపించారు. కేంద్రప్రభుత్వం ఎస్ఐబీపీ పథకం కింద తమిళనాడుకు ఎన్ని నిధులు ఇచ్చిందో, తెలంగాణకు ఎన్ని నిధులు ఇచ్చిందో ఈనెల 10న సిరిసిల్లలో దీక్ష చేస్తా అంటున్న కరీంనగర్ అసమర్థ పార్లమెంట్ సభ్యుడు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో చేనేత పరిశ్రమ నుంచి వస్త్రాలు కొనుగోలు చేయడానికి జీవో నంబరు 1ని తీసుకొచ్చామన్నారు. కేటీఆర్ ఒక ఆర్థిక సంవత్సరంలో ఇచ్చిన ఆర్డర్ల కంటే ఎక్కువ ఆర్డర్లు ఇస్తామని, పెట్టుబడి డబ్బులు కూడా ఇస్తామని చెప్పారు. పెండింగ్ బకాయిలను విడుదల చేస్తామని, ఇప్పటికే రూ.180 కోట్లు విడుదల చేశామని చెప్పారు.

ఫోన్ ట్యాపింగ్‌పై నిరాధార ఆరోపణలు

- రాహుల్‌గాంధీ, మంత్రి సురేఖలపై చర్యలు తీసుకోండి
- కేంద్ర ఎన్నికల సంఘానికి బీఆర్ఎస్ ఫిర్యాదు

హైదరాబాద్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, రాష్ట్ర మంత్రి కొండా సురేఖలపై భారత రాష్ట్ర సమితి కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. రాహుల్‌గాంధీ తన తాజా పర్యటనలో ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారంటూ కేంద్ర ఎన్నికల సంఘానికి సోమవారం పంపిన ఫిర్యాదు లేఖలో పేర్కొంది. శనివారం జరిగిన తుక్కుగూడ సభలో రాహుల్‌గాంధీ ఎలాంటి సాక్ష్యాధారాలు లేకుండా దురుద్దేశ పూర్వకంగా ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని ప్రస్తావించారని, కేసీఆర్ ప్రతిష్ఠకు భంగం కలిగేలా మాట్లాడారని, ఇది ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించడమే అవుతుందని ఫిర్యాదులో తెలిపింది. ఎలాంటి ఆధారాలు లేకుండానే కేసీఆర్ ప్రస్తావనను ఫోన్ ట్యాపింగ్ అంశంతో ముడిపెడుతూ అప్పటి రాష్ట్ర ప్రభుత్వ పోలీస్, ఇంటెలిజెన్స్ వర్గాలు అధికార దుర్వినియోగం చేశాయని ఆరోపించడం పూర్తిగా అవాస్తవమని, అక్రమమని పేర్కొంది. పోలీస్ వ్యవస్థను దుర్వినియోగం చేసి, వేలాది మంది ఫోన్లను ట్యాప్ చేశారని, దీంతో ఆర్థిక ప్రయోజనాలు పొందారని రాహుల్ చేసిన వ్యాఖ్యలు అర్థరహితమని, వీటిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరింది. ఈ మేరకు రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యల తాలూకు వీడియోలను తన ఫిర్యాదుకు జతపరిచింది. తమ పార్టీ అధినేత కేసీఆర్‌కు ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంతో ఎలాంటి సంబంధం లేదని, ప్రస్తుతం విచారణ జరుగుతున్న అంశంపై మాట్లాడడం చట్ట వ్యతిరేకమని, ఆయన వ్యాఖ్యలు ఓట్లను ప్రభావితం చేసేలా ఉన్నాయని బీఆర్ఎస్ తెలిపింది. ఈ వ్యాఖ్యలపై వెంటనే విచారణ చేపట్టాలని, ఎన్నికల నియమావళిని కావాలని ఉల్లంఘించిన రాహుల్‌ను ఈ ఎన్నికల్లో ప్రచారం చేయకుండా చర్యలు తీసుకోవాలని ఈసీకి విజ్ఞప్తి చేసింది. అలాగే ఇదే ఫోన్ ట్యాపింగ్ అంశంపై మాట్లాడిన మంత్రి కొండా సురేఖపై కూడా తగిన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ ఈసీకి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కాంగ్రెస్ నాయకులు కర్నె ప్రభాకర్, దాసోజు శ్రవణ్‌లు పార్టీ తరఫున కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు.

నన్ను పడదోసే కుట్రలు

(మొదటిపేజీ తరువాయి)


నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో సమీక్ష నిర్వహిస్తున్న రేవంత్

తిరుపతిరెడ్డితో కలిసి మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు ఈ సమీక్ష నిర్వహించారు. అనంతరం కార్యకర్తలనుద్దేశించి సీఎం మాట్లాడుతూ.. కొడంగల్‌లో కాంగ్రెస్‌కు మెజారిటీ రాకుండా చేసి తనను దెబ్బకొట్టాలనే కుట్ర జరుగుతోందన్నారు. వంద రోజుల్లోనే నియోజకవర్గానికి మెడికల్, ఇంజనీరింగ్, వెటర్నరీ, నర్సింగ్, జూనియర్, డిగ్రీ కాలేజీలు తెచ్చుకున్నామని, వందల కోట్లతో తండాలకు రోడ్లు మంజూరు చేసుకున్నామని, రూ.4 వేల కోట్లతో నారాయణపేట - కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని తెచ్చుకున్నామని, గత ప్రభుత్వం విద్య, ఉద్యోగాలను విస్మరిస్తే.. తాము మూడు నెలల్లోనే 30 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని అన్నారు. ఇంత చేస్తున్న తనను ఎందుకు పడదోయాలని చూస్తున్నారని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. కరువు ప్రాంతమైన కొడంగల్‌కు ఎత్తిపోతల తెచ్చినందుకా? కాలేజీలు తెచ్చినందుకా? సిమెంటు ఫ్యాక్టరీలు తెచ్చి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే ప్రయత్నం చేస్తున్నందుకా? అని ఆయన అన్నారు. తెరచాటు కుట్రలను కాంగ్రెస్ కార్యకర్తలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. దీనిపై ప్రజలు కూడా ఆలోచించాలని అన్నారు.

నా గుండెచప్పుడు కొడంగల్..

"నేను ఎక్కడున్నా నా గుండెచప్పుడు కొడంగల్ మాత్రమే. నాతో కొట్లాడే హక్కు మీకుంది. పట్టుబట్టి పని చేయించుకునే అధికారం మీకుంది. రాష్ట్రానికే నాయకత్వం వహించే అవకాశం మనకు సోనియమ్మ ఇచ్చారు. కొడంగల్‌ను దేశంలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దుదాం" అని కాంగ్రెస్ కార్యకర్తలతో సీఎం రేవంత్ అన్నారు. కొడంగల్‌ను అభివృద్ధి చేయనీయకుండా బీజేపీ నాయకురాలు అరుణమ్మ కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీలో జాతీయ ఉపాధ్యక్ష పదవి తెచ్చుకున్న అరుణమ్మ.. పాలమూరు ఎత్తిపోతలకు జాతీయ హోదా ఎందుకు తేలేకపోయారని ప్రశ్నించారు. కాంగ్రెస్‌ను ఓడించాలని బీజేపీ, బీఆర్ఎస్ అంటున్నాయని, ఎందుకు ఓడించాలో చెప్పాలని అన్నారు. ఆడబిడ్డలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించినందుకా? రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇచ్చినందుకా? 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు అందిస్తున్నందుకా? ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నందుకా? అని నిలదీశారు. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం కొడంగల్‌లో ఏ ఒక్కరికైనా డబుల్ బెడ్రూం ఇల్లు ఇచ్చిందా ? అని సీఎం ప్రశ్నించారు. పదేళ్లుగా ప్రధానిగా ఉన్న మోదీకి మళ్లీ ఓటేసి గెలిపిస్తే ఆయనేమైనా ఇప్పుడు చంద్రమండలానికి రాజు అవుతారా? అని ఎద్దేవా చేశారు. పదేళ్లుగా ప్రధానిగా నరేంద్రమోదీ ఈ ప్రాంతానికి ఏం చేశారని ప్రశ్నించారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం తాను అత్యధిక నిధులు తీసుకువచ్చానని, ఎన్నికల తర్వాత మరిన్ని నిధులతో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. రాజకీయాలను పక్కనపెట్టి ప్రతి ఒక్కరూ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డికి కొడంగల్ నియోజకవర్గంలో 50 వేల ఓట్ల మెజారిటీ ఇవ్వాలని, తన గౌరవం తగ్గకుండా చూడాలని కార్యకర్తలను కోరారు. రాష్ట్రంలోని అన్ని ఎంపీ స్థానాలనూ గెలిపిస్తే రాహుల్‌గాంధీ ప్రధాని అవుతారని అన్నారు. కాంగ్రెస్ లోక్‌సభ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి, ఆయన సోదరుడు తిరుపతిరెడ్డి ఆరోగ్యం బాగాలేకపోయినా మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు సమీక్షలు నిర్వహించడం అభినందనీయమన్నారు. రేవంత్‌రెడ్డి శ్రమను చూసి తాను ముగ్ధుడినయ్యానని, జీవితాంతం ఆయన సూచనల మేరకు పని చేస్తానని అన్నారు.

సీఎం రేవంత్‌కు తప్పిన ప్రమాదం

కాన్వాయ్‌లో పేలిన ఓ వాహనం టైర్

వికారాబాద్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌కు ప్రమాదం తప్పింది. కాన్వాయ్‌లోని ఓ వాహనం టైర్ ఒక్కసారిగా పేలిపోయింది. డ్రైవర్ అప్రమత్తతతో ప్రమాదం తప్పింది. సోమవారం మధ్యాహ్నం సీఎం కొడంగల్ వెళ్తుండగా వికారాబాద్ జిల్లా మన్నెగూడ సమీపంలో ఒక్కసారిగా కాన్వాయ్‌లో ఉన్న ఓ ల్యాండ్ క్రూజర్ వాహనం టైర్ పేలిపోయింది. డ్రైవర్ కారును పక్కకు మళ్లించి నిలిపివేశాడు. మెకానిక్‌ను పిలిపించి పేలిన టైరును మార్పించారు.



ఉగాది పచ్చడి జీవితంలోని మంచిచెడులకు నిదర్శనం

- గవర్నర్ సీపీ రాధాకృష్ణన్
- రైతులు ఆనందంతో వెల్లివిరియాలి
- ప్రజలకు రేవంత్ ఉగాది శుభాకాంక్షలు

హైదరాబాద్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మంగళవారం నుంచి క్రోధి నామ తెలుగు సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారికి తెలంగాణ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్, రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్, తదితరులు సోమవారం ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. క్రోధి నామ సంవత్సరం ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖ సంతోషాలను నింపాలని గవర్నర్ రాధాకృష్ణన్ ఆకాంక్షించారు. ఉగాది పచ్చడి జీవితంలో ఎదురయ్యే మంచిచెడులకు నిదర్శమని తెలిపారు. కొత్త సంవత్సరంలో తెలంగాణతో పాటు దేశం అభివృద్ధి చెందాలని సోమవారం ఓ ప్రకటనలో ఆయన ఆకాంక్షించారు. కొత్త ఏడాదిలో రాష్ట్ర ప్రజలకు శుభం కలగాలని, ప్రజల ఆశలు, ఆకాంక్షలన్నీ నెరవేరాలని రేవంత్ అభిలాషించారు. కొత్త సంవత్సరంలో సమృద్ధిగా వానలు కురవాలని, రైతుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరియాలని ఆయన ఆకాంక్షించారు. నూతన సంవత్సరంలో తెలంగాణ అన్ని రంగాల్లో మెరుగైన అభివృద్ధి సాధించి, దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మన సంస్కృతి, సంప్రదాయాలు చాటిచెప్పేలా అందరూ ఉగాది పండుగను సంతోషంగా జరుపుకోవాలని రేవంత్ పిలుపునిచ్చారు. శ్రీ క్రోధి నామసంవత్సరమంతా ప్రజలు ప్రశాంతంగా జీవించాలని, అందరి జీవితాల్లో ఈ సంవత్సరం నూతన వసంతాన్ని నింపాలని కేసీఆర్ ఆకాంక్షించారు. ఉగాది నుంచి కాలచక్రం తిరిగి మొదలవుతుందని, చెట్లు చిగురిస్తూ ప్రకృతిలో నూతనోత్తేజం నెలకొంటుందని, రైతన్నలు వ్యవసాయ పనులను ఉగాది నుంచే ప్రారంభిస్తారని ఆయన సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

షకీల్ కుమారుడు రాహిల్ అరెస్టు

ప్రజాభవన్ వద్ద రోడ్డు ప్రమాదం కేసులో.. 3 నెలల తర్వాత పోలీసుల అదుపులోకి..

రంజాన్ కోసం దుబాయ్ నుంచి రాక

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రజాభవన్ వద్ద బారికేడ్లను కారుతో ఢీ కొట్టడమే కాకుండా కేసును తప్పుదోవ పట్టించి, విదేశాలకు పారిపోయిన బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ అమీర్ కుమారుడు రాహిల్ అమీర్.. ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు. గత ఏడాది డిసెంబరు 23న కారు ప్రమాదం జరగ్గా.. ఇద్దరు పోలీసు అధికారులే రాహిల్‌ను తప్పించారన్న ఆరోపణలు రావడం, విచారణ జరుగుతుండగానే నిందితుడు విదేశాలకు పారిపోవడం, సదరు పోలీసులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవడం, నిందితుడిపై లుకౌట్ నోటీసులు జారీ చేయడం.. ఇలా వరుస సంఘటనలతో ఈ కేసు పెద్ద సంచలనమైంది. తాజాగా ఎయిర్‌పోర్టు అధికారులు ఇచ్చిన సమాచారం మేరకు నాలుగు నెలల తర్వాత దుబాయ్ నుంచి వచ్చిన రాహిల్‌ను సోమవారం తెల్లవారుజామున పోలీసులు అరెస్టు చేశారు. వైద్య పరీక్షల అనంతరం నిందితుడిని న్యాయమూర్తి ముందు హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించారు. ఈ కేసు వివరాలు ఇలా ఉన్నాయి.. గత ఏడాది డిసెంబర్ 23న అర్ధరాత్రి దాటిన తర్వాత ప్రజాభవన్‌కు ఆనుకుని ఉన్న బారికేడ్లను వేగంగా వచ్చిన బీఎండబ్ల్యూ కారు ఢీకొట్టింది. అందులో ఉన్న యువతీయువకులు కారును అక్కడే వదిలేసి పారిపోయారు. నంబర్ ఆధారంగా ఆ కారు బోధన్ ఎమ్మెల్యే షకీల్‌దని, ప్రమాద సమయంలో ఆయన కుమారుడు రాహిల్ అందులో ఉన్నాడని గుర్తించారు. ప్రాథమిక విచారణ తర్వాత కారు డ్రైవర్‌ను అరెస్టు చేసి, అదే రోజు బెయిల్‌పై విడుదల చేశారు. అయితే, దీనిపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున రచ్చ జరగడంతో వెస్ట్‌జోన్ డీసీపీ విజయ్‌కుమార్ రంగంలోకి దిగి, విచారణ చేపట్టారు. సీసీ ఫుటేజీ ఆధారంగా ఆ సమయంలో కారులో ఉన్న యువకులను గుర్తించి, వేర్వేరుగా విచారించారు. కారును నడిపింది డ్రైవర్ కాదని, షకీల్ కుమారుడు రాహిలేనని వారు చెప్పేయడంతో.. ఈ కేసు పోలీసుల మెడకు చుట్టుకుంది. అసలు నిందితుడిని కాకుండా మరొకరిని అరెస్టు చేసినందుకు పంజాగుట్ట ఇన్‌స్పెక్టర్ దుర్గారావుతోపాటు అతడిని ప్రలోభపెట్టి, సాక్ష్యాలు తారుమారు చేసేలా ఒత్తిడి తెచ్చిన బోధన్ ఇన్‌స్పెక్టర్ ప్రేమ్‌కుమార్‌పైనా సస్పెన్షన్ వేటు పడింది.

ఊహించని విధంగా అరెస్టు

ప్రమాద ఘటన తర్వాత దుబాయ్ పారిపోయిన రాహిల్‌ను హైదరాబాద్ రప్పించేందుకు పోలీసులు విశ్వ ప్రయత్నాలు చేశారు. దుబాయ్‌లో ఉన్న రాహిల్‌కు లుక్ ఔట్ నోటీసులు జారీ చేశారు. ఈ అంశంపై మాజీ ఎమ్మెల్యే షకీల్ హైకోర్టును ఆశ్రయించగా ఈనెల 22 వరకు లుక్ ఔట్ నోటీసులు నిలిపివేయాలని పోలీసులను ఆదేశించిన కోర్టు.. 19వ తేదీలోగా నిందితుడు పోలీసులకు లొంగి పోయి విచారణకు సహకరించాలని సూచించింది. దీంతో తనకు పోలీసులు నోటీసులు మాత్రమే జారీ చేస్తారని భావించిన రాహిల్.. రంజాన్ నేపథ్యంలో దుబాయ్ నుంచి సోమవారం ఉదయం శంషాబాద్‌కు చేరుకున్నాడు. అయితే, ఎయిర్‌పోర్టు అధికారుల సమాచారంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వైద్య పరీక్షల అనంతరం నిందితుడిని న్యాయమూర్తి ముందు హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించారు. అనంతరం రాహిల్‌ను పోలీసులు చంచల్‌గూడ జైలుకు తరలించారు. కాగా, 2022లో జూబ్లీహిల్స్‌లో జరిగిన కారు ప్రమాదంలో ఓ చిన్నారి మరణించగా.. ఆ కారు షకీల్‌దేనని పోలీసుల విచారణలో తేలింది. అయితే, ఆ రోజు డ్రైవర్ అఫ్సాన్ కారు నడిపారని, రాహిల్ పక్కన కూర్చున్నాడని అప్పట్లో పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పుడు అధికార పార్టీ ఎమ్మెల్యేగా ఉన్న షకీల్.. కొందరు అధికారుల సహకారంతో తన కుమారుడిని జూబ్లీహిల్స్ కేసు నుంచి తప్పించారన్న విమర్శలు వెల్లువెత్తాయి. అయితే తాజా ఘటన నేపథ్యంలో ఆ కేసును సైతం రీఓపెన్ చేసేందుకు పోలీసులు కసరత్తు చేస్తున్నారు.

పాల్వంచ కేటీపీఎస్‌కు విచారణ కమిటీ?

- ఓ - ఎం ప్లాంట్ కూల్చివేత ఫైళ్ల పరిశీలన
- గోప్యత పాటించడంపై అనుమానాలు
- ఏడాదిగా పాల్వంచలో 'హెచ్ఆర్' డైరెక్టర్
- ఆయన కనుసన్నల్లోనే ప్లాంట్ కూల్చివేత, స్క్రాప్ తరలింపు

కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 8: కేటీపీఎస్ ఓఅండ్ఎం ప్లాంట్ కూల్చివేత టెండర్లు, స్క్రాప్ తరలింపులో అక్రమాలపై ఎట్టకేలకు కదలిక వచ్చింది. ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలు ప్రచురితం కావడంతో ఈ వ్యవహారాన్ని సీరియస్ తీసుకున్న జెన్‌కో సీఎండీ.. సమగ్ర వివరాలు సేకరించాలని ఉన్నతాధికారులతో ఓ కమిటీని నియమించినట్లు తెలుస్తోంది. ఈ కమిటీ శనివారం కేటీపీఎస్ ఓఅండ్ఎంకు వచ్చినా.. ఆ విషయాన్ని అత్యంత గోప్యంగా ఉంచారు. ఆదివారం సెలవు రోజైనా ఆర్టిజన్ సిబ్బందిని విధులకు పిలిపించి టెండర్లు, వర్క్ ఆర్డర్లు, స్క్రాప్ తరలింపునకు సంబంధించిన ఫైళ్లను వెలికితీసి పరిశీలించి విశ్వసనీయ సమాచారం. అయితే, ఈ కమిటీలో కేవలం డీఈ స్థాయి అధికారులను మాత్రమే నియమించారని, ఇది కంటితుడుపు చర్యేనన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంత జరుగుతున్నా కేటీపీఎస్ ఓఅండ్ఎం నుంచి ఏ ఒక్కరూ నోరు మెదపకపోవడం గమనార్హం. కాగా, కేటీపీఎస్ ఓఅండ్ఎం ప్లాంట్ కూల్చివేత, స్క్రాప్ తరలింపు యావత్తు ముంబైకి చెందిన 'హెచ్ఆర్' కంపెనీ డైరెక్టర్ కనుసన్నల్లో సాగినట్లు తెలుస్తోంది. ఏడాది నుంచి పాల్వంచలోనే మకాం వేసిన ఆయన.. ప్లాంట్ కూల్చివేత, స్క్రాప్ తరలింపు వ్యవహారాలు చక్కబెడుతున్నట్లు సమాచారం. అతి పెద్ద కంపెనీకి డైరెక్టర్‌గా ఉండి.. ఏడాదిగా పాల్వంచలో ఉండడంపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కవిటీ వచ్చిన విషయాన్ని సైతం గోప్యంగా ఉంచడం అనుమానాలకు తావిస్తోంది. ఈ వ్యవహారంపై జెన్‌కో విచారణ కమిటీతో పాటు ఖమ్మం టాస్క్‌ఫోర్స్ అధికారులు కూడా రంగంలోకి దిగి విచారణ చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యంతో

మూసీ అభివృద్ధి

- మూసీ బోర్డు సమావేశంలో సీఎస్

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మూసీనదిని పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యంతో అభివృద్ధి చేస్తామని సీఎస్ శాంతికుమారి చెప్పారు. పెట్టుబడిదారులు, వాటాదారుల విశ్వాసాన్ని పెంచడానికి మూసీ పరివాహక ప్రాంతాన్ని వేగంగా అభివృద్ధి చేసేందుకు కొన్ని ప్రాజెక్టులను గుర్తించాలని ఆమె అధికారులను కోరారు. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ 24వ బోర్డు సమావేశం సోమవారం సచివాలయంలో జరిగింది. ఈ సందర్భంగా శాంతికుమారి మాట్లాడుతూ, మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందని చెప్పారు. ఎంఆర్‌డీసీఎల్ ఎండీ ఆమ్రపాలి ప్రాజెక్ట్ అంశాలను సమావేశంలో పాల్గొన్న అధికారులకు వివరించారు.

అప్పులెంత?.. చెల్లించాల్సిన అసలు, వడ్డీలెంత?

కార్పొరేషన్లను వివరాలు కోరిన రాష్ట్ర ఆర్థిక శాఖ

- కాళేశ్వరం సహా 21 కార్పొరేషన్లకు ఉత్తర్వులు
- కేంద్ర ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉందని వెల్లడి

హైదరాబాద్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): "మీ అప్పులెంత, వాటికి చెల్లించాల్సిన అసలు, వడ్డీ సొమ్ము ఎంత, చెల్లించే మార్గమేంటి? అనే వివరాలను వెంటనే పంపించాలి" అని వివిధ ప్రభుత్వ రంగ సంస్థలను రాష్ట్ర ఆర్థిక శాఖ కోరింది. ఈ వివరాలన్నింటినీ కేంద్ర ప్రభుత్వానికి పంపించాలని పేర్కొంది. ఈ మేరకు 21 కార్పొరేషన్లు, సంబంధిత శాఖల కార్యదర్శులను ఆదేశిస్తూ రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు అంతర్గత ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలు(కార్పొరేషన్లు) ప్రభుత్వం ఇచ్చే గ్యారెంటీలతో అప్పులు తీసుకునేవి. కానీ, ఈ తరహా రుణాలపై కేంద్రం నిషేధం విధించింది. రాష్ట్ర బడ్జెట్ నుంచి కార్పొరేషన్ల రుణాలు, వడ్డీలను చెల్లించడానికి వీల్లేదని తేల్చి చెప్పింది. ఒక వేళ బడ్జెట్ నుంచి చెల్లిస్తే... ఆ వివరాలను బడ్జెట్ అప్పుల్లో చూపాలని ప్రకటించింది. కానీ, గత బీఆర్ఎస్ ప్రభుత్వం కార్పొరేషన్ల రుణాలు, చెల్లింపులను బడ్జెట్‌లో చూపలేదు. బడ్జెట్ రుణాలు, గ్యారెంటీ రుణాలు కలిపితే ఎఫ్ఆర్‌బీఎం పరిమితిని మించిపోతున్నాయని, దీన్ని దృష్టిలో ఉంచుకుని గ్యారెంటీ రుణాలను బడ్జెట్‌లో భాగంగానే పరిగణిస్తామని కేంద్రం హెచ్చరించింది. ఇందులో భాగంగానే ఇటీవల కార్పొరేషన్ల రుణాల వివరాలను పంపించాలంటూ అన్ని రాష్ట్రాలను కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర ఆర్థిక శాఖ కూడా కార్పొరేషన్ల నుంచి వివరాలు కోరింది. టీఎస్ హార్టికల్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, టీఎస్ షీప్ అండ్ గోట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, తెలంగాణ స్టేట్ డెయిరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్, ఫిషరీస్ కోఆపరేటివ్ ఫెడరేషన్, టీఎస్ డిస్కమ్స్, తెలంగాణ స్టేట్ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్, తెలంగాణ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ కార్పొరేషన్, టీఎస్ఐఐసీ, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ, జీహెచ్ఎంసీ, హైదరాబాద్ మెట్రో రైల్, తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, తెలంగాణ డ్రింకింగ్ వాటర్ సప్లయ్ కార్పొరేషన్(మిషన్ భగీరథ), టీఎస్ఆర్టీసీ, తెలంగాణ స్టేట్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, తెలంగాణ స్టేట్ వాటర్ రిసోర్సెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ కార్పొరేషన్, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్, తెలంగాణ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ కార్పొరేషన్, తెలంగాణ హౌసింగ్ బోర్డుకు ఆదేశాలు జారీ చేసింది. కార్పొరేషన్ల అప్పులు ఎంత ? స్పెషల్ పర్పస్ వెహికల్(ఎస్‌పీవీ)ల ద్వారా ఏమైనా అప్పులు తీసుకున్నారా? అసలు, వడ్డీ చెల్లింపులు ఎంత? రాష్ట్ర బడ్జెట్‌కు సంబంధం లేకుండా చెల్లించాల్సినవి ఎంత? సొంత సెస్సులు, పన్నుల ద్వారా చెల్లించాల్సిన సొమ్ము ఎంత? అప్పులను చెల్లించడానికి ఇతర రాబడి మార్గాలేమైనా ఉన్నాయా? అన్న వివరాలు పంపించాలని ఆర్థిక శాఖ కోరింది. ఇందుకోసం నిర్దేశిత ప్రొఫార్మాను రూపొందించి, దాని ప్రకారం వివరాలు ఇవ్వాలని సూచించింది.



25 కోట్ల సన్ పరివార్ ఆస్తులు అటాచ్

» ఈడీ చర్య.. వాటిలో స్థిర, చర ఆస్తులు

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): అధిక లాభాల పేరుతో వేలాది మంది అమాయకుల నుంచి రూ. 158 కోట్లు వసూలు చేసి మోసానికి పాల్పడ్డ కేసులో సన్ పరివార్ సంస్థకు చెందిన రూ. 25.2 కోట్ల విలువైన స్థిర, చర ఆస్తుల్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అటాచ్ చేసింది. సన్ పరివార్‌తోపాటు మరికొన్ని సంస్థల పేర్లతో మెతుకు రవీందర్, అతని కుటుంబసభ్యులు, ఇతరులు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన సుమారు 10 వేల మంది నుంచి రూ. 158 కోట్లు వసూలు చేశారు. సంస్థలో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మించి డిపాజిట్లు సేకరించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గతంలో సైబరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సైబరాబాద్ పోలీసులు నమోదు చేసిన కేసు ఆధారంగా మనీలాండరింగ్ చట్ట ప్రకారం ఈడీ విచారణ చేపట్టింది. విచారణలో భాగంగా రవీందర్, కుటుంబసభ్యులతోపాటు ఇతరులకు చెందిన సన్ పరివార్ ఆస్తులు అటాచ్ చేసినట్లు ఈడీ అధికారులు సోమవారం వెల్లడించారు.

కాళేశ్వరంపై కావాలనే సర్కారు దుష్ప్రచారం

» సొంత డబ్బుతో కొదురుపాకలో బడి నిర్మాణం: కేటీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే అసత్య ఆరోపణలు చేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఆ ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మల్లన్నసాగర్ ద్వారానే హైదరాబాద్ నగరవాసులకు ఇప్పుడు తాగునీటిని అందించనున్నారని వెల్లడించారు. తెలంగాణ భవిష్యత్తు తరాలకు ఇది పెద్ద వరమనేది వాస్తమన్నారు. ఈమేరకు సోమవారం 'ఎక్స్'లో పేర్కొన్నారు. సిరిసిల్ల జిల్లా చొప్పదండి నియోజకవర్గంలోని కొదురుపాకలో కొత్త పాఠశాల భవనాన్ని నిర్మించినట్లు కేటీఆర్ తెలిపారు. ఆ పాఠశాల భవనం ఫొటోలను 'ఎక్స్'లో పోస్టు చేశారు. అమ్మమ్మ లక్ష్మి, తాత జె.కేశవరావు జ్ఞాపకార్థం.. సొంత డబ్బులతో పాఠశాల భవనాన్ని నిర్మించానని వెల్లడించారు.

సాగర్ కుడి కాల్వకు నీటి విడుదల

నాగార్జునసాగర్, ఏప్రిల్ 8: నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ పరిధిలో కుడికాల్వ కింద ఉన్న గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల ప్రజల తాగునీటి అవసరాలకు ప్రాజెక్టు అధికారులు సోమవారం నీటిని విడుదల చేశారు. కేఆర్ఎంబీ ఈఈ శివశంకరయ్య పర్యవేక్షణలో కుడికాల్వ 5, 7 గేట్ల ద్వారా 5500 క్యూసెక్కుల నీటిని సాగర్ ప్రాజెక్ట్ ఈఈ(ఏపీ) శ్రీహరి హెడ్ రెగ్యులేటర్ వద్ద స్విచ్చాన్ చేసి విడుదల చేశారు. అనంతరం శ్రీహరి మాట్లాడుతూ, తాగునీటి అవసరాల నిమిత్తం రోజుకు 5500 క్యూసెక్కుల చొప్పున 10 రోజులు 5 టీఎంసీల నీటిని కుడికాల్వకు విడుదల చేస్తామని తెలిపారు.

నల్లమలలో కొనసాగుతున్న కార్చిచ్చు

మన్ననూర్, ఏప్రిల్ 8: నాగర్‌కర్నూలు జిల్లా పరిధిలోగల నల్లమల పులుల అభయారణ్యంలో రేగిన కార్చిచ్చు కొనసాగుతోంది. శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు తాళ్ల చెలక, గుండం అభయారణ్య ప్రాంతంలో చెలరేగిన మంటలను అటవీ ఫైర్ సిబ్బంది అదుపు చేశారు. మళ్లీ సోమవారం ఉదయం అమ్రాబాద్ రేంజ్ పరిధిలో గల దారవాగు బేస్ క్యాంపు సమీప అడవి, మన్ననూరు వ్యవసాయ పొలాలకు అంచునే గల గుట్టల్లో భారీ ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. మన్ననూరు రేంజ్ పరిధిలో గల పర్హాబాద్ బీట్ సమీప అడవుల్లో మంటలు ఏర్పడ్డాయి. రేంజ్ అధికారుల ఆదేశాల మేరకు స్పందించిన క్విక్ రెస్పాన్స్ టీం, బేస్ క్యాంపు వాచర్లు వేర్వేరు బృందాలుగా విడిపోయి బ్రోయర్ల సహాయంతో మంటలను అదుపులోకి తీసుకువచ్చేందుకు యత్నిస్తున్నారు.

బిల్లుల చెల్లింపునకు చర్యలు తీసుకోండి

హైదరాబాద్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్ బిల్లుల చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని డీజీపీ రవిగుప్తాకు పోలీసు అధికారుల సంఘం విజ్ఞప్తి చేసింది. ఈమేరకు సంఘం అధ్యక్షుడు గోపిరెడ్డి నేతృత్వంలో డీజీపీని ఆయన కార్యాలయంలో సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. టీఏ, సరెండర్ లీవ్ బిల్లులు, జీపీఎఫ్, మెడికల్ రీయింబర్స్‌మెంట్ చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

కాళేశ్వరంలో లక్ష కోట్ల కుంభకోణం

» మేడిగడ్డ పర్యటనలో సీపీఎం నేతలు

భూపాలపల్లి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో లక్ష కోట్ల కుంభకోణం జరిగిందని సీపీఎం ప్రతినిధి బృందం ఆరోపించింది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బ్యారేజీని ఆ పార్టీ కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య, నాగయ్య, సాగర్ మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి సోమవారం సందర్శించారు. కుంగిపోయిన ఏడో బ్లాక్‌లోని 19, 20, 21, 22వ పియర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మేడిగడ్డ బ్యారేజీ అతి తక్కువ కాలంలోనే దెబ్బతినడం ప్రాజెక్టులో జరిగిన అవినీతికి నిదర్శనమన్నారు. ప్రభుత్వం అఖిలపక్షంతో చర్చించి సమగ్ర విచారణ చేపట్టాలని, దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు.

ఈ సర్కారు మనుగడ అనుమానమే

» మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు



సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 8 : ఏ రాష్ట్రంలోనూ కాంగ్రెస్ ఐదేళ్లకంటే ఎక్కువ పాలన చేయలేదని, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని రోజులుంటుందో తెలియని పరిస్థితి ఉందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సోమవారం సిద్దిపేటలో నిర్వహించిన నియోజకవర్గస్థాయి యువత సన్నాహక సమావేశానికి హరీశ్‌రావు, ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పి.వెంకట్రామారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా హరీశ్ మాట్లాడుతూ కాంగ్రెస్ మోసాలను ఎక్కడికక్కడ ఎండగట్టాలన్నారు. దుబ్బాకలో చెల్లని రూపాయి మెదక్‌లో చెల్లుతుందా అని మండిపడ్డారు. సిద్దిపేట మీద పగ, ద్వేషం వెళ్లగక్కుతున్న రేవంత్‌రెడ్డి వెటర్నరీ కళాశాలను కొడంగల్‌కు ఎత్తుకెళ్లారని, రూ.150 కోట్ల నిధులు రద్దు చేశారని ఆరోపించారు.

పొద్దు తిరుగుడును పూర్తిగా కొనండి : సీఎంకు హరీశ్ లేఖ

హైదరాబాద్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పండించిన పొద్దు తిరుగుడు పంటను చివరి గింజ వరకు కనీస మద్దతు ధర 6,760 చెల్లించి కొనుగోలు చేయాలని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం ఆయన సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. ఉమ్మడి మెదక్, నిజామాబాద్ జిల్లాలతో రాష్ట్రంలోని పలు ప్రాం తాల్లో 20,829 ఎకరాల్లో ఈసారి రైతులు పొద్దు తిరుగుడు పండించారని తెలిపారు.

కవితకు బెయిలిస్తే మొదటికే మోసం

(మొదటి పేజీ తరువాయి)



అందుకున్న తర్వాత.. కవిత తన ఫోన్లలోని సమాచారాన్ని విధ్వంసం చేసినట్టు ఫోరెన్సిక్ నివేదికలో తేలిందని, ఆమె సాక్షులను ప్రభావితం చేశారన్న విషయం కూడా స్పష్టమైందని న్యాయమూర్తి పేర్కొన్నారు. కవిత తరఫున బినామీగా వ్యవహరించిన అరుణ్ పిళ్లై.. కవితపై దర్యాప్తు మొదలైన తర్వాతే తన స్టేట్ మెంట్‌ను మార్చినట్టు ఈడీ వెల్లడించిన విషయాన్ని న్యాయమూర్తి గుర్తుచేశారు. కాబట్టి, ఈ సమయంలో కవితకు బెయిల్ ఇస్తే ఆమె సాక్ష్యాలను తారుమారు చేసే ప్రమాదం ఉందని అభిప్రాయపడ్డారు. కవిత మహిళ అయినప్పటికీ ఆమెకు బెయిల్ ఇవ్వకపోవడానికి ఇవే ప్రధాన కారణాలని న్యాయమూర్తి కావేరి భవేజా వివరించారు. కవిత కుమారుడికి సగం పరీక్షలు ఇప్పటికే ముగిశాయని.. అతని వద్ద సోదరుడు, తండ్రి, పిన్ని తదితరులు ఉన్నారని న్యాయమూర్తి గుర్తుచేశారు. అసలు కవిత కుమారుడు ఏం చదువుతున్నాడు? ఎన్నిరోజులు బెయిల్ కావాలి? అనే అంశాలపై స్పష్టత ఇవ్వలేదని.. అతడి వద్ద ఉన్న సన్నిహిత బంధువులు అతనికి ఎందుకు మానసిక మద్దతు అందించలేరో వివరించలేదని పేర్కొన్నారు. తల్లి పక్కన లేకపోతే.. పిల్లవాడు పరీక్షలకు సంబంధించి భావోద్వేగానికి గురవుతాడన్న కారణం బలమైనది కాదని ఆమె అభిప్రాయపడ్డారు. కవిత 19 ఏళ్ల పెద్ద కుమారుడు స్పెయిన్‌లో తల్లిదండ్రులు తన పక్కన లేకుండానే చదువుకో గలుగుతున్నప్పుడు.. బంధువులు పక్కన ఉండగా చిన్న కుమారుడు పరీక్షలు ఎందుకు రాయలేడని ప్రశ్నించారు. న్యాయ పోరాటంలో ఉన్నందు వల్ల తండ్రి పక్కన లేడనే వాదన కూడా సరైంది కాదని, పిల్లవాడి పరీక్షలు తండ్రికి ప్రాధాన్యం కాదని దీన్ని బట్టి తెలుస్తోందని వ్యాఖ్యానించారు. టెక్నాలజీ యుగంలో తండ్రి ఇతర బంధువులు, సోదరుడు డిజిటల్ ఉపకరణాల ద్వారా కూడా కవిత కుమారుడితో సంబంధాలు ఏర్పరుచుకోవచ్చని కోర్టు అభిప్రాయపడింది. చదువుకున్న, సంపన్నులైన మహిళలు ఈరోజుల్లో వ్యాపారాలు నిర్వహిస్తున్నారని, అక్రమ కార్యకలాపాలకు కూడా పాల్పడుతున్నారని, అందువల్ల కోర్టు అలాంటి వారికి బెయిల్ ఇచ్చేముందు న్యాయ సమ్మతంగా వ్యవహరించాల్సి ఉంటుందని న్యాయమూర్తి పేర్కొన్నారు. కవిత హైదరాబాద్‌లో ఇంజినీరింగ్, అమెరికాలో ఎంఎస్ చదివారని.. గతంలో ఎంపీగా, ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్నారని కోర్టు గుర్తించింది. పార్లమెంట్‌లో అనేక కమిటీల్లో ఆమె సభ్యురాలిగా ఉన్నారని, 2005 నుంచి భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జాతీయ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించినట్టు కవిత చెప్పుకున్నారని కోర్టు గుర్తుచేసింది. వీటన్నింటి బట్టి చూస్తే ఆమెపై కేసును బనాయించి బలిపశువుగా మార్చారని నమ్మడానికి వీలులేదని కోర్టు అభిప్రాయపడింది. కవిత కేవలం మహిళ అన్న పేరుతో ఆమె పట్ల దాక్షిణ్యం ప్రదర్శించలేమని స్పష్టం చేసింది. అయితే.. రెగ్యులర్ బెయిల్ పై ఈ నెల 16న విచారించనున్నట్టు న్యాయస్థానం తెలిపింది.

అప్రూవర్లుగా ఇద్దరు!

(మొదటి పేజీ తరువాయి)

సమాచారాన్ని సేకరించినట్లు తెలిసింది. ఈ కేసులో నిందితులకు పక్కాగా శిక్షలు పడేలా దర్యాప్తు అధికారులు ముందుకు సాగుతున్నారు. ఈ క్రమంలో పలు విషయాల్లో అత్యంత గోప్యత పాటిస్తున్నారు. నిజానికి ఇప్పటి వరకు అరెస్టయిన అధికారులు-- టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు, మాజీ అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న, మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు, వేణుగోపాలరావు విచారణలో "ప్రభాకర్‌రావు చెప్పినట్లు చేశాం" అని మాత్రమే పేర్కొన్నారు. అయితే.. ట్యాపింగ్ వ్యవహారానికి సూత్రధారి ఎవరు? అనేది తెలియాలంటే.. ప్రభాకర్‌రావు అరెస్టవ్వాల్సిందే. ఆయన విచారణలోనే గత ప్రభుత్వంలో ఎవరు తనతో ట్యాపింగ్ చేయించారు? ఇక్విప్‌మెంట్ కొనుగోలుకు నిధులు సమకూర్చిందెవరు? అనే వివరాలు వెలుగులోకి వస్తాయి. అంతేకాదు.. పక్కాగా వాంగ్మూలాలు, సాక్ష్యాలు, ఆధారాలు ఉంటేనే.. కోర్టులో ఈ కేసు నిలబడుతుంది. అయితే.. నిందితుల్లో ఎవరైనా అప్రూవర్‌గా మారి, నేరం జరిగిన తీరును వివరిస్తే.. దర్యాప్తు అధికారులు ఆధారాలకోసం పెద్దగా ప్రయత్నించాల్సిన అవసరం ఉండదు. అయితే.. అప్రూవర్‌గా మారే వారు నిందితుల జాబితాలో ఉండాలి. కోర్టు అనుమతితోనే వారిని అప్రూవర్‌గా గుర్తించాల్సి ఉంటుంది. సాక్షులుగా మారిన ఆ ఇద్దరు అధికారుల పాత్ర ఈ కేసులో ఉన్నట్లు రాధాకిషన్‌రావు విచారణలో తేలినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో దర్యాప్తు అధికారులు వారిద్దరినీ నిందితులుగా చూపించి, ఆ తర్వాత అప్రూవర్లుగా మారే అవకాశం కల్పిస్తారని సమాచారం.

నగరానికి చెందిన కంపెనీ ద్వారా కొనుగోలు!

టార్గెట్ ఫోన్ చేతికి రాకుండానే.. ఆ డివైజ్‌ను ట్యాప్ చేసే సాంకేతికతను ఇజ్రాయెల్ లాంటి దేశాల నుంచి దిగుమతి చేసుకుంటుంటారు. అయితే.. ఈ ఎపిసోడ్‌లో ప్రభాకర్‌రావు అండ్ కో మాత్రం నగరానికి చెందిన ఓ కంపెనీ వద్ద ట్యాపింగ్ పరికరాలను కొనుగోలు చేసినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో.. ఆ కంపెనీ నిర్వాహకులను సైతం విచారించాలని దర్యాప్తు అధికారులు నిర్ణయించినట్లు సమాచారం.

రేపటితో ముగియనున్న రాధాకిషన్ కస్టడీ

రాధాకిషన్‌రావు కస్టడీ బుధవారంతో ముగియనుంది. దీంతో.. మంగళ, బుధవారాల్లో రాధాకిషన్ అండ్ కో కలిసి ఏయే వ్యాపారులను టార్గెట్‌గా చేసుకున్నారు? ఎన్నికల సమయంలో డబ్బు తరలింపు ఎవరి కోసం జరిగింది? ఏయే నియోజకవర్గాల్లో డబ్బు పంపిణీ కొనసాగింది? అనే ప్రశ్నలకు సమాధానాలను రాబట్టాలని నిర్ణయించినట్లు సమాచారం. మరోవైపు దర్యాప్తు అధికారులు గతంలో టాస్క్‌ఫోర్స్‌లో పనిచేసిన ఓ ఇన్‌స్పెక్టర్, నల్లగొండ జిల్లాకు చెందిన నలుగురు కానిస్టేబుళ్లను విచారించారు. మహబూబ్‌నగర్, సిరిసిల్ల 'ట్యాపింగ్ సెంటర్ల'లో పని చేసినట్లు అనుమానిస్తున్న ఒకరిద్దరు ఇన్‌స్పెక్టర్లు, పలువురు కానిస్టేబుళ్లను కూడా విచారించనున్నట్లు తెలిసింది.

ఆరోపణలను ఖండిస్తున్నా: ఎమ్మెల్సీ

కూకట్‌పల్లి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారంలో కొన్ని రోజులుగా తనపై మీడియా, సోషల్ మీడియాలో వస్తున్న ప్రసారాలను ఖండిస్తున్నానని, అవన్నీ అసత్య ప్రచారాలని ఎమ్మెల్సీ కుర్మయ్యగారి నవీన్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫోన్‌ట్యాపింగ్‌తో తనకు ఎటువంటి సంబంధంలేదని, ఈ వ్యవహారంలో తనపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని వాపోయారు. జూబ్లీహిల్స్‌లోని తన గెస్ట్‌హౌస్‌లో తనిఖీలు అంటూ మీడియాలో వస్తున్న వార్తలు అవాస్తవాలని, తన ఇంట్లో గానీ, గెస్ట్‌హౌస్‌లోగానీ పోలీసుల తనిఖీలు జరగలేదన్నారు. కొందరు కుట్రపూరితంగా తనపై అసత్య ప్రచారం చేస్తున్నారని, వారిపై చట్టపరంగా చర్యలు తీసుకొంటామన్నారు. మీడియా, సోషల్ మీడియాలో తప్పుడు కథనాలు ప్రచురించిన వారిపై న్యాయస్థానంలో కేసు నమోదు చేస్తామని, పోలీసులకు కూడా ఫిర్యాదు చేయనున్నట్లు నవీన్‌కుమార్ తెలిపారు.

నేలకొండపల్లి మామిడితోటలో ట్యాపింగ్ అడ్డా

నేలకొండపల్లి, ఏప్రిల్ 8: ఖమ్మం జిల్లాలోనూ ఫోన్‌ట్యాపింగ్ జరిగినట్లు పంజాగుట్ట పోలీసులు గుర్తించారు. ఎన్నికలకు ముందు.. నేలకొండపల్లి మండలం పైనంపల్లి రెవెన్యూ పరిధిలోని ఓ మామిడి తోటలో ఫోన్‌ట్యాపింగ్ పరికరాలను అమర్చినట్లు ప్రచారం జరుగుతోంది. అప్పట్లో బీఆర్ఎస్ అసంతృప్తులుగా ఉండి.. ప్రస్తుతం కాంగ్రెస్‌లో ఉన్న మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుతోపాటు.. పలువురు ప్రముఖులే టార్గెట్‌గా ప్రభాకర్‌రావు అండ్ కో ఇక్కడ ట్యాపింగ్ పరికరాలను అమర్చినట్లు తెలుస్తోంది. ఇటీవల నిందితుల విచారణలో ఈ విషయం వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే ఎస్ఐబీకి చెందిన ఓ బృందం సోమవారం ఈ మామిడితోటను పరిశీలించినట్లు తెలిసింది. తోట పరిసరాల్లో ఉండేవారిని ఈ బృందం ప్రశ్నించినట్లు సమాచారం.

యువకుడిని హతమార్చి.. ఇన్‌స్టాలో షేరింగ్

(మొదటి పేజీ తరువాయి)



మృతుడు తేజస్

ఉండేవాడు. 2023 అక్టోబరులో.. దసరా పండుగ రోజున తరుణ్ అనే యువకుడి హత్య జరిగింది. ఈ కేసులో తేజస్ ఏ3గా ఉన్నాడు. జైలుకు వెళ్లాడు. రెండు నెలల క్రితం బయటకు వచ్చి.. తన తల్లితో కలిసి ప్రగతినగర్ బతుకమ్మ కుంట వద్ద అద్దెకు ఉంటున్నాడు. అతని స్నేహితులు రోజూ తేజస్ ఇంటికి వచ్చి, మద్యం సేవించేవారు. ఆదివారం తేజస్ తల్లి ఊరెళ్లారు. ఆదివారం రాత్రి కూడా మహేశ్ అనే పేరున్న ఇద్దరు మిత్రులు, శివప్ప అనే స్నేహితుడితో కలిసి తేజస్ మద్యం సేవించాడు. తరుణ్ మిత్రులకు శివప్ప ఈ విషయాన్ని చేరవేశాడు. తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో సమీర్ అనే యువకుడితోపాటు.. మొత్తం 10 మంది ద్విచక్ర వాహనాలపై అక్కడికి చేరుకున్నారు. మూడో అంతస్తులో ఉన్న తేజస్‌ను కిందకు తీసుకువచ్చారు. మద్యం మత్తులో ఉన్న తేజస్ ప్రతిఘటించలేకపోయాడు. తేజస్‌ను చుట్టుముట్టిన దుండగులు.. కత్తితో 12 చోట్ల విచక్షణారహితంగా పొడిచారు. ఆ తర్వాత ఓ బండరాయితో తలపై మోదారు. దుండగుల్లో సగం మంది అక్కడి నుంచి పరారవ్వగా.. మిగతావారు హత్య దృశ్యాలను చిత్రీకరించారు. సిద్దిఖ్ అనే పేరుతో ఇన్‌స్టాగ్రామ్‌లో ఆ దృశ్యాలను పోస్ట్ చేశారు. బైక్‌పై తిరిగి వెళ్తూ.. కత్తిని చూపిస్తూ.. "హత్య చేశాం.. స్నేహితుడి హత్యకు ప్రతీకారం తీర్చుకున్నాం" అని పేర్కొన్నారు. తేజస్ స్నేహితులు, హత్య చేసిన గుంపులోని సగం మంది యువకులు సోమవారం తెల్లవారుజాము వరకు మృతదేహం వద్దే ఉన్నారు. సోమవారం ఉదయం 5.30 సమయంలో సమాచారం అందుకున్న బాచుపల్లి పోలీసులు.. సంఘటనాస్థలానికి చేరుకున్నారు. మృతుడి ముగ్గురు మిత్రులతోపాటు.. సమీర్‌ను అరెస్టు చేసినట్లు పోలీసులు చెప్పారు. సమీర్ ఒక్కడే ఈ దారుణానికి పాల్పడినట్లు ప్రాథమికంగా గుర్తించామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. పాత కక్షలే ఈ హత్యకు కారణమని కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు వెల్లడించారు.

ఎప్‌సెట్ అభ్యర్థులకు 'ఎడిట్' ఆప్షన్

» ఈ నెల 12 వరకు అవకాశం

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఎప్‌సెట్)-2024కు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు... వివరాల్లో మార్పులు, చేర్పులు చేసుకునేందుకు జేఎన్‌టీయూ అధికారులు ఎడిట్ ఆప్షన్ ఇచ్చారు. ఈ నెల 8వ తేదీ నుంచి 12వ తేదీ వరకు ఈ సదుపాయం అందుబాటులో ఉంటుందని సెట్ కో-కన్వీనర్ విజయకుమార్ రెడ్డి తెలిపారు. తల్లిదండ్రుల పేర్లలో దొర్లిన తప్పులు, వారి ఇన్‌కమ్ రేంజ్, పుట్టిన ప్రాంతం, చదివిన ప్రాంతం, జెండర్, మీడియం, స్పెషల్, బ్రిడ్జికోర్సు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల రిజిస్ట్రేషన్ నెంబర్ల సవరణకు అవకాశం ఉంటుందన్నారు. పుట్టినతేదీ, మరేవైనా వివరాల్లో తప్పులను సవరించుకోవాలనుకుంటే సంబంధిత(ఎస్ఎస్‌సీ, కుల) ధ్రువపత్రాలను దరఖాస్తుకు జతచేసి టీఎస్ ఎప్‌సెట్ వెబ్‌సైట్‌లో పేర్కొన్న ఈ-మెయిల్‌కు పంపాలని తెలిపారు.

షార్ప్ భారత్ ఛైర్మన్‌గా కారంపురి

హైదరాబాద్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఐఫోన్ల తయారీ సంస్థ ఫాక్స్‌కాన్ గ్రూప్ కంపెనీ షార్ప్ భారత వ్యవహారాల ఛైర్మన్‌గా సుజయ్ కారంపురిని నియమించింది. కంపెనీ డిస్‌ప్లే విభాగానికి సంబంధించిన బాధ్యతలను ఆయన నిర్వహిస్తారని కంపెనీ సీఈవో రాబర్ట్ సోమవారం తెలిపారు. సుజయ్ నియామకంతో భారత్‌లో తమ డిస్‌ప్లే వ్యాపారం మరింత విస్తరిస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. తన నియామకంపై సుజయ్ సంతోషం వ్యక్తం చేశారు. ఆయన గతంలో ప్రభుత్వంలో టీ-ఫైబర్, టీ-వర్క్స్, ఎలక్ట్రానిక్స్ విభాగాలకు సీఈవోగా పనిచేశారు.

ఎస్‌వోసీపై ఏపీకి చుక్కెదురు!

గడువు ఇక పెంచబోమన్న బ్రిజేశ్ ట్రైబ్యునల్

» ఈ నెల 29లోగా దాఖలు చేయాలని ఆదేశం

» కేసుల విచారణకు కోడ్ అడ్డంకి కాదని స్పష్టీకరణ

» మే 15-17 మధ్య తదుపరి విచారణకు నిర్ణయం



హైదరాబాద్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పునఃపంపిణీకి సంబంధించి స్టేట్‌మెంట్ ఆఫ్ కేస్ (ఎస్‌వోసీ) దాఖలు విషయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చుక్కెదురైంది. కృష్ణా జలాల పునఃపంపిణీకి కేంద్రం జారీ చేసిన అదనపు విధివిధానాల (టీవోఆర్)పై ఎస్‌వోసీ దాఖలు చేయడానికి జూన్ చివరి వరకు గడువు పొడిగించాలన్న ఏపీ విజ్ఞప్తిని జస్టిస్ బ్రిజేశ్‌కుమార్ నేతృత్వంలోని కృష్ణా ట్రైబ్యునల్-2 తిరస్కరించింది. గడువు పెంచే ప్రసక్తే లేదని, ఈ నెల 29లోగా ఎస్‌వోసీ దాఖలు చేయాలని ఏపీని ఆదేశించింది. ఆ తేదీ నుంచి రెండు వారాల్లోగా ఎదుటి పక్షం దాఖలు చేసిన ఎస్‌వోసీపై కౌంటర్ దాఖలు చేయాలని తెలంగాణ, ఏపీ రాష్ట్రాలను ఆదేశించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి బచావత్ ట్రైబ్యునల్ (కృష్ణా ట్రైబ్యునల్-1) గంపగుత్తగా కేటాయించిన 811 టీఎంసీలతోపాటు ఇతర కేటాయింపులను ఏపీ, తెలంగాణ మధ్య పునఃపంపిణీ చేసేందుకు కృష్ణా ట్రైబ్యునల్-2కు అదనపు విధివిధానాలను జారీ చేస్తూ కేంద్రం 2023 అక్టోబరు 10న గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. దీనిపై రెండు రాష్ట్రాలు తమ వాదనలతో ఎస్‌వోసీలు దాఖలు చేయడానికి ట్రైబ్యునల్ తొలుత మార్చి 20 వరకు గడువు విధించింది. దీంతో అదే రోజు తెలంగాణ ఎస్‌వోసీ దాఖలు చేసింది. ఏపీ మాత్రం దాఖలు చేయకుండా.. గడువు పొడిగించాలని కోరుతూ ఈ నెల 4న మధ్యంతర దరఖాస్తును దాఖలు చేసింది. అయితే దీనిని తిరస్కరించిన ట్రైబ్యునల్.. మే 15 నుంచి 17 వరకు తదుపరి విచారణ నిర్వహిస్తామని పేర్కొంది. ఈ మేరకు ట్రైబ్యునల్ సోమవారం ఢిల్లీలో సమావేశమై అదనపు టీవోఆర్‌పై విచారణ నిర్వహించింది. తెలంగాణ తరఫున సీఎస్ వైద్యనాథన్, ఏపీ తరఫున జయదీప్ గుప్తా వాదనలు వినిపించారు.

ఏపీ వాదనలపై తెలంగాణ అభ్యంతరం..

ఏపీలో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున విధాన నిర్ణయాలను ప్రకటిస్తూ ఎస్‌వోసీ దాఖలు చేయలేమని ఆ రాష్ట్రం చేసిన వాదనలను తెలంగాణ తీవ్రంగా వ్యతిరేకించింది. తెలంగాణ రాష్ట్రంలోనూ లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లో ఉందని, అయినా తాము ఎస్‌వోసీ దాఖలు చేశామని గుర్తు చేసింది. కేసుల విచారణపై ఎన్నికల కోడ్ ప్రభావం ఉండదని స్పష్టం చేసింది. కాలయాపన కోసమే ఏపీ గడువు పొడిగింపును కోరుతోందని ఆరోపించింది. చివరిసారిగా గడువును పొడిగించాలని ఏపీ కోరగా, గతంలో కూడా ఏపీ ఇలాగే గడువును పొడిగింపజేసుకుందని తెలంగాణ ఆక్షేపించింది. రెండు పక్షాల వాదనలు విన్న తర్వాత ఎన్నికల కోడ్ కారణంగా గడువు పొడిగించాలన్న ఏపీ విజ్ఞప్తిని ట్రైబ్యునల్ తిరస్కరించింది. ఇదిలా ఉండగా.. కృష్ణా జలాల్లో ఉమ్మడి ఏపీకి ఉన్న 1050 టీఎంసీల వాటాలో 798 టీఎంసీలను తమకే కేటాయించాలని ట్రైబ్యునల్‌కు సమర్పించిన ఎస్‌వోసీలో తెలంగాణ విజ్ఞప్తి చేసింది. నిర్మాణం పూర్తయి.. వినియోగంలో ఉన్న ప్రాజెక్టులకు 299 టీఎంసీలు, నిర్మాణంలోని ప్రాజెక్టులకు 238 టీఎంసీలు, భవిష్యత్తులో నిర్మించనున్న ప్రాజెక్టులకు 216 టీఎంసీలు, తాగునీటి అవసరాలకు 36 టీఎంసీలు కలిపి మొత్తం 789 టీఎంసీలు కేటాయించాలని నివేదించింది. కనీస మొత్తంగా 75 శాతం లభ్యత (డిపెండబిలిటీ) ఆధారంగా 555 టీఎంసీలు, 65 శాతం లభ్యత ఆధారంగా 575 టీఎంసీలు కేటాయించాలని కోరింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఎండలు–ఎన్నికలు

ఎండలు మండిపోతాయి జాగ్రత్త అంటూ భారతవాతావరణశాఖ గట్టిగా హెచ్చరించడం ఇటీవలి సంవత్సరాల్లో మరీ ఎక్కువైంది. పదేళ్ళుగా దేశంలో ఎండల తీవ్రత పెరిగిందట. ఐఎండీ హెచ్చరికలకంటే ముందుగానే సూర్యుడు తన ఉగ్రరూపాన్ని ప్రదర్శించడం మొదలెట్టేస్తున్నాడు. ఫిబ్రవరి చివర్లోనే వేడి తగలడం మొదలైపోతోంది. ఈ ఏడాది ఇప్పటికే నమోదవుతున్న ఉష్ణోగ్రతలను బట్టి రాబోయే రోజులు ఎలా ఉంటాయన్న భయం కలుగుతోంది. నీటి కొరతసహా వేసవి అనుభవం అప్పుడే పలు రీతుల్లో కనిపిస్తోంది.

గత ఏడాదికంటే ఈ వేసవి మరింత తీవ్రంగా ఉంటుందని, మరిన్ని వడగాడ్పులు పడాల్సివస్తుందని ఐఎండీ అంటోంది. భూగర్భజలాలు వేగంగా అడుగంటుతున్నాయి, జలాశయాలు ఎండిపోతున్నాయి. ఉష్ణోగ్రతల పెరుగుదల మీదే కాక, వర్షపాతాన్ని ప్రమాదకరమైన స్థాయిలోకి తగ్గించే శక్తి ఎల్‌నినోకు ఉన్నది. గత ఏడాది రుతుపవనాల ప్రవేశంలో జాప్యం, ఓ మూడునెలలు వర్షాలు మెరుగ్గానే పడినా ఆ తరువాత వాటిజాడలేకుండా పోవడంతో నీటిసమస్యకు అప్పట్లోనే బీజాలుపడ్డాయి. రాబోయే కాలంలో వడగాడ్పులు సంఖ్యరీత్యా, విస్తృతి రీత్యా రెట్టింపవుతాయని ఐఎండీ అంటోంది. చెప్పినట్టుగానే తెలుగురాష్ట్రాలతో సహా దేశంలోని చాలా రాష్ట్రాలు గరిష్ఠ ఉష్ణోగ్రతలతో గడగడలాడిపోతున్నాయి. ఎండలు, వడగాడ్పులకు తోడుగా నీరు కూడా కరువైతే ప్రజలు అల్లాడిపోతారు, పశుపక్ష్యాదులు ప్రాణంవదిలేస్తాయి. ముంచుకొస్తున్న గడ్డుకాలాన్ని దాటడానికి ప్రభుత్వాలు ప్రతీ అడుగూ అతిజాగ్రత్తగా వేయాల్సి ఉంటుంది. నీటి వనరులను సమర్థంగా నిర్వహించడంతోపాటు, ఉద్యోగ, ఉపాధి రీత్యా ఎండల్లో విధిగా పనిచేయాల్సి వచ్చే ఆయా రంగాల ప్రజలను దృష్టిలో పెట్టుకోవాలి. కార్మికుల శ్రేయస్సును ఖాతరుచేయని సంస్థలు, పరిశ్రమలు మనదగ్గర చాలా ఉన్నాయి. అందువల్ల, తగినంత మంచి నీరు, నీడపట్టున ఎక్కువ సమయం విశ్రాంతి, తక్షణచికిత్స, ఆస్పత్రులకు తరలింపు తదితర విషయాల్లో అప్రమత్తంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించమంటూ ప్రభుత్వం నుంచి విస్పష్టమైన ఆదేశాలు జారీకావాలి. నిర్మాణరంగంలో పనిచేసేవారిపైనా, ఉపాధిహామీ కూలీలపైనా ప్రత్యేక దృష్టిపెట్టాలి. అధిక ఉష్ణోగ్రతల ప్రభావంతో తీవ్ర అనారోగ్యాలకు గురికావడం జరుగుతుంది కనుక మందులకు, వైద్యసహాయానికి లోటులేకుండా చూసుకోవాలి.

వడగాడ్పులను ప్రకృతివైపరీత్యాలుగా పరిగణించకపోవడం, వడదెబ్బ మరణాలకు నష్టపరిహారాలు అందకపోవడం సరికాదు. ఈ అమానవీయమైన ధోరణిని మనం సరిదిద్దుకోవాల్సి ఉంది. ఈ ఏడాది తీవ్ర ఎండలకు సార్వత్రిక ఎన్నికలు కూడా తోడవుతున్నాయి. ఎన్నికల ప్రచారం యావత్తూ భయంకరమైన వేడిమిలో సాగాల్సి వస్తున్నది. వేడితో పాటే ప్రచార ఉధృతీ పెరుగుతుంది. లక్షలాదిమంది సామాన్యులు సభలూ సమావేశాల్లో పాల్గొంటారు, అభ్యర్థుల తరఫున ప్రచారం చేస్తారు. ఎండలు భగభగలాడుతూ, వడగాడ్పులు వీచేకాలంలో వరుసబెట్టి జరిగే ఈ రాజకీయ సదస్సులు, ర్యాలీలు అనేకమంది ఆరోగ్యాన్ని దెబ్బతీసి, వారి ప్రాణాలను ప్రమాదంలో పడవేసే అవకాశం ఉంది. మహారాష్ట్రలో గత ఏడాది సరిగ్గా ఇదే కాలంలో జరిగిన ఓ రాజకీయ సదస్సు పదమూడుమంది ప్రాణాలు తీసింది, వందలాదిమందిని ఆస్పత్రిపాల్జేసింది. నావీముంబైలో ఒక సామాజిక కార్యకర్తకు ఏదో పురస్కారాన్ని ఇచ్చేందుకు ఉద్దేశించిన ఈ సభను మండుటెండలో నిర్వహించడమే కాక, వచ్చినవారంతా ఎండకు ఎదురొడ్డి నిలిచిన ధీరులు, శూరులని మరీ నాయకులు పొగిడారు. అమిత్ షా సహా కొందరు కేంద్రమంత్రులు, రాష్ట్ర ముఖ్య, ఉపముఖ్యమంత్రులు నీడపట్టున, చల్లగాలిలో గద్దెమీద ఉంటే, పదిలక్షల మంది ప్రజలు మండుటెండలో మాడిపోయారు. అందుబాటులో ఉన్న మంచినీరంతా ఎండవేడికి మరిగిపోయింది. జనం అల్లాడిపోతూ, కుప్పకూలిపోతున్న స్థితిలో చల్లని నీళ్ళకోసం పోలీసులు అటూఇటూ పరుగులుతీయాల్సి వచ్చింది. ఏర్పాట్లు ఎంత నాసిగా ఉన్నాయంటే, సొమ్మసిల్లినవారిని ఆస్పత్రులకు తరలించడానికి పోలీసులు మోటార్‌సైకిళ్ళను వినియోగించాల్సి వచ్చింది. ఇది పాలకులు చేజేతులా సృష్టించిన విపత్తు. పేదల ప్రాణాలమీద పాలకులకు ఎంతశ్రద్ధ ఉంటుందో ఈ ఘటన తెలియచెబుతోంది. సార్వత్రిక ఎన్నికలు, మండుటెండలు ఒకదానితో ఒకటి పెనవేసుకున్న ఈ కాలాన్ని ఎటువంటి ప్రమాదాలు జరగకుండా దాటించాల్సిన బాధ్యత అన్ని రాజకీయ పార్టీలమీదా ఉంది.

ఓబీసీలే బీజేపీ డీఎన్ఏ!

భారతీయ జనతా పార్టీ హిందూత్వ ప్రాతిపదికగా, భావోద్వేగాల పరంగా మాత్రమే విజయం సాధిస్తుందని, కొన్ని వర్గాల వారే బీజేపీకి మద్దతు నిస్తారని ప్రచారం చేసేవారికి బీజేపీ నిజంగా గెలిచే కారణాలు ఏనాడూ అర్థం కావు. హిందూత్వ బీజేపీకి జనసంఘ్ కాలం నుంచే మూల సిద్ధాంతం. జాతీయ వాదం బీజేపీ కార్యకర్తలకు భావోద్వేగం కల్పించే ప్రధానాంశం. కాని కేవలం హిందూత్వ ఆధారంగానే, ఈ భావోద్వేగాల ఆధారంగానే బీజేపీ విజయం సాధిస్తుందని చెప్పడం పాక్షిక సత్యమే.

సమాజంలో అత్యధికులుగా ఉన్న అట్టడుగు వర్గాల ప్రజలు ఆదరించినప్పుడే ఏ పార్టీ అయినా వారి మనసుల్లో శాశ్వత స్థానం సంపాదించుకుంటుంది. బీజేపీకి వెనుకబడిన వర్గాల, దళితుల, ఆదివాసీల మద్దతు బలంగా ఉన్నందువల్లే ఆ పార్టీ గెలుపునకు తిరుగు లేకుండా పోయింది. ఇవాళ దేశంలో అత్యధిక ఓబీసీలు బీజేపీకి మద్దతు నిస్తున్నారు. 2019లో బీజేపీ గెలిచిన 303 సీట్లలో 85 మంది ఓబీసీ ఎంపీలే. అంటే 29 శాతం బీజేపీ ఎంపీలు వెనుకబడిన వర్గాల వారు. దేశమంతటా 27 శాతం ఎమ్మెల్యేలు ఓబీసీ వర్గాలకు చెందిన వారు. 40 శాతం శాసనమండలి సభ్యులు కూడా ఓబీసీలే. ఓబీసీలకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ కల్పించినంత ప్రాధాన్యం గతంలో ఏ కాంగ్రెస్ ప్రధాన మంత్రీ కల్పించలేదు.



■ వై. సత్యకుమార్
సత్యకాలమ్

గత ప్రభుత్వాలు ఓబీసీలపై కేవలం పెదాలపై సానుభూతి కురిపించాయి. కాని మోదీ ప్రభుత్వం మండల్ కమిషన్ నివేదిక సమర్పించిన మూడు దశాబ్దాల తర్వాత మొట్టమొదటి సారిగా వెనుకబడిన వర్గాల జాతీయ కమిషన్‌కు రాజ్యాంగ హోదా కల్పించేందుకు రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టింది. దీనివల్ల 671 ఓబీసీ వర్గాలకు న్యాయం జరిగింది. ఓబీసీలను గుర్తించి ఉపాధి కల్పనలోనూ, విద్యాసంస్థల్లోనూ రిజర్వేషన్ కల్పించే అధికారం రాష్ట్రాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకే దక్కింది. ఎంబీబీఎస్, ఎండీ, ఎమ్మెస్, బీడీఎస్, ఎండీఎస్, డిప్లొమా వంటి అనేక వైద్య కోర్సుల్లో ఓబీసీలకు 27శాతం రిజర్వేషన్ కల్పించింది కూడా మోదీ ప్రభుత్వమే. మోదీ సర్కార్ చారిత్రక నిర్ణయం వల్ల వేలాది మంది ఓబీసీ విద్యార్థులు వైద్య రంగానికి చెందిన వివిధ కోర్సులతో విద్యాధికులు కాగలుగుతున్నారు. మోదీ ప్రభుత్వ హయాంలో ఎంబీబీఎస్ సీట్లు కూడా 56 శాతం, పీజీ సీట్లు 80 శాతం పెరిగాయి. మోదీ ముందు ఏడు దశాబ్దాల్లో కేవలం 56వేల ఎంబీబీఎస్ సీట్లు ఉంటే ఇవాళ మోదీ హయాంలో వీటి సంఖ్య లక్షా ఏడు వేలకు పెరిగింది. 70 ఏళ్లలో 387 మెడికల్ కాలేజీలు నిర్మిస్తే గత పదేళ్లలో వీటి సంఖ్య 706కు పెరిగింది. 70 ఏళ్లలో ఏడు ఎయిమ్స్ సంస్థలు ఏర్పడితే పదేళ్లలో మోదీ వాటి సంఖ్యను 23కు పెంచారు. అదే విధంగా యూనివర్సిటీలు, ఐఐటీలు, ఐఐఎంలు, ట్రిబుల్ ఐటీల సంఖ్య కూడా ఎంతో పెరిగింది. నీట్‌తో పాటు సైనిక్ స్కూళ్లలో కూడా మోదీ ప్రభుత్వం ఓబీసీలకు రిజర్వేషన్ కల్పించింది. ఈ నిర్ణయాల వల్ల ఎంతమంది ఓబీసీలు, అణగారి వర్గాలకు చెందిన విద్యార్థులు విద్యాధికులు అయ్యారో అర్థం చేసుకోవచ్చు.



గత ప్రభుత్వాలు ఓబీసీలపై కేవలం పెదాలపై సానుభూతి కురిపించాయి. కాని మోదీ ప్రభుత్వం మండల్ కమిషన్ నివేదిక సమర్పించిన మూడు దశాబ్దాల తర్వాత మొట్టమొదటి సారిగా వెనుకబడిన వర్గాల జాతీయ కమిషన్‌కు రాజ్యాంగ హోదా కల్పించేందుకు రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టింది. దీని వల్ల 671 ఓబీసీ వర్గాలకు న్యాయం జరిగింది.

స్వయంగా ఓబీసీ అయిన నరేంద్రమోదీకి ఈ దేశంలో వెనుకబడిన వర్గాల బాధలు, ఎన్ని ప్రతిభా సామర్థ్యాలు ఉన్నా అడుగడుగునా వారికి కలుగుతున్న ఆటంకాలు తెలుసు. గతంలో కాంగ్రెస్ హయాంలో వెనుకబడిన వర్గాలకు తీరని అన్యాయం జరిగింది. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌నే పార్లమెంట్‌లో ప్రవేశించకుండా అడ్డుకున్నారు. సీతారాం కేసరిని గదిలో బంధించి అవమానించి సోనియాగాంధీని కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఎన్నుకున్నారు. ఓబీసీలకు రిజర్వేషన్ కల్పించాలని మండల్ కమిషన్ ఇచ్చిన నివేదికను కాంగ్రెస్ బుట్టదాఖలు చేసింది. రాజీవ్ గాంధీ ఆ నివేదికను ప్రజలకు వెల్లడించేందుకు ఇష్టపడలేదు. ఎదుగుతున్న ఓబీసీ నేతలను ఏనాడూ సహించని కాంగ్రెస్ ఓబీసీలకు సామాజిక న్యాయంకోసం పోరాడిన కర్పూరీ ఠాకూర్ ప్రభుత్వాన్ని కూడా గద్దె దించాలని చూసింది. కాని మోదీ ప్రభుత్వం కర్పూరీ ఠాకూర్‌కు భారతరత్న పురస్కారాన్ని అందజేసింది. కాంగ్రెస్ ఓబీసీల పట్ల చేసిన దుర్మార్గాల వల్లనే పలు ప్రాంతీయ పార్టీలు ఏర్పడ్డాయి. కాని కాంగ్రెస్‌ను వ్యతిరేకించి సామాజిక న్యాయం కోసం పోరాడుతున్నామని చెప్పుకుని అధికారంలోకి వచ్చిన నేతలు తమ వర్గాల ప్రజలకు చేసింది ఏమీ లేదు. ఇప్పుడవే పార్టీలు బీజేపీ ధాటికి తట్టుకోలేక ఒకప్పుడు తాము వ్యతిరేకించిన కాంగ్రెస్ పార్టీతోనే చేతులు కలిపాయి.

ఈ పరిణామాలు గమనించినందువల్లే ఓబీసీలు బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నారు. గత ఎన్నికల్లో ఓబీసీల్లో అత్యధికులు బీజేపీకే ఓటు వేశారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో కూడా దేశంలో ఓబీసీల్లో అత్యధికులు బీజేపీ వైపే మొగ్గు చూపుతున్నట్లు ఇటీవల ఇండియా టుడే దేశవ్యాప్తంగా నియోజకవర్గాల వారీగా నిర్వహించిన సర్వేలో తేలింది. గత ఏడాది మధ్యప్రదేశ్, రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించేందుకు ఆ రాష్ట్రాల్లో ఉన్న ఓబీసీలే ప్రధాన కారణం. మధ్యప్రదేశ్‌లో బీజేపీకి 56 శాతం పైగా ఓబీసీలు ఓటు వేశారు. రాజస్థాన్‌లో 55 శాతం మంది ఓబీసీలు బీజేపీకి పెద్ద పీట వేశారు. ఉత్తరప్రదేశ్‌లో 50 శాతం పైగా ఉన్న ఓబీసీలు బీజేపీ వైపు మొగ్గు చూపినందుకే అత్యధిక స్థానాలను గెలుచుకోగలిగింది. బిహార్‌లో కూడా ఓబీసీలు బీజేపీ–జెడి(యు) కూటమి దిశగా సంఘటితమవుతున్నారు. ఇటీవల హర్యానాలో బీజేపీ నాయకత్వం ఓబీసీ నేత నాయబ్ సింగ్ సైనీని ముఖ్యమంత్రిగా నియమించింది. గత ఎన్నికల్లో మధ్యప్రదేశ్‌లో ముఖ్యమంత్రిగా ఎన్నికైన మోహన్ యాదవ్ వెనుకబడిన వర్గాలకు చెందినవారే. ఎంపీలో నియమించిన ఇద్దరు ఉప ముఖ్యమంత్రుల్లో ఒకరు దళితుడు. ఛత్తీస్‌ఘడ్‌లో ఆదివాసీవర్గానికి చెందిన విష్ణుదేవ్ సాయి ముఖ్యమంత్రి కాగా, ఆయన మంత్రివర్గంలో ఇద్దరు ఉప ముఖ్యమంత్రులు ఓబీసీలే. బిహార్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడుగా ఉన్న ఓబీసీ వర్గానికి చెందిన సామ్రాట్ చౌదరి, నితీశ్ కుమార్ మంత్రివర్గంలో ఉప ముఖ్యమంత్రి. ఇవాళ ఓబీసీల్లో ప్రాబల్యం ఉన్న యాదవులు, కుర్మీలు, సైనీలు, కొయిరీలు, కుశ్వాహలు, లోధీలతో పాటు దేశవ్యాప్తంగా వివిధ వర్గాలు బీజేపీ వైపు ఆకర్షితులవుతున్నాయి.

విషాదకరమేమంటే గత అయిదేళ్లుగా అరాచక పాలన కొనసాగిస్తున్న జగన్ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాలతో పాటు వెనుకబడిన వర్గాల వారు తీవ్ర నష్టాలకు, వేధింపులకు గురయ్యారు. మోదీ ప్రభుత్వం ఓబీసీల సంక్షేమం కోసం తీసుకున్న నిర్ణయాలను జగన్ సర్కార్ పూర్తిగా అమలు చేయడం లేదు. సామాజిక న్యాయానికి నోచుకోని పలు ఓబీసీ ఉపకులాలను ఓబీసీ జాబితాలో చేర్చమని రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి సిఫారసులూ చేయలేదు. వెనుకబడిన వర్గాలకు ప్రయోజనాలు కల్పించే 30కి పైగా పథకాలను సైతం రద్దు చేశారు. బీసీ కమిషన్‌కు చట్టబద్ధత కల్పించకపోగా, బీసీల భూములను పెద్ద ఎత్తున ఆక్రమించుకుంటున్నా వారికి రక్షణ లేకుండా పోయింది. బీసీలు తమ కాళ్లపై తాము నిలబడడానికి, ఉపాధి కల్పనకు రుణాలు లభించడం లేదు. అటు కేంద్రంలోనూ, ఇటు రాష్ట్రంలోనూ ఎన్డీఏ ప్రభుత్వాలు ఏర్పడితేనే ఓబీసీలకు మరింత సామాజిక న్యాయం దక్కుతుందనడంలో సందేహం లేదు.

(బీజేపీ జాతీయ కార్యదర్శి)

అభివృద్ధి పటాటోపం వెనక అసమానతల కూపం!

అంబానీ కుటుంబం వారి కుమారుడు అనంత్ అంబానీ కోసం గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో మూడు రోజుల పాటు జరిగిన విలాసవంతమైన ప్రీ–వెడ్డింగ్ వేడుక వేడుక దృశ్యాలు ప్రధాన స్రవంతి టీవీ చానళ్ళు సోషల్ మీడియా పుణ్యాన దేశం మొత్తం గుడ్లప్పగించి చూసింది. మీడియా కథనాల ప్రకారం ఈ వేడుకకు ఫేస్‌బుక్ వ్యవస్థాపకులు మార్క్ జుకర్‌బర్గ్, మైక్రోసాఫ్ట్ మాజీ సీఈఓ బిల్ గేట్స్‌తో పాటూ దేశంలో అగ్రశ్రేణి నటులు, క్రికెటర్లు హాజరయ్యారు. అతిథులకు సంపన్నమైన గుడారాలలో విలాసవంతమైన వసతితో పాటూ 2,500 కంటే ఎక్కువ వంటకాలతో అద్భుతమైన ఆహార అనుభవాన్ని అందించారు. అతిథుల కోసం ప్రైవేట్ విమానాలు ఏర్పాటు చేశారు. ఇందు కోసం తాత్కాలికంగా జామ్‌నగర్ రక్షణ ఎయిర్‌పోర్ట్ పౌర విమానాల సేవలు అందించే ఎయిర్‌పోర్ట్‌గా రూపాంతరం చెందింది. ఈ మూడు రోజుల వేడుకకు అంబానీలు రూ.1259 కోట్లు వెచ్చించారని అంచనా. ఈ కార్యక్రమం భారతదేశంలో ఇప్పటివరకు జరిగిన అత్యంత ఖరీదైన వేడుకలలో ఒకటిగా చెప్పొచ్చు.

దేశం అంతా అంబానీ ఇంట్లో పెళ్లి వేడుక కోసం మాట్లాడుకుంటున్న సమయంలో వ్యాస రచయితకు ఒడిశా రాష్ట్రంలో బలంగీర్, కలహంది తదితర జిల్లాలలో జరుగుతున్న పెళ్లిళ్ల కథలు, అవి వెట్టికి దారితీస్తున్న పరిస్థితుల గూర్చి తెలుసుకునే ప్రత్యక్ష అవకాశం చిక్కింది. బలంగీర్ జిల్లా వాసి అయిన 56 ఏళ్ళ ఆదివాసీ మహిళ కుంతి.. తన కొడుకు సదానందకు అరేళ్ళ క్రితం 3 లక్షల రూపాయల ఖర్చుతో పెళ్లి చేసింది. ఐతే పెళ్ళికి అయిన ఖర్చులో రూ.1.5లక్షలు అప్పు చేయాల్సి వచ్చింది. వడ్డీ 10శాతం, అంటే నెలకు రూ.15వేలు. కుంతి మాటల్లో చెప్పాలంటే "ఇప్పుడు ఐదేళ్ళ వయస్సు ఉన్న నా మనుమడి పెళ్లి సమయానికైనా కూడా ఈ అప్పు తీరుతుందన్న ఆశ లేదు."

ఈ పెళ్లి అప్పు తీర్చడానికి కుంతి కుటుంబం మొత్తం కలిసి గత ఏడాది ఆరు నెలల పాటు ఆంధ్ర లోని విజయనగరం జిల్లాకు ఇటుక బట్టీ కార్మికులుగా వలసకు వెళ్ళింది. అలా వలసకు వెళ్లినందుకు వారికి మనిషికి రూ.45వేల చొప్పున మొత్తం ముగ్గురికి కలిపి రూ.1.35లక్షలు ముట్టాయి. అంటే దాదాపు మనిషికి రోజుకు సగటున భోజన ఖర్చులు పోగా రూ.300 వేతనం లభించింది. కానీ కుటుంబం ఆరు నెలల పాటు రెక్కలు ముక్కలు చేసుకుని సంపాదించిన సొమ్ము పేరుకుపోయిన వడ్డీకి మాత్రం సరిపోయింది, అసలు అలానే ఉంది. కానీ ఆ ఇటుక బట్టీలలో పడిన కష్టాల చేదు జ్ఞాపకాలు మాత్రం ఆ కుటుంబంతో మిగిలిపోయాయి. పెళ్లిళ్ల కోసమే కాదు అనారోగ్యంతో ఉన్న కుటుంబ సభ్యుల ఆరోగ్యం బాగు చేయించడానికి డబ్బు కావాలి కాబట్టి వలస మార్గాన్ని ఆశ్రయిస్తున్న వారి సంఖ్యా తక్కువేమీ కాదు.

నిజానికి పైన మనం మాట్లాడుకున్న రెండు పెళ్ళిళ్ళూ దేశంలో ఉన్న రెండు భిన్న ప్రపంచాలను మనకు అద్దంలో చూపుతున్నాయి. నేడు మన దేశంలో వేడుకల కోసం వేల కోట్లు ఖర్చు చేయగలిగే కుటుంబాలు ఒక వైపు – ఇంట్లో చిన్న చిన్న అవసరాల కోసం దాదాపు వెట్టి చాకిరీ కూపంలోకి తోయబడుతున్న కుటుంబాలు మరొక వైపు కనిపిస్తున్నాయి. స్వాతంత్ర్య భారతదేశ చరిత్రలో మునుపు ఎప్పుడూ లేనంతగా అసమానతలు పెరిగిపోయాయని పరిశోధనలు తెలియజేస్తున్నాయి. వరల్డ్ ఇన్ ఈక్వాలిటీ ల్యాబ్ పరిశోధకులు ఇటీవల వెలువరించిన పరిశోధనా పత్రం 'Income and wealth inequality in India'లో స్వాతంత్ర్యం ముందు దేశంలో కంటే పేదలు – ధనికుల మధ్య ఆర్థిక అంతరాలు మరింత పెరిగాయని నిర్ధారించారు. ఈ అంతరాలు దేశ సగటు ఆదాయంలో వాటా, సంపద విషయంలో వాటాలోనూ ప్రస్ఫుటంగా కనిపిస్తున్నట్లు ఆ పరిశోధనా పత్రం తేల్చింది.



మన దేశంలో వేడుకల కోసం వేల కోట్లు ఖర్చు చేయగలిగే కుటుంబాలు ఒక వైపు – ఇంట్లో చిన్న చిన్న అవసరాల కోసం దాదాపు వెట్టిచాకిరీ కూపంలోకి తోయబడుతున్న కుటుంబాలు మరొక వైపు కనిపిస్తున్నాయి. దేశ స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి అరకొరగా అయినా అమలు చేసిన సోషలిస్టు ఆర్థిక విధానాలు దాదాపు 1982 వరకూ పేద–ధనిక అంతరాలు కొంతమేరకైనా తగ్గడానికి కారణం అయ్యాయి. ఆ తరువాత పరిస్థితి తారుమారు అయ్యింది.

దేశ జాతీయ ఆదాయం 100 రూపాయలు అనుకుంటే అందులో సుమారుగా 60 రూపాయలు జనాభాలోని అగ్రశ్రేణి 10శాతం ప్రజల ఆదాయం కాగా, దీనికి విరుద్ధంగా దిగువన ఉన్న 50శాతం జనాభా ఆదాయం కేవలం రూ.15 మాత్రమే. అలానే దేశ పౌరుల సగటు ఆదాయం 100 రూపాయలు అనుకుంటే, భారతదేశంలో అగ్రశ్రేణి ఒక శాతం జనాభా ఆదాయం మాత్రం రూ.2,300 (అంటే జాతీయ సగటు ఆదాయం కంటే 23 రెట్లు ఎక్కువ). ఈ అంకెనే పైూరం అనుకుంటే దేశంలో గల 10 వేల మంది ధనవంతుల సగటు ఆదాయం మాత్రం రూ.2,06,900. అంటే సగటు భారతీయుల కంటే వీరు 2,069 రెట్లు ఆదాయాన్ని సంపాదిస్తారు.

ఐతే ఈ ఆందోళన కలిగించే ధోరణలు కేవలం ఆదాయానికి పరిమితం కాదు, సంపద విషయంలో కూడా అవే పరిస్థితులు ఉన్నాయి. సంవత్సరాలుగా దేశంలో సంపద కేంద్రీకరణ గణనీయంగా పెరిగింది. ఉదాహరణకు, 1961లో దేశ సంపద రూ.100 అనుకుంటే, టాప్ 10శాతం జనాభా దగ్గర రూ.45 ఉండగా, 2023 నాటికి ఈ సంపద 65 రూపాయలకు పెరిగింది. అలానే ప్రస్తుతం భారతదేశంలో అగ్రశ్రేణి ఒక శాతం జనాభా సగటు సంపద జాతీయ సగటు కంటే 40 రెట్లు ఎక్కువ. అంటే సగటు భారతీయుడి వద్ద రూ.100 ఉంటే, అగ్రశ్రేణి ఒక శాతం జనాభా దగ్గర రూ.4000 ఉన్నాయి. అలానే అగ్రశ్రేణి ఒక శాతం జనాభా సంపద వాటా 1961 నుండి 2023 నాటికి మూడు రెట్లు పెరిగింది. ఇక 40శాతం గల మధ్యతరగతి ఆర్థిక సరళీకరణ తర్వాత గణనీయంగా నష్టపోయింది, దశాబ్దాలుగా వారి సంపద వాటా స్థిరంగా పడిపోతూ వచ్చింది.

దేశ స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండీ అరకొరగా అయినా అమలు చేసిన సోషలిస్టు ఆర్థిక విధానాలు దాదాపు 1982 వరకూ పేద–ధనిక అంతరాలు కొంతమేరకైనా తగ్గడానికి కారణం అయ్యాయి. ఆ తరువాత పరిస్థితి తారుమారు అయ్యింది. ముఖ్యంగా 1990ల దశకం నుండీ దేశం అవలంబించిన ఆర్థిక సరళీకరణ విధానాలు అంతరాలను పెంచుతూ పోయాయని ఆర్థిక శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. అలానే ఉన్నత వర్గాలకి మాత్రమే నాణ్యమైన విద్య పరిమితం కావడం భారతదేశంలో ఆదాయ అసమానతలకు గణనీయంగా దోహదం చేస్తుంది. నాణ్యమైన విద్య అందుబాటులో లేకపోవడంతో అధిక జనాభా మంచి వేతనంతో కూడిన ఉద్యోగాలను పొందలేకపోతున్నారు. సరళీకరణ ఆర్థిక విధానాలు ఆర్థిక వృద్ధికి గణనీయంగా దోహదపడినప్పటికీ అవి అణగారిన వర్గాలు తమ వ్యక్తిగత సామర్థ్యాలతో సామాజిక–ఆర్థిక నిచ్చెన పైకి ఎగబాకడానికి అవకాశాలను పరిమితం చేస్తున్నాయి.

అలానే భారతదేశ ఆర్థిక వృద్ధి చాలా మటుకు సేవా రంగంలో సాధించినదే. ఐతే ఈ రంగం ఆదాయ అసమానతలను కూడా తీవ్రతరం చేసింది. ఎందుకంటే, శ్రామికశక్తిలో గణనీయమైన భాగానికి ఉపాధి కల్పిస్తున్న వ్యవసాయం, నిర్మాణం, తయారీ వంటి రంగాలలో వేతనాలు సేవల రంగంతో పోలిస్తే చాలా తక్కువ. అందువలన పేద–ధనికుల మధ్య అంతరం మరింత పెరుగుతూ వస్తుంది.

అసమానతలు తగ్గించడానికి చేపట్టాల్సిన, చేపట్టగలిగే చర్యలు ఎన్నో ఉన్నాయి. సంపన్నులపై అధిక పన్నులు విధించే ప్రగతిశీల పన్ను విధానాలను అమలు చేయడం వల్ల సంపద, ఆదాయాన్ని మరింత సమానంగా పునఃపంపిణీ చేయవచ్చు. దేశంలో కేవలం అత్యంత 162 సంపన్న భారతీయ కుటుంబాల నికర సంపదపై కేవలం 2శాతం పన్ను విధిస్తే ప్రభుత్వాలు గణనీయమైన ఆదాయాన్ని పొందవచ్చని ఆర్థికవేత్తలు సెలవిస్తున్నారు.

అధిక నాణ్యత గల విద్య నైపుణ్యాల శిక్షణా కార్యక్రమాలలో పెట్టుబడి పెట్టడం వలన వ్యక్తులు, ప్రత్యేకించి అట్టడుగు వర్గాలకు చెందిన వారు మెరుగైన ఉద్యోగ అవకాశాలను పొందేందుకు, సంపాదన సామర్థ్యాన్ని పెంచుకోవడానికి అవకాశం ఉంటుంది. నిరుద్యోగ భృతి, ఆరోగ్య సంరక్షణ, ఆహార భద్రత వంటి సామాజిక భద్రతా కార్యక్రమాలను బలోపేతం చేయడం వల్ల పేదలకు ఆర్థిక పరిపుష్టి లభించడమే కాక, ఆర్థిక మాంద్యం సమయంలో వారు పేదరికంలో లోతుగా పడిపోకుండా కాపాడుకుంటారు. తగిన కనీస వేతన ప్రమాణాలను అమలు చేయడం వల్ల కార్మికులు వారి శ్రమకు న్యాయమైన పరిహారం పొందడం జరిగి తద్వారా ఆదాయ అసమానతలు తగ్గుతాయి.

కులం, జాతి, లింగం, ఆర్థిక స్థితి ఆధారిత వివక్షను రూపుమాపడం కోసం కార్యక్రమాల రూపకల్పన, అమలు సమ సమాజాన్ని సృష్టించడానికి, వ్యక్తులందరికీ ఆర్థిక అవకాశాలకు సమాన ప్రాప్యతను నిర్ధారించడానికి కీలకమైనది. ఆదాయం–సంపదలలో తీవ్ర అసమానతలను రూపుమాపకపోతే అవి ఆర్థిక అస్థిరతకు దారి తీసి, సామాజిక ఐక్యతను నాశనం చేసే అవకాశం ఉంది, సామాజిక చలనశీలతకు ఆటంకం కలిగిస్తాయి. అంతేకాకుండా, సమాజంలోని వివిధ వర్గాల మధ్య ఉద్రిక్తతలకు, సామాజిక అశాంతికి, సంఘర్షణలకు దారితీస్తాయి. పౌరులందరికీ అభివృద్ధి చెందడానికి సమాన అవకాశాలు కలిగిన సమ సమాజ కల్పన మన రాజ్యాంగ ఆదర్శం. ఇప్పుడు మనం చేయాల్సిన పని ఆర్థిక సమానత్వం కోసం కార్యక్రమాలు రూపొందించాలని పాలకులను నిలదీయడమే.

• చక్రధర్ బుద్ధ
సీనియర్ పరిశోధకుడు, లిబ్‌టెక్ ఇండియా



మళ్ళీ ఓ కోకిల గానం కోసం

బహుశా ఊహలు ఊపిరి పోసుకుంటున్నప్పుడు
దేహానికి ఓ కొత్త రెక్కలు మొలుస్తున్న భావనలోనో
రేపటి గురించి దిగులు మేఘాలు దరిచేరని కాలంలోనో
ఆశల చిగుర్లకు వేలాడుతూ
తూనీగల్ని తుమ్మెదల్ని తేనెటీగల్ని కోకిలల్ని
మనసు వసంతం మీదకు ఆహ్వానించి
విచ్చుకుంటూ వికసిస్తూ ఉంటాను
రుచులు ఆరేనని తెలియని చైత్రాన వేపపువ్వులేరుకుంటూ
కొమ్మలమాటున దాగిన మామిడి పుల్లదనాన్ని
అంతెత్తు పెరిగిన చేరుకుచేలలోని తీపివాసనల్ని
కలగాపులగం చేసుకుంటూ ఆస్వాదిస్తూ ఉంటాను



చెవుల్లో తేనె పోస్తున్న కోకిల అరుపులకు
రెట్టించిన గొంతు వంత పాడుతూ ఉంటుంది
నీరెండకు అభిముఖంగా కొండపై ఎగురుతోన్న
తేనెటీగలు దాచుకున్న వేపతేనె
లొట్టలేస్తున్న నాలుక చివర్లను తడుపుతూ ఉంటుంది
ఎటు చూసినా చెట్లు కొత్త ఆకుల్ని ముస్తాబించుకుని
లేలేత కిరణాలకెదురుగా
బంగారు వర్ణాన్ని తాపడం చేసుకుంటుంటాయి



యిగిరిపోతున్న మంచు బిందువుల వెనుక
గడ్డిపూల శబ్దం మెల్లగా చెవుల్ని సోకుతుంది
ఆరుబయట పారబోసిన వెన్నెల్లో
రాత్రి చుక్కల్ని లెక్కపెడుతూ
రాని నిద్ర కోసం ఎదురు చూస్తున్నప్పుడు
రాలిపోయిన మల్లెల్లోంచి ఏవో గుసగుసల వాసనలు
గమ్యం తెలియని మార్గంవైపు ఈడ్చుకెళ్తుంటాయి
కాలం మజిలీల మధ్య కరిగిపోయిన కొమ్మలకు వేలాడుతూ
కొత్తచిగుళ్ల దేహాలను నాలోకి నింపుకొంటున్నాను
విప్పేసిన పొరల్లోంచి మళ్ళీ కొత్తగా విస్తరిస్తున్నాను.

– బండ్ల మాధవరావు

పుణ్యపు రాశుల ప్రోది



కోపం తాపం శాపం
దరి రానీయకు క్రోధీ!
అందరి మంచిని కోరే
అగణిత ప్రేమాంబుధీ!

నామవాచకమై నిలువుము
క్రోధీ 'నామ్ కే' వాస్తే!
ప్రేమలు పొంగగ పరువుము
దోస్తానీకే రాస్తే!

అజ్ఞానం అలసత్వం
అసమానత ఆక్రోశం

అనుకూల దృక్పథాల
అక్షర సత్యపు క్రోధి!

సామర్థ్యం సహృదయం
సహనం సంయమనంతో
సానుకూల భావనలకు
పుణ్యపు రాశుల ప్రోది!

ఆద్యంతములు ఎరుగని
అఖండ కాలవాహిని
సమస్త జీవజాలానికి
జీవనకాంక్షా మోహిని!

ఆకులన్ని రాలినా
చెట్టు చిగురు వేస్తుంది
నిరీక్షించి వసంతాన
కోయిలమ్మ కూస్తుంది

రాత్రి చీకటిని భరిస్తు
తొలి కిరణం మెరుస్తుంది
మండుటెండలను దాటి
వాన మబ్బు కురుస్తుంది

అవనిలోని అణువణువూ
ఆశావహ సందేశం
కృషితో ఋషి కావాలని
ఈ ఉగాది ఆదేశం

– మడిపల్లి దక్షిణామూర్తి

క్రోధివి నీవు!



క్రోధివి నీవు! నాయకులలోగల దౌష్ట్యముపట్ల నెంతయున్
క్రోధివి నీవు! స్వార్థమునకున్ తలపాగను చుట్టువారికిన్
క్రోధివి నీవు! మానవతకున్ చిగురన్నదిలేదు నేడు; వర్షాధిపతీ! కుహూకుహూల ఆమెతలిమ్ము! శుభాభినందనల్ !

క్రోధివి నీవు! చెడ్డకు విరోధివి! ఒక్కొక కిన్క మంచిదేగా! ధవుడైన కృష్ణునెడ నల్కలమంట రగుల్చు 'భామ' కాదే! ధిషణాకవిత్వమున తిమ్మనగారికి నాయికాయె! ఆగాథ రసాత్మకమ్ము! చలికాలపు మంటయుకూడా మంచిదే!

నోటునకోటువేసెడి మనుష్యుని నుండి జనించు రాజ్యమెచ్చోట ప్రజాప్రభుత్వరుచి జూపగలేదు – స్థిరత్వమెన్నడున్ గీటుకురాదు సంకుచిత నేతలు నెగ్గిన – కోటగోడయే బీటలు తీసినన్ బ్రతుకువీధికి చీకటిపాట దిక్కగున్!

న్యాయంబెక్కడ లేదు – నిన్ననొక పంథా – నేడు వేరొక్క పంథా! యాదర్శచరిత్ర దేవుడెరుగున్; లంచాలతో నాయకుల్ మాయోపాయములెన్ని పన్నినను నాత్మశ్రీ ప్రబోధమ్ముతో శ్రేయోరాజ్యము నెన్నుకోవలెనుమీ! సిద్ధింపగన్ స్వప్నముల్!

ప్రేమలు నేతిబీరలనిపించెడి వేళ నిజాయితీకి చోటేమియులేదు! గాంధి రచియించిన రాజ్యము కానిపింపబోదేమి? ఇకేవియభ్యుదయ దృశ్యము? లూసరవెల్లి పోకడల్ క్షేమముకాదు! వ్యక్తిగత శీలమునుండి ఉగాదులేర్పడున్!

– రసరాజు

సమస్యల స్వగతాలు!



అయినా గానీ వసంతం
సామాన్యుని ఆశలు కావా నీ కవగతం?
ఆమని ఆగామిగా వస్తోందని
నిలదీస్తున్నారుగా జనావళి!
అడుగడుగునా ఎదురుచూస్తున్న ప్రశ్నావళి?

అంతరాల మధ్య మాత్సర్యాల
అంకురాలు నింపుతున్న
సంకుచిత స్వరాలకు ఉరులు
బిగించగలనని
మాట ఇవ్వగలవా?
కలాలగళాలలో గరళాలు నింపి
నరాల ప్రకంపనల ఊపిరి తీసే
కులాల కుత్సితాలకు గుణపాఠం
చెప్పగలవా?
మానవేతిహాసంలో మలుపుల పోకడలను
గమనించావా?
మానవీయ కోణంలో కుదుపుల
అవరోధాలను ఆపగలవా?

క్రోధినామమంటేనే క్రోధాగ్నుల
సెగలు, పొగలు
కక్షలు కార్పణ్యాలు, కుత్తుకలుత్తరించు
మదోన్మత్తులు
ఎలా నిలువరించగలవు?
ఏ భరోసా ఇవ్వగలవు?

కలతలతో, కాలసర్ప పరిష్వంగ పీడితులకు
విధ్వంసక శక్తుల దాడుల దగాపడిన
ప్రజావళికి,
సాంత్వన నందించగలవా?
ప్రశాంతత ప్రసాదింపగలవా?

మావితోరణాలతో నీకు
స్వాగతమివ్వాలని వున్నా
గుండెదిటవు చేసుకుని ప్రశ్నిస్తూనే వున్నా.
యుగాలు దాటి నవ ఉగాదివై వస్తావా?
తెలుగునేల పరువు నిలుపు ఘనకీర్తిగా
నిలుస్తావా?
మా ఆశల ఆశయాల
అమృతమందింపగలవా?

– బి.యస్. నారాయణ భట్టు

శాంతి కోసం కోపం



అవును కొంచమంత కోపమూ ఉండాల్సిందే
కొంతలో కొంతనైనా క్రోధమూ ఉండి తీరాల్సిందే
కోపగొండి తనం లేకుంటే పురాగ ఏం లేదన్నట్టు

కోపమంటే ధిక్కరించే చర్యకు పూర్వ రంగం
కోపమంటే అపసవ్యతపై కన్నెర్ర రూపం
కోపం ప్రశాంతత కోసం ఎదురుచూసే సన్నాహం

క్రోధి నామ సంవత్సరంలోనైనా
క్రూరత్వంపై కత్తి దులపకపోతే ఎలా

బహుళత్వాన్ని ఇచ్చగొడుతున్న చేతుల మీద
దేశీయతను గాయం చేస్తున్న ఖడ్గం మీద
పచ్చని చెట్లను తొలుస్తున్న చెద పురుగుల మీద
మనసుల్లోకి వ్యాపిస్తున్న విష వలయాల మీద
ఉక్కు పిడికిల్లతో నినదించి ఎదిరించి తీరాలి

అన్యాయం న్యాయమై అన్యాయంగా చలాయిస్తే
అవినీతి నీతివంతమై నిర్విఘ్నంగా ఊరేగుతుంటే
అచ్చంగా అధర్మమే ప్రవచనమై ప్రవహిస్తుంటే
రాజ్యాలే రాజ్యాంగాన్ని అప్రజాస్వామిక పరిస్తే
నిజాలు కెలికెందుకు నిప్పురవ్వగనైన నిలవాలి

చూసి చూడనట్టు మౌనంగా ఉండటం నేరం
నిశ్శబ్దాన్ని ఛేదించేట్టు శబ్దం చేయడమే కర్తవ్యం

పోరాటం పొటమరించి శాంతి జనిస్తుంది
క్రోధాగ్ని రగిలితేనే క్రూరత్వం పారిపోతుంది
నికార్సైన పొగరే రెపరెపలాడే ఆత్మగౌరవం

సమన్యాయ సామరస్యం కుదిరే దాకా
కోపతాపాల దాహ దుఃఖాలు కురవాల్సిదే
క్రోధిలోనూ ఆ ఆనందాలు పంచుకోవాల్సిందే.

– అన్నవరం దేవేందర్

వృద్ధులకు అండ ఎవరు?

తమ సర్వస్వాన్ని పిల్లల అభ్యున్నతికి ధారపోసి, జీవిత చివరిదశలో అవమానాలకు గురవుతున్న వృద్ధులకు ఎవరి అండా లేకుండా పోతున్నది. సమాజం, ప్రభుత్వం ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకోకపోవడం దురదృష్టకరం. వయోధికుల రక్షణకు ఉన్న చట్టాలను పకడ్బందీగా అమలు చేయకపోవడమే దీనికి ప్రధాన కారణం. ఈ పరిస్థితులలో 40 లక్షల వృద్ధుల సమస్యలను పరిష్కరించడానికి ఎవరైతే కృషి చేస్తారో వారికే రాష్ట్రంలోని వయోవృద్ధులు బ్రహ్మరథం పడతారని తెలంగాణ స్టేట్ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ (టాస్క) స్టాండింగ్ కమిటీ సమావేశం తీర్మానించింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ కింది డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని సంఘం కోరుతోంది.

వయోధికుల సంక్షేమ శాఖ ఏర్పాటుచేయాలి; వయోధికుల భవనం కోసం రెండు ఎకరాల ప్రభుత్వ భూమి, రూ.పది కోట్ల నిధులు కేటాయించాలి; ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలి; అన్ని ప్రభుత్వ/ప్రైవేట్ ఆసుపత్రులలో ఉచిత వైద్యసేవలు అందించాలి; అన్ని మునిసిపాలిటీలలో ఇంటిగ్రేటెడ్ డేకేర్ సెంటర్లు ఏర్పాటుచేయాలి; టాస్క కేంద్ర కార్యాలయానికి ప్రభుత్వ భవనం కేటాయించాలి; రైల్వేచార్జీలలో రాయితీని పునరుద్ధరించాలి; తల్లిదండ్రులు, వయోధికుల పోషణ, సంక్షేమ చట్టం–2007నకు ప్రతిపాదించిన సవరణ బిల్లు–2019ని ఆమోదించాలి; నెలలో రెండు పర్యాయాలు వయోధికుల గృహ సముదాయం దగ్గర '104' సంచార వైద్యశాలల ద్వారా ప్రాథమిక వైద్యసేవలను అందించాలి; వయోధికుల ఫిర్యాదులను పరిష్కరించడానికి వయోధికుల సంక్షేమ శాఖ హెల్ప్‌లైనును, పోలీసు, రెవెన్యూ, ఆరోగ్య శాఖలతో కలిపి సంయుక్తంగా నిర్వహించాలి.

– పి. నర్సింహారావు
రాష్ట్ర అధ్యక్షులు, టాస్క

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిటోపేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్విని లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు..

▸▸ రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ



వరంగల్ కల్చరల్, ఏప్రిల్ 8: ప్రజలందరు షడ్రుచుల సమ్మేళనం ఉగాది పచ్చడిని ఆస్వాదిస్తూ ఉగాదికి స్వాగతం పలకాలని, ప్రజలందరూ శుఖ సంతోషాలతో, సిరి సంపదలతో ఉండాలని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉగాది ఆగమనం వసంత రుతువులోకి ప్రవేశించే సందర్భంగా ప్రజలందరికీ ఉగాది శుభాకాంక్షలని తెలిపారు.

రంజాన్ వేళలు		
ఇఫ్తార్:	మంగళవారం	సా: 6.36 గం..
సహర్:	బుధవారం	ఉ: 4.40 గం..



■ నేడు ఉగాది పర్వం

శ్రీకరం.. శ్రీక్రోధి.



- ▸▸ జోరుగా పంచాంగ శ్రవణాలు, కవి సమ్మేళనాలు
- ▸▸ ముస్తాబైన పలు ఆలయాలు
- ▸▸ ప్రతీ ఇంటా మామిడి తోరణాలతో ప్రత్యేక శోభ



హనుమకొండ అంబేద్కర్ జంక్షన్‌లో ఉగాది పచ్చడి సామగ్రి విక్రయిస్తున్న దృశ్యం

హనుమకొండ కల్చరల్, ఏప్రిల్ 8 : చైత్రశుద్ధ పాడ్యమి మంగళవారం తెలుగువారి తొలి పండగ శ్రీక్రోధి నామ సంవత్సర ఉగాది పర్వాన్ని జరుపుకునేందుకు జిల్లా ప్రజలందరూ సన్నద్ధమయ్యారు. ఉగాది పర్వానికే ప్రత్యేకమైన పంచాంగ పఠనాలు, కవి సమ్మేళనాలు, ఇంటింటా మామిడి తోరణాలతో పర్వదిన శోభను సంతరించేలా ఏర్పాట్లు చేసుకున్నారు. సాధారణ పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున జిల్లా యంత్రాంగం పక్షాన ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించడం లేదు. ప్రతీ యేటా క్రమం తప్పకుండా జరిగే వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో మంగళవారం సాయంత్రం దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు జరగనున్నాయి. ఐనవోలు సాయికృష్ణశర్మచే పంచాంగ పఠనం, అనంతరం కవి సమ్మేళనాన్ని ఏర్పాటు చేశారు. పోలీస్ కవిషనర్ అంబర్ కిశోర్‌ఝా, దేవాదాయశాఖ ఏసీ సునీత తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారని ఆలయ ఈవో వెంకటయ్య, ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్రశర్మ చెప్పారు. అదే విధంగా ఈ నెల 17వ తేదీ వరకు జరిగే శ్రీరామ నవమి నవరాత్రి వేడుకలకు ఉత్సవ విగ్రహ ప్రతిష్టాపన, మండపారాధన, కలశస్థాపన, పాంచరాత్ర ఆగమానుసారం పూజాధికాలు నిర్వహింపజేస్తామని గంగు ఉపేంద్రశర్మ తెలిపారు.

సహృదయ సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో వడ్డెపల్లిలోని బీఆర్.రెడ్డి ఫంక్షన్ హాలులో ఉగాది ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. నమిలిగొండ విశ్వేశ్వరశర్మ సిద్ధాంతిచే పంచాంగ పఠనం నిర్వహిస్తారు. అనంతరం ఎన్‌వీఎస్.చారి సంయోజకత్వంలో యువ కవితా ఝరి పేరిట యువ కవుల సమ్మేళనాన్ని నిర్వహించి కవులను సత్కరించనున్నట్లు సంస్థ అధ్యక్షులు గిరిజా మనోహర్‌రావు చెప్పారు. ములుగురోడ్‌లోని సప్తధామంలో ఉగాది ఉత్సవాల పేరిట ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. గండ్లూరి రాజశేఖరశర్మచే పంచాంగ పఠనం అనంతరం ప్రముఖ నృత్య కళాకారుడు బొంపెల్లి సుధీర్ రావుతోపాటు పలువురిని సత్కరిస్తున్నట్లు కార్యక్రమ నిర్వాహకులు త్రిపురనేని గోపి చంద్ చెప్పారు. అడ్వకేట్స్ కాలనీలోని గజానన మండలి ఆధ్వర్యంలో నిర్వహించే ఉగాది వేడుకల్లో సముద్రాల శఠగోపాచార్య ఉగాది ప్రాముఖ్యతపై ప్రవచనాలు

▸▸ మిగతా 8వ పేజీలో..



సోమవారం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం: 37.5°C
కనిష్ఠం: 25.0°C



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరాం, ప్రొఫెసర్ హరగోపాల్

అందరికీ విద్య ప్రభుత్వ బాధ్యత

- ▸▸ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు ఉన్నత విద్యకు దూరం
- ▸▸ వర్సిటీలకు యూజీసీ నిధులు తగ్గాయి..
- ▸▸ ప్రముఖ సామాజిక వేత్త, ప్రొఫెసర్ హరగోపాల్
- ▸▸ కేయూలో ఉన్నత విద్యపై సింపోజియం

7



పగుళ్లు తేలిన 20వ పిల్లరును పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

రాజకీయాలు పక్కకు పెట్టండి..
రైతులకు నీళ్లివ్వండి

- ▸▸ మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణ అక్రమాలపై న్యాయవిచారణ చేపట్టాలి
- ▸▸ ఆరోపణలు ప్రతి ఆరోపణలతో కాలయాపన చేయకండి
- ▸▸ సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వీరయ్య

8

7లో..
మోపిస్తున్న వేద పాఠశాల

ఉగాది శుభాకాంక్షలతో

SUMMER FAMILY ENTERTAINER నేడే చూడండి



సుదర్శన్ 35 ఎంఎం - ఎ/సి ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
11.00,2.30,6.00,9.30

SVC ఈశ్వర్ 70ఎంఎం - అత్తాపూర్ 11.00,2.30,6.00,9.30	SVC శ్రీలక్ష్మి/ఇంద్రనాగేంద్ర - కర్మన్‌ఘాట్ 11.30,2.30,6.30,9.30
SVC సంగీత 70ఎంఎం - ఆర్.సి.పురం 11.00,2.30,6.00,9.15	SVC శివశక్తి 70ఎంఎం ఎ/సి - కాప్రా 11.15,2.30,6.00,9.30
రాజధాని డీలక్స్ - దిల్‌సుఖ్‌నగర్ 11.15,2.15,6.15,9.15	శ్రీసాయిరాం 70 - మల్కాజ్‌గిరి 11.15,2.30,6.15,9.30

ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్ 8.00,8.00,8.00,8.00,8.00,11.00,11.45,12.45,2.00,2.45,3.45,5.00,7.35,8.00,10.35,11.00
ఎ.ఎం.బి. - గచ్చిబౌలి 9.15,9.35,10.15,12.30,12.50,3.45,4.05,7.00,7.20,10.15,10.35
PVR సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట
జిఎస్ఎమ్ - మదీనగూడ 9.00,9.20,11.45,12.25,12.45,3.10,3.50,4.10,6.35,7.15,7.35,10.40,11.00
నెక్లెస్ సత్య - కవాడిగూడ 9.20,10.00,11.40,12.45,1.25,4.10,7.00,7.35,10.30,11.00
అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్ 9.00,10.00,12.25,1.35,3.50,
శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్ 9.40,1.00,4.20,7.40,11.00
సినిమాస్ - బాలానగర్ 9.40,1.00,2.00,4.20,7.40,11.00
సినిమాస్ - చందానగర్ 9.40,1.00,4.20,7.40,11.00
సినీటౌన్ - మియాపూర్ 9.55,1.20,4.05,7.45,11.00

ఉగాది శుభాకాంక్షలతో

ఈనెల 11న బ్రహ్మాండమైన విడుదల



సంధ్య 35ఎంఎం- ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound

SVC శ్రీలక్ష్మి/ఇంద్రనాగేంద్ర - కర్మన్‌ఘాట్	SVC శివశక్తి 70ఎంఎం - కాప్రా
అర్జున్ 70ఎంఎం - కూకట్‌పల్లి	మెగా 70 - దిల్‌సుఖ్‌నగర్
ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్	డిఎస్ఎల్ మాల్ - ఉప్పల్
ఎ.ఎం.బి. - గచ్చిబౌలి	ఏషియన్ సత్యం - అమీర్‌పేట్
PVR సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట	సినీ ప్లానెట్ - కొంపల్లి
PVR ఫోరం మాల్ - కూకట్‌పల్లి	ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్
PVR ఆర్.కె. - బంజారాహిల్స్	ఏషియన్ రాధిక - కాప్రా
PVR ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్	ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్
PVR గలేరియా - పంజాగుట్ట	ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి
PVR ఐకాన్ - హైటెక్‌సిటీ	మిరాజ్ శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్
PVR పివిఆర్ సినిమాస్ - ఎర్రమంజిల్	మిరాజ్ సినిమాస్ - బాలానగర్
PVR పివిఆర్ సినిమాస్ - ముసారాంబాగ్	మిరాజ్ సినిమాస్ - చందానగర్
PVR ప్రిస్టన్ మాల్ - గచ్చిబౌలి	సినీటౌన్ - మియాపూర్
PVR అట్రియమ్ - గచ్చిబౌలి	రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి
PVR ఎస్‌2 నోము - మల్లాపూర్	జిపిఆర్ మాల్ - కూకట్‌పల్లి
జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్	మూవీటైమ్ - అమీర్‌పేట
ఎం.పి మాల్ - కాచిగూడ	ఎస్.ఎల్.ఎన్ - గచ్చిబౌలి
జిఎస్ఎమ్ - మదీనగూడ	స్కైమాల్ - సనత్‌నగర్
నెక్లెస్ సత్య - కవాడిగూడ	టివోలి - సికింద్రాబాద్
అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్	విజయలక్ష్మి - ఎల్.బి.నగర్
మంజీరామాల్ - కూకట్‌పల్లి	శివగంగ - దిల్‌సుఖ్‌నగర్
సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి	షా షహెన్‌షా - చింతల్
మంత్రామాల్ - అత్తాపూర్	మూవీమ్యాక్స్ - మౌలాలి
సుధా - శాలిబండ	జె.పి.సినిమాస్ - చందానగర్

శ్రీరాములు 70 - మూసాపేట్	సూపర్ 70ఎంఎం - బాలాపూర్	SV సినీస్క్వేర్ - పటాన్‌చెరు
తాట్లూరి 70 ఎ/సి - ఇసిఐఎల్	శ్రీదేవి ఎ/సి - చిలకలగూడ	శ్రీప్రేమ 70ఎంఎం - తుక్కుగూడ
శ్రీరమణ కాంప్లెక్స్ - అంబర్‌పేట	లక్ష్మీకళ సినీప్లెడ్ - మూసాపేట్	సంతోష్ 70ఎంఎం - ఇబ్రహీంపట్నం
BR హైటెక్ ఎ/సి - మాదాపూర్	ఆరాధన 70ఎంఎం - తార్నాక	స్వప్న 70ఎంఎం - కాటెదాన్

జెమిని కాంప్లెక్స్ - వరంగల్	గీతా - నిజామాబాద్	సినిమాస్ - ఆర్మూర్	తిరుమల - సూర్యాపేట
PVR ఎస్‌2 - వరంగల్	PVR వేణు - నిజామాబాద్	ప్రియా డీలక్స్ - కామారెడ్డి	విష్ణురాం సినిమాస్ - కోదాడ
KPS ఆదిత్య - ఖమ్మం	తిరుమల - మహబూబ్‌నగర్	సాయిబాబా - షాద్‌నగర్	SVC జెమిని - మంచిర్యాల
తిరుమల - కరీంనగర్	శ్రీదేవి - హన్మకొండ	SVC మల్టీప్లెక్స్ - గద్వాల్	శాంతమహల్ - తాండూరు
SVC ప్రతిమ - కరీంనగర్	ఊర్వశి - గోదావరిఖని	శ్రీనివాస - మిర్యాలగూడ	మిరాజ్ సినిమాస్ - రాయచూర్
శ్రీనివాస - కరీంనగర్	VLS శ్రీరామ - జగిత్యాల	విట్రోస్ సినీప్లెక్స్ - మిర్యాలగూడ	మరియు మీ అభిమాన థియేటర్లలో

ఉగాది శుభాకాంక్షలతో

ఈనెల 12న బ్రహ్మాండమైన విడుదల



శాంతి 70 ఎంఎం - నారాయణగూడ

ఎ.ఎం.బి. సినిమాస్ - గచ్చిబౌలి	లక్ష్మీకళ సినీప్లెడ్ - మూసాపేట్
ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్	ఏషియన్ సత్యం - అమీర్‌పేట్
PVR సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట	ఏషియన్ సినీమార్ట్ - ఆర్.సి.పురం
PVR ఫోరం మాల్ - కూకట్‌పల్లి	సినీ ప్లానెట్ - కొంపల్లి
PVR ఆర్.కె. - బంజారాహిల్స్	ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్
PVR ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్	ఏషియన్ రాధిక - కాప్రా
PVR గలేరియా - పంజాగుట్ట	ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్
PVR ఐకాన్ - హైటెక్‌సిటీ	ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి
PVR పివిఆర్ సినిమాస్ - ఎర్రమంజిల్	మిరాజ్ శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్
PVR పివిఆర్ సినిమాస్ - ముసారాంబాగ్	మిరాజ్ సినిమాస్ - బాలానగర్
PVR ప్రిస్టన్ మాల్ - గచ్చిబౌలి	మిరాజ్ సినిమాస్ - చందానగర్
PVR అట్రియమ్ - గచ్చిబౌలి	సినీటౌన్ - మియాపూర్
PVR ఎస్‌2 నోము - మల్లాపూర్	రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి
జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్	జిపిఆర్ మాల్ - కూకట్‌పల్లి
ఎం.పి మాల్ - కాచిగూడ	మూవీటైమ్ - అమీర్‌పేట్
జిఎస్ఎమ్ - మదీనగూడ	ఎస్.ఎల్.ఎన్ - గచ్చిబౌలి
నెక్లెస్ సత్య - కవాడిగూడ	స్కైమాల్ - సనత్‌నగర్
అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్	టివోలి - సికింద్రాబాద్
మంజీరామాల్ - కూకట్‌పల్లి	విజయలక్ష్మి - ఎల్.బి.నగర్

GLOBAL CINEMAS RELEASE

ఉగాది శుభాకాంక్షలతో

ఈనెల 12న బ్రహ్మాండమైన విడుదల



ఆర్తి 70ఎంఎం ఎ/సి - సంఘీనగర్

SVC జెమిని 70ఎంఎం - మంచిర్యాల

PVR సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట	PVR పివిఆర్ సినిమాస్ - ఎర్రమంజిల్	జిఎస్ఎమ్ - మదీనగూడ
PVR ఫోరం మాల్ - కూకట్‌పల్లి	PVR పివిఆర్ సినిమాస్ - ముసారాంబాగ్	సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి
PVR ఆర్.కె. - బంజారాహిల్స్	PVR ప్రిస్టన్ మాల్ - గచ్చిబౌలి	డిఎస్ఎల్ మాల్ - ఉప్పల్
PVR ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్	PVR అట్రియమ్ - గచ్చిబౌలి	సినీ ప్లానెట్ - కొంపల్లి
PVR గలేరియా - పంజాగుట్ట	PVR ఎస్‌2 నోము - మల్లాపూర్	ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్
PVR ఐకాన్ - హైటెక్‌సిటీ	జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్	లక్ష్మీకళ సినీప్లెడ్ - మూసాపేట్

SRI LAKSHMI GAYATRI FILMS 9391176659

ఉగాది శుభాకాంక్షలతో

విజయవంతమైన 2వ వారం



దేవి 70ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND
11.15,2.30,6.00,9.15

SVC శ్రీలక్ష్మిఇంద్రనాగేంద్ర - కర్మన్‌ఘాట్ 11.15,2.30,6.15,9.30	విశ్వనాథ్ 70 - కూకట్‌పల్లి 11.45,2.45,6.45,9.45
మల్లికార్జున 70 - కూకట్‌పల్లి 11.15,2.30,6.15,9.30	కోణార్క్ 70 - దిల్‌సుఖ్‌నగర్ 11.00,2.00,6.00,9.00


ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్ 11.00,1.30,4.00,6.30,9.00,11.30
ఎ.ఎం.బి. - గచ్చిబౌలి 10.55,1.40,4.10,7.55,10.45
PVR సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట 10.00,1.00,4.25,7.25,10.25
PVR ఫోరం మాల్ - కూకట్‌పల్లి 10.30,11.00,2.00,5.00,8.00,11.00
PVR ఆర్.కె. - బంజారాహిల్స్ 10.05,1.05,4.45,7.30,11.10
జిఎస్ఎమ్ - మదీనగూడ 10.00,11.05,1.00,2.05,4.00,7.00,8.00,10.00
నెక్లెస్ సత్య - కవాడిగూడ 10.05,1.05,4.05,4.50,7.50,10.50
అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్ 10.15,1.15,4.15,4.50,7.50,10.50
మంజీరామాల్ - కూకట్‌పల్లి 11.00,1.40,2.00,8.10,11.15
సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి 11.00,1.40,1.55,4.50,7.40,11.15
సినిమాస్ - బాలానగర్ 10.30,1.30,4.30,7.30,10.30
సినిమాస్ - చందానగర్ 10.30,1.30,4.30,7.30,10.30
సినీటౌన్ - మియాపూర్ 10.05,1.05,4.45,7.30,10.30
రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి 10.10,1.00,4.45,7.20,10.30
జిపిఆర్ మాల్ - కూకట్‌పల్లి 1.45,4.45,7.30,10.30
PVR ప్రిస్టన్ మాల్ - గచ్చిబౌలి 10.00,1.35,4.35,7.50,10.50
PVR అట్రియమ్ - గచ్చిబౌలి 10.00,1.00,4.10,7.25,10.25
PVR ఎస్‌2 నోము - మల్లాపూర్ 10.00,1.35,4.35,7.50,10.50
జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్ 10.00,1.35,4.35,7.45,10.25
ఎం.పి మాల్ - కాచిగూడ 10.00,1.00,4.50,7.50,10.50
ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్ 10.40,1.30,4.30,7.45,10.35
ఏషియన్ రాధిక - కాప్రా 10.40,1.45,4.35,7.30,10.30
ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్ 10.30,1.40,4.40,7.40,10.40
ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి 10.45,1.30,4.15,7.30,10.40
శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్ 10.45,1.45,4.45,7.45,10.45
షా షహెన్‌షా - చింతల్ 11.30,2.45,6.30,9.45
లక్ష్మీకళ సినీప్లెడ్ - మూసాపేట్ 11.30,2.30,6.30,9.30
మూవీమ్యాక్స్ - మౌలాలి 10.00,1.00,4.00,5.45,7.00,8.30,10.00,11.15
JP జె.పి.సినిమాస్ - చందానగర్ 10.25,1.30,4.25,7.35,10.30

తారకరామ 70 - కాచిగూడ 11.15,2.15,6.00,9.00	అలంకార్ (ప్రశాంత్) - నారాయణగూడ 11.00,2.00,6.00,9.00
వెంకటేశ్వర మల్టీప్లెక్స్ కాంప్లెక్స్ - బోరబండ 11.15,2.30,6.15,9.30	ముక్త 35 - ఆబిడ్స్ 11.30,2.30,6.00,9.15
తాట్లూరి కాంప్లెక్స్ - ఇసిఐఎల్ 11.00,2.00,6.00,9.00	స్వప్న 70 - కాటెదాన్ 11.00,2.15,6.00,9.15
మహాలక్ష్మి 70 - కొత్తపేట 11.15,2.30,6.15,9.30	SV సినీస్క్వేర్ 70 - పటాన్‌చెరు 11.00,2.00,6.00,9.00
రంగ 70 - జీడిమెట్ల 11.00,2.00,6.00,9.00	విజేత 70 - బోరబండ 11.00,2.00,6.00,9.00
జ్యోతి 70 - ఆర్‌సిపురం 11.00,2.00,6.00,9.00	ఆరాధన 70 - తార్నాక 11.00,2.00,6.00,9.00
శ్రీ కృష్ణ 70 - ఉప్పల్ 11.00,2.15,6.00,9.15	శుక్రవారం నుండి
శ్రీలక్ష్మి క.మం - అల్వాల్ 11.00,2.00,6.00,9.00	వైజయంతి 70ఎంఎం - నాచారం
శ్రీరమణ కాంప్లెక్స్ - అంబర్‌పేట 11.00,2.00,6.00,9.00	గణేష్ 70ఎంఎం ఎ/సి - శంషాబాద్
సుష్మ 70 - వనస్థలిపురం 11.00,2.15,6.00,9.15	ASIAN ముకుంద్ ఎ/సి - మేడ్చల్

వరంగల్ · ఖమ్మం · నల్లగొండ · ఆదిలాబాద్ · మెదక్ · రంగారెడ్డి · కరీంనగర్ · నిజామాబాద్ · మహబూబ్‌నగర్

ఉగాది శుభాకాంక్షలతో

ADVENTUROUS BLOCKBUSTER నేడే చూడండి




సంధ్య 70 - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 11.00,2.15,6.00,9.15
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound

MYTHRI THEATRES జగదాంబ 70- ఘట్‌కేసర్ 11.30,2.30,6.30,9.30
First Air Conditioned theatre with Dolby atmos in hyderabad (Single Screen)

ఉగాది శుభాకాంక్షలతో

ఈనెల 12న బ్రహ్మాండమైన విడుదల



లక్ష్మీకళ సినీప్లెడ్ - మూసాపేట్	మహాలక్ష్మి కాంప్లెక్స్ - కొత్తపేట

PVR సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట	నెక్లెస్ సత్య - కవాడిగూడ	ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్
PVR ఫోరం మాల్ - కూకట్‌పల్లి	అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్	మిరాజ్ శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్
జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్	ఏషియన్ సినీమార్ట్ - ఆర్.సి.పురం	మిరాజ్ సినిమాస్ - బాలానగర్
జిఎస్ఎమ్ - మదీనగూడ	సినీ ప్లానెట్ - కొంపల్లి	జె.పి.సినిమాస్ - చందానగర్

PVR ఎస్‌2 - వరంగల్	గీతా - నిజామాబాద్	తిరుమల - మహబూబ్‌నగర్	భవాని 70 - కొత్తకోట
శ్రీదేవి - హన్మకొండ	వేణుమాల్ - నిజామాబాద్	శ్రీనివాస 70 - నర్సాపూర్	భువనేశ్వరి 70 - విజా
శ్రీనివాస - కరీంనగర్	సినిమాస్ - ఆర్మూర్	నేషనల్ 70 - కల్వకుర్తి	మరియు మీ అభిమాన థియేటర్లలో

SHIVA SAI FILMS 9030161717

ఉగాది శుభాకాంక్షలతో

A NEW AGE CRIME COMEDY నేడే చూడండి



సప్తగిరి 70ఎంఎం - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND
11.00,2.00,6.00,9.00

మహాలక్ష్మి కాంప్లెక్స్ - కొత్తపేట 11.00am	తాట్లూరి - ఇసిఐఎల్ 11.00,2.00,6.00,9.00
ఎ.ఎం.బి. - గచ్చిబౌలి 10.30am	లక్ష్మీకళ సినీప్లెడ్ - మూసాపేట్ 2.40pm
సత్యం - అమీర్‌పేట్ 4.15pm	ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్ 11.00am
PVR సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట 4.20,10.30	ఏషియన్ సినీమార్ట్ - ఆర్.సి.పురం 4.30pm
PVR ఫోరం మాల్ - కూకట్‌పల్లి 2.05,10.05	సినీ ప్లానెట్ - కొంపల్లి 10.45am
PVR ఆర్.కె. - బంజారాహిల్స్ 5.35pm	ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్ 7.30pm
PVR ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్ 11.15,4.50	ఏషియన్ రాధిక - కాప్రా 7.30pm
PVR గలేరియా - పంజాగుట్ట 10.35,8.15	ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్ 10.30am
PVR ఐకాన్ - హైటెక్‌సిటీ 1.55,8.05	ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి 1.30pm
PVR పివిఆర్ - ఎర్రమంజిల్ 1.40,10.50	శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్ 1.00,8.00
PVR పివిఆర్ - ముసారాంబాగ్ 11.05,4.50	సినిమాస్ - బాలానగర్ 1.00,8.00
PVR ప్రిస్టన్‌మాల్ - గచ్చిబౌలి 5.15pm	సినిమాస్ - చందానగర్ 1.00,8.00
PVR అట్రియమ్ - గచ్చిబౌలి 1.55,8.05	సినీటౌన్ - మియాపూర్ 5.35pm
PVR ఎస్‌2 నోము - మల్లాపూర్ 5.15pm	రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి 5.35pm

PVR ఎస్‌2 - వరంగల్	SVC గోల్డ్ - మంచిర్యాల	నటరాజ్ - నిజామాబాద్	శ్రీరామ ఎ/సి - జగిత్యాల
శ్రీదేవి - హన్మకొండ	SVC మల్టీప్లెక్స్ - గద్వాల్	PVR జెఆర్ మాల్ - ఆర్మూర్	శాంతమహల్ - తాండూర్
శ్రీనివాస 70 - ఖమ్మం	శ్రీనివాస ఎ/సి - మిర్యాలగూడ	తిరుమల - మహబూబ్‌నగర్	శ్రీనివాస 70 - సిద్దిపేట
శ్రీనివాస - కరీంనగర్	గీతా - నిజామాబాద్	GHR సినిమా - కోదాడ	ఊర్వశి - గోదావరిఖని
శివ 70 - కరీంనగర్	PVR వేణు - నిజామాబాద్	తిరుమల - సూర్యాపేట	విష్ణురూప - కొత్తగూడెం
			మిరాజ్ సినిమాస్ - రాయచూర్

GLOBAL CINEMAS RELEASE

రాజధాని 70 ఎ/సి - దిల్ సుఖ్ నగర్ 11.15,2.15,6.15,9.15	ఇంద్ర పద్మావతి 70- కాచిగూడ 9.15 pm
సినీటౌన్ ఇంద్ర నాగేంద్ర - కర్మన్‌ఘాట్ 2.15,9.15	అంబిక 70 ఎ/సి - సికింద్రాబాద్
	కుమార్ 70 ఎ/సి - కాచిగూడ

ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్ 11.00,3.50,8.40
ఎ.ఎం.బి. - గచ్చిబౌలి 10.30,4.25,7.20,10.20
PVR సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట 11.30,7.50,10.50
PVR ఫోరం మాల్ - కూకట్‌పల్లి 11.30,2.30,8.05,11.00
PVR ఆర్.కె. - బంజారాహిల్స్ 2.35,11.00
ఎం.పి మాల్ - కాచిగూడ 11.15,7.15
జిఎస్ఎమ్ - మదీనగూడ 11.20,8.00,10.50
నెక్లెస్ సత్య - కవాడిగూడ 1.35,7.55,10.50
అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్ 10.50,5.00,10.40
మంజీరామాల్ - కూకట్‌పల్లి 2.10,8.20,11.20
ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్ 11.00,1.50,7.45,10.30
ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి 4.25,7.30,10.30
శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్ 11.00,7.30,10.30
సినిమాస్ - బాలానగర్ 11.00,7.50,10.40
సినిమాస్ - చందానగర్ 11.00,7.50,10.40
సినీటౌన్ - మియాపూర్ 2.35,11.00
PVR పివిఆర్ సినిమాస్ - ముసారాంబాగ్ 11.15,8.00,11.00
PVR ప్రిస్టన్ మాల్ - గచ్చిబౌలి 10.50,4.40,10.30
PVR అట్రియమ్ - గచ్చిబౌలి 2.25,7.50,10.50
PVR ఎస్‌2 నోము - మల్లాపూర్ 10.50,4.40,10.30
జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్ 11.15,7.35,10.30
ఏషియన్ సత్యం - అమీర్‌పేట్ 10.30,4.25,7.30,10.20
సినీమార్ట్ - ఆర్.సి.పురం 11.00,4.35,7.30,10.40
సినీ ప్లానెట్ - కొంపల్లి 11.00,4.35,7.40,10.30
ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్ 11.05,4.35,7.25,10.30
ఏషియన్ రాధిక - కాప్రా 4.25,10.30
స్కైమాల్ - సనత్‌నగర్ 7.45 pm
టివోలి - సికింద్రాబాద్ 12.00,8.00
లక్ష్మీకళ సినీప్లెడ్ - మూసాపేట్ 11.15,2.30,6.30,9.30
విజయలక్ష్మి - ఎల్.బి.నగర్ 1.45,7.30,10.30
మూవీమ్యాక్స్ - మౌలాలి 1.15,7.45
JP జె.పి.సినిమాస్ - చందానగర్ 11.05,1.40,7.35,10.35

MYTHRI MOVIE DISTRIBUTORS LLP

ఘోషిస్తున్న వేద పాఠశాల

నీడ కోసం దీన చూపులు

- మాడవీధుల నిర్మాణంతో కోల్పోతున్న భవనం
- ధార్మిక భవన్‌లోకి తరలించే ప్రతిపాదన
- ససేమిరా అంటున్న దేవాదాయశాఖ అధికారులు
- మూతపడే దిశగా పాఠశాల
- రోడ్డునపడనున్న విద్యార్థులు

హనుమకొండ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : భద్రకాళి గుడి ప్రాంగణంలో ఎన్నో ఏళ్లుగా నిర్వహిస్తున్న వేద పాఠశాల ప్రత్యామ్నాయ నీడ కోసం పరితపిస్తోంది. ధార్మిక భవన్‌లో కాసింత చోటిస్తే అందులో సర్దుకొనేందుకు సిద్ధపడుతోంది. కానీ దేవాదాయ శాఖ అధికారులే వసతి ఇచ్చేందుకు ససేమిరా అంటున్నారు. దీనితో వేద పాఠశాల ఉనికి ప్రశ్నార్థకంగా మారనున్నది. అందులో వేదం అభ్యసిస్తున్న విద్యార్థులు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడనుంది.

ఎన్నో ఏళ్లుగా...

వరంగల్‌లో సుప్రసిద్ధమైన భద్రకాళి దేవాలయ ప్రాం గణంలో వేద పాఠశాల ఎన్నో ఏళ్లుగా నడుస్తోంది. తెలంగాణ రాష్ట్రంలో ఆలయాల ఆధ్వర్యంలో నడుస్తున్న అయిదు వేద పాఠశాలల్లో ఇది ఒకటి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తొలి వేద పాఠశాల ఇది. వేలాది మంది విద్యా ర్థులను వేదపండితులుగా తీర్చిదిద్దిన ఘన చరిత్ర ఈ పాఠశాలకు ఉంది. ఇక్కడ వేదం నేర్చుకొని వేదపండితులుగా, అర్చకులుగా అనేక మంది పలు దేవాలయాల్లో స్థిరపడ్డారు.. ఇప్పుడు ఈ పాఠశాల ఉనికికే ప్రమాదం ఏర్పడింది.

కూల్చివేతకు గురికానున్న భవనం

భద్రకాళి దేవాలయం చుట్టూర రూ.30 కోట్ల వ్యయంతో మాడవీధుల నిర్మాణాన్ని చేపట్టింది తెలిసిందే. ఇటీవల పనులు ప్రారంభమయ్యాయి. మాడవీధుల్లో కొంత భాగంగా భద్రకాళి చెరువు మీది నుంచి నిర్మాణం కాగా, మిగతా సగ భాగం ఆలయం వెనుక నుంచి నిర్మాణం కానుంది.. ఈ క్రమంలో అడ్డుగా ఉన్న వేదపాఠశాల భవనాన్ని తొలగించాల్సిన అనివార్యత ఏర్పడింది. దీంతో పాఠశాలను మరోచోటికి తరలించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రత్యామ్నాయంగా పాఠశాలను ఇటీవల పాతసెంట్రల్ జైలుకు ఎదురుగా నిర్మించిను ధార్మిక భవనంలోకి తరలించాలనే ప్రతిపాదన చేశారు. ఇదే విషయాన్ని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, కలెక్టర్ సిక్తాపట్నాయక్ దృష్టికి తీసుకువచ్చారు. ఇందుకు ఈ ఇద్దరు సుముఖత వ్యక్తం చేశారు. కానీ దేవాదాయ శాఖ అధికారులే ససేమిరా అంటున్నట్టు తెలుస్తోంది. పాఠశాల నిర్వహణకు అవసరమైన చోటు భవన్‌లో లేదని, పైగా ఇక్కడ పాఠశాలను నిర్వహిస్తే ఇందులోని కార్యాలయాల్లో పని చేసే సిబ్బంది విధులకు ఆటంకంగా ఉంటుందన్న సాకులను చూపుతున్నట్టు సమాచారం.

ధార్మిక భవనంలో దొరకని చోటు:

ధార్మిక భవనాన్ని ఇటీవలే రూ.3 కోట్ల వ్యయంతో మూడంతస్తులతో నిర్మించారు. ఇందులో దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయాలు నిర్వహిస్తున్నారు. వీటితో పాటు ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో ఉండాల్సిన సమ్మక్క సారలమ్మ జాతర ఈవో కార్యాలయం కూడా ఇందులోనే ఉంది. ఈ మూడు ఆఫీసులకు ఇంత పెద్ద విశాలమైన భవనం అవసరమే లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ ఆఫీసులకు పోను వేద పాఠశాల నడవడానికి అవసరమైన చాలా స్థలం ఈ భవనంలో ఉంది. అయినా కూడా దేవాదాయ శాఖకు అనుబంధంగా నడుస్తున్న వేద పాఠశాలను తమ దరదాపుల్లోకి రాకుండా అధికారులు అడ్డుపడుతుండడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ధార్మిక భవనం నిర్మాణంలో భద్రకాళి గుడి నుంచి రూ. కోటి వాడుకున్నారు. మడికొండలోని మెట్టుగుట్ట ఆలయం నుంచి రూ. కోటి, సమ్మక్క సారలమ్మ జాతర దేవస్థానం నుంచి రూ.కోటి వాడుకున్నారు. భద్రకాళి గుడి నిధులు మాత్రం తీసుకుంటారు గానీ ఆ ఆలయం ఆధ్వర్యంలో నిర్వహించే వేదపాఠశాలకు మాత్రం ధార్మిక భవన్‌లో కాసింత చోటివ్వడానికి నిరాకరిస్తున్న దేవాదాయ శాఖ అధికారుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మంత్రి, కలెక్టర్ ఆదేశాలను సైతం అధికారులు బేఖాతరు చేస్తున్నారు.



మాడవీధుల నిర్మాణంతో తొలగించనున్న భద్రకాళి ప్రాంగణంలో ప్రస్తుతం ఉన్న వేద పాఠశాల భవనం

మంత్రితో పాటు విజిలెన్స్ ఆరా..

ధార్మిక భవనంలో మరో అంతస్తు నిర్మాణానికి మెట్టురామలింగేశ్వర దేవాలయం ఆదాయం నుంచి దేవాదాయశాఖ అధికారులు రూ.50 లక్షలు తీసుకోవడంపై రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖతో పాటు ఇంటలిజెన్స్ అధికారులు ఆరా తీసినట్టు తెలుస్తోంది. 'దేవుడి సొమ్ముకు ఎసరు' శీర్షికతో సోమవారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన వార్త కథనానికి స్పందించిన మంత్రి ఆరా తీసినట్టు సమాచారం. ఇంటలిజెన్స్ అధికారులు సైతం స్పందించారు. ధార్మిక భవనంలో ఫర్నీచర్ కోసం మరో రూ.30 లక్షలను మూడు దేవాలయాల నుంచి తీసుకోవడంపై కూడా వివరాలను సేకరిస్తున్నట్టు సమాచారం. అంతే కాకుండా అంతకు ముందు భద్రకాళి గుడి ప్రాంగణంలోని భవనంలో గతంలో దేవాదాయశాఖ కార్యాలయాల సముదాయంలోని సుమారు రూ.10 లక్షల విలువైన ఫర్నీచర్ ఏమైందనే విషయమై కూడా ఆరా తీస్తున్నట్టు తెలుస్తోంది.

రోడ్డునపడనున్న విద్యార్థులు

ధార్మిక భవనంలో వేదపాఠశాలకు చోటు దొరకని పక్షంలో వేద పాఠశాల నెలవు కోల్పోయి ప్రత్యామ్నాయ మార్గం లేక చివరకు మూతపడే పరిస్థితి ఏర్పడున్నది. దీంతో ఇందులో చదువుకుంటున్న విద్యార్థులు వీధినపడనున్నారు. వాస్తవానికి ఈ వేద పాఠశాలను ఆలయ ప్రాంగణం నుంచి మరో చోటికి తరలించాలనే ప్రతిపాదన ఎప్పటి నుంచో ఉంది. ప్రస్తుత భవనం ఆలయం కట్టకింద లోతట్టున ఉండడంతో భారీ వర్షాలు వచ్చిన ప్రతీసారి ఇందులోకి వరద నీరు ప్రవేశిస్తోంది. విద్యార్థుల పుస్తకాలు, వస్తువులు తడిసిపోతున్నాయి. వరదనీటి ప్రవాహంతో పాములు భవనంలోకి కొట్టుకువస్తున్నాయి. దీనితో భారీ వర్షాలు పడిన ప్రతీ సారి విద్యార్థులు బిక్కు బిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. గత సంవత్సరం జూన్‌లో కురిసిన భారీ వర్షాలకు విద్యార్థులు వరదనీటిలో చిక్కుకుపోయారు. అతికష్టం మీద వారిని బయటకు రప్పించారు. కొద్ది రోజులు పాఠశాల మూతపడింది. కొత్త అడ్మిషన్లలో జాప్యం ఏర్పడింది. ఇటువంటి పరిస్థితుల్లో గోరుచుట్టుపై రోకలి పోటులా మాడవీధుల నిర్మాణం వల్ల ఉన్న భవనం కూడా కోల్పోతుండడంతో వేద పాఠశాల ఉనికే ప్రశ్నార్థకంగా మారింది. దాని నిర్వహణపై నీలినీడలు పరుచుకుంటున్నాయి. ఈ క్రమంలో మాడవీధుల నిర్మాణం తర్వాత అనువైన స్థలంలో స్వంత భవనం నిర్మాణం అయ్యే వరకు తాత్కాలికంగా పాఠశాలను ధార్మిక భవన్‌కు తరలించడం ఒక్కటే మార్గంగా కనిపిస్తున్నది. పాఠశాల నిర్వాహకులు అక్కడి మార్చేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకోగా దేవాదాయ శాఖ అధికారులు మోకాలు అడ్డుతుండడంతో తరలింపుపై అనిశ్చిత పరిస్థితి నెలకొన్నది. మంత్రి కొండ సురేఖ, కలెక్టర్ సిక్తాపట్నాయక్ ఈ విషయంలో చొవర తీసుకొని ధార్మిక భవన్‌లోకి వేద పాఠశాల తరలేలా చూడాలని కాకతీయ వారసత్వ పరిరక్షణ కమిటీ కన్వీనర్ చీకటి రాజుతో పాటు పలువురు ధార్మికవేత్తలు, వేదపండితులు కోరుతున్నారు.



కార్యకర్తల కష్టసుఖాలలో పాలుపంచుకుంటా..

మాట్లాడుతున్న అరూరి రమేశ్

- బీజేపీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేశ్

ధర్మసాగర్, ఏప్రిల్ 8: కార్యకర్తల కష్టసుఖాలలో పాలుపంచుకుంటూ కంటికి రెప్పాలా కాపాడుకుంటామని వరంగల్ పార్లమెంట్ బీజేపీ పార్టీ అభ్యర్థి అరూరి రమేశ్ అన్నారు. సోమారం ధర్మసాగర్ మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు చట్ల రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్మసాగర్, వేలేరు మండలాల విస్తృత స్థాయి సమావేశానికి ఎంపీ అభ్యర్థి అరూరి రమేశ్, మాజీ మంత్రి విజయరామారావు, మాజీ మేయర్ రాజేశ్వర్‌రావు, మాజీ ఎమ్మెల్యే ధర్మారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా అరూరి రమేశ్ మాట్లాడుతూ పార్టీలో కార్యకర్తల అందరినీ కలుపుకొని పార్టీ కోసం పని చేస్తామన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి మోదీ నాయకత్వంలోని బీజేపీలో చేరానన్నారు. మాజీ మంత్రి విజయ రామారావు మాట్లాడుతూ దేశ భవిష్యత్ యువత చేతుల్లో ఉందని, ప్రధాన మంత్రి చేస్తున్న అభివృద్ధిని ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించాలన్నారు. మాజీ మేయర్ రాజేశ్వర్‌రావు మాట్లాడుతూబీజేపీ 400సీట్లు గెలిచే అవకాశం ఉందన్నారు. కడియం శ్రీహరి బిడ్డ కోసం నీతి మాలిన రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే ధర్మారావు మాట్లాడుతూ పేదవాడికి న్యాయం చేసే పార్టీ బీజేపీ అని అన్నారు. ఎంపీ అభ్యర్థి రమేశ్‌ను లక్ష ఓట్ల మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఆనంతరం తాటికాయల గ్రామానికి చెందిన యువకులు అరూరి సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు విజయరావు, జిల్లా నాయకులు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బతో వృద్ధురాలి మృతి



బొమ్మగాని నిర్మల (ఫైల్)

జనగామ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వడదెబ్బతో వృద్ధురాలు మృతిచెందిన సంఘటన జనగామ జిల్లాకేంద్రంలో సోమవారం జరిగింది. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం జిల్లాకేంద్రంలోని సంజయ్‌నగర్‌కు చెందిన బొమ్మగాని నిర్మల (65) స్థానికంగా ఓ హోటల్‌లో పనిచేస్తోంది. ఇంటి నుంచి హోటల్‌కు రోజు నడుచుకుంటూ వెళ్లి వచ్చేది. ఈ క్రమంలో రెండు క్రితం హోటల్ నుంచి ఇంటికి ఎండలో నడుకుంటూ రాగా అస్వస్థతకు గురైంది. దీంతో కుటుంబ సభ్యులు చికిత్స చేయించారు. ఈ క్రమంలో ఆదివారం అర్ధరాత్రి పరిస్థితి విషమించడంతో స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతిచెందింది. మృతురాలి కుమారుడు శ్రీకాంత్‌గౌడ్ ఓ దిన పత్రికలో రిపోర్టరుగా పనిచేస్తున్నాడు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

పలువురి పరామర్శ

వడదెబ్బతో మృతిచెందిన నిర్మల కుమారుడు శ్రీకాంత్‌గౌడ్‌ను కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఎంతో పాటు పలు పార్టీల నాయకులు, జర్నలిస్టులు పరామర్శించారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మృతదేహంపై పూలమాల వేసి నివాళులు అర్పించారు. అదేవిధంగా కాంగ్రెస్ నేతలు చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి, మేడ శ్రీనివాస్, చెంచారపు బుచ్చిరెడ్డి, కౌన్సిలర్లు రాంచందర్, జక్కుల అనిత, సీపీఎం భువనగిరి అభ్యర్థి ఎండి.జహంగీర్, సీపీఎం నేతలు బూడిద గోపి, జోగు ప్రకాశ్ తదితరులు పరామర్శించారు. శ్రీకాంత్‌గౌడ్‌కు మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య ఫోన్ ద్వారా సంతాపం తెలిపారు. శ్రీకాంత్‌గౌడ్ ఆర్థిక పరిస్థితి బాగాలేకపోవడంతో జనగామ జర్నలిస్టులు, పలువురు నేతలు ఆర్థికసాయం అందించారు.

పెళ్లింట విషాదం.. విద్యుదాఘాతంతో రైతు మృతి



చందర్ (ఫైల్)

ఖానాపురం, ఏప్రిల్ 8 : పెళ్లింట విషాదం నెలకొంది.. ఈనెల 24న కుమారుడి వివాహం కోసం ఏర్పాట్లు చేస్తుండగా.. విద్యుదాఘాతంతో సోమవారం రైతు మృత్యువాత పడడంతో ఖానాపురం మండలం కొడ్తిమాట్‌తండాలో విషాదం నెలకొంది. పోలీసుల కథనం ప్రకారం..

కొడ్తిమాట్‌తండాలకు చెందిన బానోతు చందర్(52)కు భార్య ఇద్దరు కుమారులున్నారు. కాగా, తనకున్న రెండున్నర ఎకరాల్లో మొక్కజొన్న, అపరాల సాగు చేస్తున్నాడు. పంటకు తన వ్యవసాయ బావి నీరు సరిపోకపోవడంతో సమీపంలో ఉన్న తన చిన్నాన్న(సమీప బంధువు) బావి నుంచి కొన్ని రోజులుగా నీటిని వాడుకుంటున్నాడు. రోజులాగే మోటార్ స్టాటర్‌ను ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. కాసేపటికి సమీపంలోని రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోలీసులు శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడి భార్య హచ్చమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. హెడ్ కానిస్టేబుల్ రమేష్ తెలిపారు. చందర్ చిన్నకుమారుడు శివకు ఈనెల 24 వివాహం చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. బట్టలు, బంగారం కొనుగోలు చేశారు. పెండ్లి పనుల్లో ఉండగానే చందర్ మృతి చెందడంతో పెళ్లింట్లో విషాదం నెలకొంది.

బైక్ అదుపు తప్పి ఒకరి మృతి



శివ (ఫైల్)

చిట్యాల, ఏప్రిల్ 8: ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఒకరు మృతిచెందిన సంఘటన చిట్యాల మండలం ముచినిపర్తి శివారు వెంకటేశ్వర్లపల్లిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రేగొండ మండలం కొడవటంచ గ్రామానికి చెందిన నాగుల శివ (26) వ్యక్తిగత పని నిమిత్తం గణపురం మండలం కర్కపల్లికి ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. ఈక్రమంలో వెంకటేశ్వర్లపల్లి గ్రామ శివారులో ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడిపోయాడు. తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘన స్థలాన్ని ఎస్సై-2 షాఖాన్ సందర్శించి వివరాలు సేకరించారు. మృతుడికి భార్య లావణ్య, మూడు సంవత్సరాల కుమారుడు ఉన్నాడు.

పురుగుల మందు తాగి వివాహిత ఆత్మహత్య



మృతురాలు నాగమణి

నర్మెట, ఏప్రిల్ 8 : పురుగుల మందు తాగి ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం మండలంలోని లోక్యతండా గ్రామ పంచాయతీ పరిధిలోని హన్మచంద్రుతండాలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం హన్మచంద్రుతండాకు చెందిన బానోతు వేణు నాగమణి(21) భార్యభర్తలకు గత కొద్ది రోజులుగా గొడవ జరుగుతోంది. ఈ క్రమంలో సోమవారం గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెందిన నాగమణి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఎక్కువ మోతాదులో తాగడంతో ఇంట్లోనే మృతి చెందింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించారు. నాగమణి మృతిపై బంధువులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. నాగమణి మృతికి భర్త వేణు వేధింపులే కారణమని, కొట్టి చంపి ఉంటాడని మృతురాలు బంధువులు ఆరోపిస్తున్నారు. మృతురాలికి మూడు నెలల చిన్న బాబు ఉన్నాడు. భర్త వేణుపై చర్యలు తీసుకోవాలని జనగామ ఏరియా ఆస్పత్రి ఎదుట మృతురాలు బంధువులు గొడవ చేసినట్టు సమాచారం. ఈ విషయమై ఎస్సై కన్నెబోయిన శ్రీకాంత్‌ను వివరణ అడుగగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ఐస్‌క్రీంలో ఎలాంటి వ్యర్థ పదార్థాలు కలుపలేదు

- జిల్లా సహాయ ఆహార నియంత్రణాధికారి

నెక్కొండ, ఏప్రిల్ 8 : నెక్కొండలోని అంబేడ్కర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఐస్‌క్రీం బండిలో వ్యర్థ పదార్థాలు (మూత్రం, వీర్యం) కలిపి అమ్ముతున్నట్లు సోషల్ మీడియాలో జరిగిన ప్రచారం అవాస్తవమని జిల్లా సహాయ ఆహార నియంత్రణాధికారి పి.అమృతశ్రీ సోమవారం రాత్రి తెలిపారు. ఐస్‌క్రీంలో వ్యర్థ పదార్థాలను కలిపి అమ్ముతున్న విషయమై జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఆదేశాల మేరకు మార్చి 19న బండి యజమాని కాలురాంపై పోలీసు కేసు నమోదు చేయడంతో పాటు అతను విక్రయించిన ఐస్‌క్రీం సంబంధించి నాలుగు నమూనాలను సేకరించి రాష్ట్ర ఆహార ప్రయోగశాల హైదరాబాద్‌కు పరీక్షల నిమిత్తం పంపించామన్నారు. కానీ ఐస్‌క్రీం పదార్థాలో (మనిషికి సంబంధించి మూత్రం, వీర్యం) ఎలాంటి వ్యర్థాలు కలువలేదని ల్యాబ్ అధికారులు తెల్చినట్లు చెప్పారు. సామాజిక మాధ్యమంలో వచ్చే వీడియోలను సరైన పద్ధతిలో నిర్ధారించుకొని, ఆహార అధీకృత అధికారుల తనిఖీల తర్వాత ప్రజలు నమ్మాలన్నారు.

హేమాచలుడిని దర్శించుకున్న సీసీఎఫ్



సీసీఎఫ్‌కు స్వాగతం పలుకుతున్న అర్చకులు

మంగపేట, ఏప్రిల్, 8: మండలంలోని మల్లూరు హేమాచల లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని కాళేశ్వరం చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (సీసీఎఫ్) ప్రభాకర్ సోమవారం దర్శించుకున్నారు. ఆయనకు అర్చకులు రాజశేఖరశర్మ, రాఘవాచార్యులు, ఈశ్వర్‌చంద్ శర్మ స్వాగతం పలికారు. గోత్రనామాలతో అర్చనలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. స్వామివారి శేషవస్త్రాలతో సత్కరించారు.సీసీఎఫ్ వెంట తాడ్వాయి ఎఫ్ఆర్వో సత్తయ్య, మంగపేట డిప్యూటీ రెంజర్ కోటేశ్వర్, ఇతర ఫారెస్ట్ ఉద్యోగులు ఉన్నారు.

నేటినుంచి భద్రకాళి ఆలయంలో నవరాత్రి మహోత్సవాలు

వరంగల్ కల్చరల్, ఏప్రిల్ 8 : వరంగల్ నగరంలోని భద్రకాళి అమ్మవారి దేవస్థానంలో వసంత నవరాత్రి మహోత్సవాలు నేటి నుంచి 17వ తేది వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి శేషభారతి ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీక్రోధి నామ సంవత్సరం ఉగాది రోజున మంగళవారం అమ్మవారికి పూర్ణాభిషేకం నిర్వహించడంతో నవరాత్రి రథం ప్రారంభమవుతుందన్నారు. చైత్ర శుద్ధ పాడ్యమి రోజున బ్రహ్మ తన శృష్టిని పూర్తి చేశాడని శ్రీభద్రకాళి అమ్మవారే బ్రహ్మ స్వరూపమని వసంత నవ రాత్రి ఉత్సవాల్లో అమ్మవారిని పూజిస్తే అన్ని శుభాలు కలుగుతాయని తెలిపారు.

ఎంజీఎంలో రేడియాలజీ విభాగంలో ఆగిన సేవలు

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 8 : వరంగల్ ఎంజీఎం హాస్పిటల్‌లో సోమవారం డిజిటల్ ఎక్స్‌రే మిషన్ పని చేయక రోగులు ఇబ్బంది పడ్డారు. ఆస్పత్రి రేడియాలజీ డిపార్ట్‌మెంట్‌లో ఉన్న ఎక్స్‌రే మిషన్‌లో డిజిటల్ ఎక్స్‌రే మిషన్ ఒకటి మాత్రమే గత కొన్ని సంవత్సరాలుగా పని చేస్తోంది. మరో రెండు మిషన్లు ఉన్నా అవి మొబైల్ ఎక్సరే కావడంతో సేవలు అంతంత మాత్రంగానే పని చేస్తున్నాయి. సోమవారం ఓపీ, ఐపీ రోగులు అధికంగా రావడంతో ఎక్స్‌రే మిషన్లు పని చేయక ఇబ్బంది పడ్డారు. చివరకు మొబైల్ ఏక్సేంజ్ మిషన్‌పై ఎమర్జెన్సీ రోగులకు ఎక్స్‌రేలు తీశారు. పనిచేయని డిజిటల్ ఎక్సరే మిషన్‌ను రిపేర్ చేయిస్తామని అధికారులు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

వరంగల్ క్రైం, ఏప్రిల్ 8: హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని పరిసరాల్లో రూ.13 లక్షల విలువైన పీడీఎస్ బియ్యాన్ని రాష్ట్ర ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. స్టేషన్ పరిధిలో పెద్దఎత్తున పీడీఎస్ రైస్ దందా నడుస్తుందనే సమాచారంతో ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం నిఘా వేసి బియ్యం తరలిస్తున్న లారీని స్వాధీనం చేసుకున్నారు. వరంగల్ నగరానికి చెందిన జన్ను అనిల్ అనే వ్యక్తి వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో పీడీఎస్ రైస్ సేకరించి లారీలో మహారాష్ట్రకు తరలించేందుకు యత్నిస్తున్న క్రమంలో పట్టుకున్నారు. 680 బ్యాగులతో కూడిన లారీని స్టేషన్‌కు తరలించి డ్రైవర్ సునిల్‌ను, అక్రమ దందా చేస్తున్న అనిల్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఈ విషయన్ని హసన్‌పర్తి పోలీసులు ధృవీకరించారు.

అత్యాశకు పోయి డబ్బులు పోగొట్టుకున్న వ్యక్తి

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 8 : వాట్సాప్ లింకు ఓపెన్ ద్వారా వచ్చే డబ్బులకు ఆశపడి ఓ వ్యక్తి డబ్బులు పోగొట్టుకున్నాడు. వివరాల్లోకి వెళితే.. రాయపురకు చెందిన మహ్మద్ ఇబ్రహీం ఓ వాట్సాప్ గ్రూప్‌లో వచ్చిన లింక్‌ను ఓపెన్ చేయగా టెలిగ్రామ్ ఐడికి కనెక్ట్ అయ్యాడు. అటు నుంచి గుర్తుతెలియని వ్యక్తి కంపెనీ మేనేజర్‌గా చాట్ చేసి ట్రేడింగ్ ద్వారా డబ్బులను డబుల్ చేసుకోవచ్చని ఆశ కల్పించాడు. వారిచ్చిన ఐడికి మూడు దశలో 7,000 ట్రాన్స్‌ఫర్ చేయగా తిరిగి 8,327 రూపాయలు ఇబ్రహీంకు ట్రాన్స్‌ఫర్ చేశారు. తర్వాత ఇన్వెస్ట్ చేయమని చాట్ చేయగా 5,000 ట్రాన్స్‌ఫర్ చేశాడు. ఇంకొక 30,000 చేస్తే విత్ డ్రా ఆప్షన్ వస్తుందని చెప్పగా 30,000 ట్రాన్స్‌ఫర్ చేశాడు. అయినా విత్ డ్రా ఆప్షన్ రాకుండా మరోక సారి డబ్బులు ఇన్వెస్ట్ చేయాలని అడగడంతో మోసపోయినని గ్రహించిన బాధితుడు హనుమకొండ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పున్నేలులో మద్యం పట్టివేత

ఐనవోలు, ఏప్రిల్ 8 : అనుమతులు లేకుండా విక్రయిస్తున్న మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై అనిల్ కుమార్ కథనం ప్రకారం పున్నేలు గ్రామంలో రావుల రాజు అనే వ్యక్తి తన ఇంట్లో మద్యం నిల్వచేసి విక్రయిస్తుండగా తనిఖీలు నిర్వహించి రూ.7821 వేల మద్యాన్ని స్వాధీనం చేసుకొని ఆయనపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అందరికీ విద్య ప్రభుత్వ బాధ్యత

- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు ఉన్నత విద్యకు దూరం
- వర్సిటీలకు యూజీసీ నిధులు తగ్గాయి..
- ప్రముఖ సామాజిక వేత్త, ప్రొఫెసర్ హరగోపాల్
- కేయూలో ఉన్నత విద్యపై సింపోజియం

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 8 : అందరికీ విద్య ప్రభుత్వ బాధ్యతని ప్రముఖ సామాజిక వేత్త, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం రిటైర్డు ప్రొఫెసర్ జి.హరగోపాల్ అన్నారు. సోమవారం కేయూ సెనెట్ హాల్‌లో కేయూ రిటైర్డు ప్రొఫెసర్ల సంఘం అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎ.సదానంద అధ్యక్షతన సింపోజియం నిర్వహించారు. 'తెలంగాణలో ఉన్నత విద్య ప్రస్తుత పరిస్థితులు-బలోపేతం చేయడానికి అనుసరించాల్సిన విధానాలు' అనే అంశంపై హరగోపాల్ మాట్లాడారు. ప్రభుత్వాలు మారినప్పటికీ విద్యకు బడ్జెట్‌లో నిధులు పెంచడం లేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలు ఉన్నత విద్యకు దూరం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. యూజీసీ నిధులు బాగా తగ్గించారని చెప్పారు. పరిశోధన ప్రాజెక్టులు నిధుల లేమితో ఇబ్బందులు పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్య ప్రైవేట్, వాణిజ్యపరం కావడంతో తరువాతి తరం వారు సేవ దృక్పథాన్ని మరిచి వాణిజ్య పరంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రపంచ బ్యాంకు నిబంధనల మేరకు విద్య ప్రైవేట్ పరం అవుతోందని హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. గత కొన్నేళ్ళుగా విద్య రంగంపై ప్రభుత్వాలు నియమించిన కమిటీలు వాటి సిఫార్సులను వివరించారు. ప్రపంచంలో నిరంతరం ఎదురవుతున్న పోటీలకు దీటుగా ప్రభుత్వ విద్య సంస్థలుండాలని అన్నారు.

రాష్ట్రంలో విద్య రంగంలో గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియోలో ప్రగతి ఉందని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి అన్నారు. రాష్ట్రంలోని 99 డిగ్రీ కళాశాలలు న్యాక్ గ్రేడింగ్ పొందాయని చెప్పారు. దేశంలో బెస్ట్ ప్రాక్టీస్‌గా దోస్త్ అడ్మిషన్ల ప్రక్రియ నిలుస్తోందని చెప్పారు. అన్ని కళాశాలల్లో రూల్స్ ఆఫ్ రిజర్వేషన్లు ఖచ్చితంగా అమలవుతున్నాయని చెప్పారు. విద్య లక్ష్యం విద్యార్థి వికాసం, ఉపాధి, ఆత్మ విశ్వాసం కావాలని కోరారు. కాకతీయ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి విద్య రంగ పురోగతికి ప్రభుత్వాలు చాలా కమిటీలను ఏర్పాటు చేసినప్పటికీ స్పష్టత రాలేదని వివరించారు. 75 ఏళ్ళ భారతంలో గుణాత్మక విద్య అందించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. బడ్జెట్‌లో నిధుల కేటాయింపు తక్కువగా ఉందన్నారు. వర్సిటీలు క్రాస్ రోడ్డులో ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. యూజీసీ రిటైర్డు చైర్మన్ సుఖదేవ్ థోరట్ జూమ్ వెబ్‌సైట్‌లో సమావేశంలో మాట్లాడారు. యూజీసీ బడ్జెట్ కోత ఉందని చెప్పారు. ప్రభుత్వం పరిశోధనలకు, ప్రాజెక్టులకు నిధులు ఇవ్వడం లేదన్నారు. తెలంగాణ అకాడమి ఆఫ్ సైన్స్ అధ్యక్షుడు డాక్టర్ సీహెచ్. మోహన్‌రావు మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయాలు స్టూడెంట్స్ కేంద్రంగా ఉండాలని అన్నారు. జీడీపీలో విద్య రంగానికి పెద్ద మొత్తంలో నిధులు కేటాయించాలని అన్నారు. సమావేశంలో విశ్రాంత ప్రొఫెసర్ల సంఘం జనరల్ సెక్రటరీ ప్రొఫెసర్ వడ్డె రవీందర్, ఎస్డీఎల్‌సీఈ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ జి.వీరన్ననాయక్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, హైయర్ ఎడ్యుకేషన్ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ టి.పాపిరెడ్డి, ప్రొఫెసర్ కూరపాటి వెంకట్‌నారాయణ, ప్రొఫెసర్ ఇక్బాల్ అలీ, ప్రొఫెసర్ తాటం శ్రీనివాస్, ప్రొఫెసర్ గాదె దయాకర్, ప్రొఫెసర్ ఎర్రగట్టు స్వామి, చింత సమ్మయ్య, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, కృష్ణమాచారి, సంజీవరెడ్డి, సాయిలు, దీపాజ్యోతి, రామస్వామి, ఇంద్రాసేనారెడ్డి, రామిరెడ్డి, కట్ల రాజేందర్, ప్రొఫెసర్ కె.కాత్యాయని విద్మహే, రాంనాథ్‌కిషన్, సక్రియా, ప్రొఫెసర్ శోభ, ఎఆర్ పెండ్లి అశోక్‌బాబు పాల్గొన్నారు.

16న 'స్వీప్' ఆధ్వర్యంలో 5కే రన్



మాట్లాడుతున్న ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా

హనుమకొండ కలెక్టరేట్, ఏప్రిల్ 8 : ఓటు హక్కు కలిగిన ఓటర్లు ఎన్నికల్లో ఓటు వేసే విధంగా చైతన్యవంతం చేసేలా స్వీప్ ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీన 5కే రన్ నిర్వహించనున్నట్లు ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా తెలిపారు కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో 5కే రన్ కార్యక్రమ నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా మాట్లాడుతూ 16న ఉదయం 6 గంటలకు హనుమకొండలోని జేఎన్ఎస్ స్టేడియం నుండి రన్ ప్రారంభమై హనుమకొండ కలెక్టరేట్ వరకు కొనసాగుతుందన్నారు. ఈ పరుగులో విద్యార్థులు, యువత, అధికారులు, ఉద్యోగులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. 5కే రన్ విజయవంతం చేసేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్వీప్ నోడల్ ఆఫీసర్ లక్ష్మీ రమాకాంత్, జిల్లా సంక్షేమ అధికారి మధురిమ, గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ కాజీపేట డిప్యూటీ కమిషనర్ రవీందర్, జిల్లా యువజన, క్రీడల అధికారి అశోక్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

జిల్లా అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా

18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని హనుమకొండ జిల్లా అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా అన్నారు. హనుమకొండలోని కాకతీయ డిగ్రీ కళాశాలలో సోమవారం కొత్త ఓటర్ల నమోదు, ఓటింగ్ శాతాన్ని పెంచడంపై విద్యార్థులకు స్వీప్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా మాట్లాడుతూ ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరు తప్పకుండా వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, స్వీప్ నోడల్ అధికారి, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీరమాకాంత్, కేడీసీ ప్రిన్సిపాల్ రాజిరెడ్డి, డీఎల్‌పీవో సుదర్శన్, ఎంపీవో రవిబాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ వినోద్‌రావు పాల్గొన్నారు.

గంజాయి రవాణాను అరికట్టాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో మల్టీజోన్-1 ఐజీ రంగనాథ్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎస్పీ శబరీశ్, అధికారులు

ములుగు కలెక్టరేట్, ఏప్రిల్ 8: ములుగులో జిల్లాలో గంజాయి రవాణాను అరికట్టాలని మల్టీజోన్-1 ఐజీ ఎ.వి.రంగనాథ్ అన్నారు. ఎన్‌డీపీఎస్‌పై ములుగులోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ శబరీశ్, జిల్లా పోలీస్ అధికారులతో ఐజీ సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్‌డీపీఎస్ కేసుల నమోదు, డ్రగ్స్ సరఫరా నిలుపుదలకు తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో యాంటీ డ్రగ్స్ కమిటీ ఏర్పాటుచేసి ఇప్పటికే 757.625 కిలోల గంజాయిని పట్టుకుని ధ్వంసం చేశామని, తెలిపారు. ఇటీవల మరిన్ని కేసులు నమోదు చేశామని అన్నారు. గంజాయి సరఫరాను అడ్డుకునే లక్ష్యంగా అంతర్రాష్ట్ర, జిల్లా రహదారుల వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆదివాసీలకు గంజాయి వాడకం పట్ల కలిగే దుష్ఫలితాలను వివరిస్తూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఐజీకి వివరించారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో ఏటూరునాగారం ఏఎస్పీ గీతే మహేష్ బాబాసాహెబ్, ములుగు డీఎస్పీ రవీందర్, డీసీఆర్బీ డీఎస్పీ రాములు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, ములుగు, ఏటూరునాగారం, పస్రా సీఐలు రంజిత్‌కుమార్, రాజు, శంకర్, సీసీఎస్ సీఐ శ్రీనివాస్, ఎస్సైలు వెంకటేశ్వర్, రాజు, కమలాకర్, కృష్ణప్రసాద్, రవికుమార్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

శిక్షణ శిబిరాలకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ స్పోర్ట్స్, ఏప్రిల్ 8: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (సాట్) ఆదేశాల మేరకు హనుమకొండ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్ఏ) ఆధ్వర్యంలో మే 1 నుంచి 31 వరకు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నిర్వహించనున్న వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవడానికి విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీవైఎస్‌వో అశోక్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. నెల రోజుల పాటు ఉచితంగా నిర్వహించనున్న వేసవి శిక్షణ శిబిరంలో 4వ తరగతి నుంచి ఇంటర్ చదువుతున్న బాల బాలికలు పాల్గొనవచ్చన్నారు. ఈ శిబిరాల్లో శిక్షణ ఇచ్చేందుకు అనుభవజ్ఞులైన సీనియర్ క్రీడాకారులు, పీడీలు, పీఈటీలు ఈ నెల 25వ తేదీ వరకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఇండోర్ స్టేడియంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. హనుమకొండ జేఎన్ఎస్‌లో వివిధ క్రీడా అంశాల్లో నిర్వహించనున్న వేసవి శిక్షణ శిబిరంలో పే అండ్ ప్లే పద్ధతిన ప్రతీ రోజు ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని అశోక్ సూచించారు.

పంచాంగం ఆవిష్కరణ

మడికొండ, ఏప్రిల్ 8: మడికొండలోని బురుజు వద్ద బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ఉపద్రష్ట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం నూతన క్రోధి నామ సంవత్సర పంచాంగం ఆవిష్కరణ జరిగింది. ప్రముఖ పంచాంగ సిద్ధాంతి అవసరాల ప్రసాద్‌శర్మ ముఖ్య అతిథిగా పాల్గొని నూతన పంచాంగాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షుడు అనుముల నవీన్, బాపిరాజు, రుగ్వేద శర్మ, దామోదర్, శ్రీను, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.



మడికొండలో పంచాంగం ఆవిష్కరిస్తున్న ప్రముఖ పంచాంగ సిద్ధాంతి అవసరాల ప్రసాద్ శర్మ

కాంగ్రెస్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలి

ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

కాజీపేట, ఏప్రిల్ 8 : పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం 47 డివిజన్ ఇంపిరియల్ కాలనీ, బాపూజీనగర్, భవానీ నగర్, బాలాజీ నగర్‌ల నుంచి కాంగ్రెస్ నాయకుడు సిరిల్ లారెన్స్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలో ఆహ్వానించారు. అనంతరం నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎండీ అజీజ్‌ఖాన్, కార్పొరేటర్లు విజయశ్రీ రజాలి, రవిందర్, మాజీ కార్పొరేటర్ గోల్కొండ రాంబాబు, రావుల సదానందం, గుంటి కుమారస్వామి, చుంచు అశోక్, షేక్ అస్గర్, విజయభాస్కర్, ఇప్ప శ్రీకాంత్, రమేశ్, నాగేశ్వర్‌రావు, రాజేందర్, రాజ్ కుమార్, శ్రీనివాస్, సామి, నారగాజ్, మానస, మధు తదితరులు పాల్గొన్నారు.

'మా కమిటీ ఎలాంటి తప్పు చేయలేదు'

రాంనగర్, ఏప్రిల్ 8 : గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ నిధులు తాము దుర్వినియోగం చేసినట్లు ఆరోపిస్తూ ప్రస్తుత కమిటీ పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదులో వాస్తవం లేదని, తాము ఎలాంటి తప్పు చేయలేదని గత కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు తుమ్మ శ్రీధర్‌రెడ్డి, పెరుమాండ్ల వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. తమపై అకారణంగా స్టేషన్‌లో ఫిర్యాదు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. తమ హయాంలో సభ్యుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేశామని, ప్రెస్ క్లబ్‌కు రెగ్యులర్ ఆదాయం వచ్చేలా చశామని, కరోనా కష్టకాలంలో తమ కమిటీ సభ్యులకు అండగా నిలిచిందన్నారు. ప్రెస్ క్లబ్‌కు సుప్రీం అయిన జనరల్ బాడీ ఆమోదాల మేరకే నడుచుకున్నామని వారు వివరించారు. నూతన కమిటీ కోరిన ప్రకారం తమ హయాంలోని లావాదేవీల గురించి స్పష్టత ఇచ్చినట్లు తుమ్మ శ్రీధర్‌రెడ్డి, పెరుమాండ్ల వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. లెక్కల విషయంలో ఎప్పుడైనా చెప్పడానికి తమ కమిటీ సిద్ధంగా ఉందన్నారు. పారదర్శకంగా సభ్యులకు తమవంతు సేవలందించామని వారు తెలిపారు. కావాలని కొంతమంది తమపై బురదచల్లే ప్రయత్నం చేస్తున్నారని వారు ఆరోపించారు. తమకు సభ్యుల మద్దతు ఉందని చట్టపరంగా కానీ జనరల్ బాడీలో కానీ తమ నిజాయితీని నిరూపించుకోవడానికి సిద్ధమని శ్రీధర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు తెలిపారు.

ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ పెద్దపీట

కాంగ్రెస్ పార్టీ వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య

రాంనగర్, ఏప్రిల్ 8 : ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని కాంగ్రెస్ పార్టీ వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి కడియం కావ్య తెలిపారు. పరకాల ఎమ్మెల్యే, వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జి రేవూరి ప్రకాశ్‌రెడ్డి హనుమకొండలోని తన నివాసంలో నడికూడ మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రేవూరి ప్రకాశ్‌రెడ్డి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరితో పాటు కడియం కావ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా కడియం కావ్య మాట్లాడుతూ... అధికారంలోకి వచ్చిన నాలుగు మాసాల్లోనే ఇచ్చిన హామీలు నెరవేస్తూ ప్రజా సంక్షేమ పాలన అందిస్తున్నారని తెలిపారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ అభివృద్ధిని గాలికి వదిలేసి మత విద్వేషాలు రెచ్చగొట్టి మరోసారి అధికారంలోకి రావాలని చూస్తుందన్నారు. బీజేపీని చిత్తుగా ఓడించాలని ఆమె పిలుపునిచ్చారు. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జూడో యాత్ర కార్యకర్తలకు బలాన్ని ఇచ్చిందన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న తమ పార్టీ కేంద్రంలో అధికారంలోకి వచ్చి తీరుతుందని కావ్య ధీమా వ్యక్తం చేశారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేందుకు కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని ఆమె సూచించారు. వరంగల్ ఎంపీ అభ్యర్థిగా మీ ముందుకు వస్తున్న తనను గెలిపించాలని కావ్య విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో నడికూడ మండల నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న కడియం కావ్య

సైన్స్‌పై విద్యార్థులు ఆసక్తి పెంచుకోవాలి

సీసీఎంబీ మాజీ డైరెక్టర్ డాక్టర్ మోహన్‌రావు

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 8 : నేటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సైన్స్‌తోనే సాధ్యమని, సైన్స్‌పై విద్యార్థులు ఆసక్తిని పెంచుకుంటే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని సీసీఎంబీ మాజీ డైరెక్టర్ డాక్టర్ మోహన్‌రావు అన్నారు. సోమవారం సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో సైన్స్ విభాగం అధ్యాపకులకు నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమంలో డాక్టర్ మోహన్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమాజంలో ఏదైనా సంఘటన జరిగినప్పుడు నిజనిర్ధారణ కోసం సైన్స్‌ను ఆశ్రయిస్తారని, ముఖ్యంగా డీఎన్ఏ పరిశోధనతో వాస్తవాలు బయటకు వస్తాయని తెలిపారు. టెక్నాలజీతోపాటు సైన్స్‌ను కూడా పెంపొందించుకుంటే విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. అనంతరం కేయూ వీసీ ప్రొఫెసర్ టి.రమేశ్ మాట్లాడుతూ అధ్యాపకులు తమకున్న అవకాశాన్ని అందిపుచ్చుకునే విధంగా తరగతి గది పరిశోధనకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. బోధన, పరిశోధన నిరంతర ప్రక్రియ అని కొంత మందికి అవకాశాలు రాకపోయినా వారి సేవలు సమాజానికి ఎంతోగానో దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రమేశ్, పీఆర్వో డాక్టర్ ఆదిరెడ్డి, సైన్స్ విభాగం అధ్యాపకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ మోహన్‌రావు

రాజకీయాలు పక్కకు పెట్టండి.. రైతులకు నీళ్లివ్వండి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వీరయ్య

మహదేవపూర్ రూరల్, ఏప్రిల్ 8: మేడిగడ్డ బ్యారేజీలో లక్షల కోట్ల అవినీతి జరిగిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్.వీరయ్య ఆరోపించారు. అయితే.. రాజకీయాలను పక్కకు పెట్టి రైతులకు సాగునీరు అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సాగు, తాగునీరు లేక కరువు విలయతాండవం చేస్తుంటే ప్రస్తుత ప్రభుత్వం పట్టించుకోకుండా వదిలేయడం, గత బీఆర్ఎస్ ప్రభుత్వం అదే బ్యారేజీకి మరమ్మతులు చేయాలని పట్టుపట్టడం, ఇలా ఒకరిపై ఒకరు విమర్శలు చేస్తూ కాలయాపన చేయడం సరికాదని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీని సీపీఎం బృందం సోమవారం సందర్శించింది. ఈసందర్భంగా ఎస్. వీరయ్య మీడియాతో మాట్లాడారు. సాగునీటి ప్రాజెక్టుల చరిత్రలో అత్యధికంగా ఖర్చు చేసింది కాళేశ్వరం ప్రాజెక్టుకేనని అన్నారు. అందులో రూ. 18వేల కోట్ల వ్యయంతో మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణాన్ని ప్రారంభం చేసి అడ్డగోలుగా అంచనా వ్యయం పెంచేశారని ఆరోపించారు. ప్రాజెక్టు నిర్మించి నాలుగేళ్లు కూడా పూర్తికాక ముందే పగుళ్లు తేలాయంటే గత ప్రభుత్వం అత్యంత బాధ్యతరాహిత్యంగా వ్యవహరించడానికి నిదర్శనమని విమర్శించారు. బ్యారేజీ కుంగడానికి డిజైన్ లోపమా.. నిర్మాణ సంస్థ వైఫల్యమా.. అవినీతి వల్లే జరిగిందా? అనేది న్యాయవిచారణ చేపట్టి బాధ్యులను శిక్షించాలని డిమాండ్ చేశారు.

ఈప్రాజెక్టును కొనసాగించాలా.. వద్దా.. లేదంటే ప్రాణహిత చేవేళ్ల నిర్మాణం చేపట్టాలా? అని ప్రస్తుత ప్రభుత్వం అంటోందన్నారు. బీఆర్ఎస్ నాయకత్వం బ్యారేజీకి మరమ్మతులు చేయాలంటూ పట్టుబడుతోందన్నారు. ఇలా సమయాన్ని వృథా చేస్తూ రాజకీయ పబ్బం గడుపుతున్నారని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతికి పాల్పడి, నిర్మాణ కాంట్రాక్టర్లతో కుమ్మక్కై జేబులు నింపుకున్న విషయం వాస్తవమన్నారు. ఏదేమైనా 16టీఎంసీల నీరు నిల్వ ఉండే బ్యారేజీ నిరుపయోగంగా మారడం వల్ల రైతులకు నష్టం జరుగుతోందన్నారు. బ్యారేజీ పునర్నిర్మాణంపై నిర్ణయం తీసుకొనేలోగా ప్రత్యామ్నాయ పద్ధతిలో నీటిని తరలించి రైతులకు న్యాయం చేయాలని అన్నారు. మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం కుంగిపోయిన పిల్లర్లే కాకుండా ఇతర పిల్లర్లు సైతం కుంగిపోయే ప్రమాదం ఉందని అన్నారు. బ్యారేజీకి మరమ్మతులు చేయకుండా నీటిని ఎగువకు తరలించే అంశంపై అఖిల పక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి నీటి తరలింపుపై చర్చించాలని డిమాండ్ చేశారు. ఈ బృందంలో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు నాగయ్య, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సాగర్, పార్టీ జిల్లా కార్యదర్శి బందు సాయిలు, నాయకులు రాజేందర్, రాజయ్య, శంకర్, శ్రీకాంత్, మల్లన్న, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు

12న బీజేపీ బూత్ స్థాయి సమ్మేళనం

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 8 : త్వరలో జరుగనున్న లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 12 న బీజేపీ వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ బూత్ స్థాయి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి అరూరి రమేశ్ తెలిపారు. సోమవారం హనుమకొండలోని ఓ ప్రైవేట్ హోటల్ లో పార్లమెంట్ స్థాయి కోర్ కమిటీ సమావేశం పార్లమెంట్ నియోజకవర్గ కో- ఆర్డినేటర్ తాళ్లపల్లి కుమారస్వామి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ప్రధానంగా పార్టీ సంస్థాగత నిర్మాణం, భవిష్యత్ కార్యచరణ, చేపట్టాల్సిన కార్యక్రమాలపై కోర్ కమిటీ చర్చ జరిగింది.

ఈ సమావేశంలో పార్లమెంట్ ప్రభారి డాక్టర్. వి. మురళీధర్, మార్తినేని ధర్మారావు, హనుమకొండ, వరంగల్, జనగామ, భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు రావు పద్మ, గంట రవికుమార్, దశమంత్‌రెడ్డి, నిషిధర్, విజయరామారావు, రాజేశ్వర్‌రావు, కొండేటి శ్రీధర్, కీర్తిరెడ్డి, కాశీప్రసాద్, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, చాడ శ్రీనువాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నుంచి బీజేపీలోకి చేరికలు

పర్వతగిరి మండలం శ్రీనగర్ మాజీ ఉప సర్పంచ్‌లు కొరిటాల సుబ్బారావు, గుమ్మడి ప్రసాద్‌రావు, విజయ్, భాస్కర్, 44వ డివిజన్ భట్టుపల్లికి చెందిన పోషన్న, రాజు ఆధ్వర్యంలో పలువురు సోమవారం బీఆర్ఎస్ నుంచి బీజేపీలోకి చేరారు. హనుమకొండ ప్రశాంత్‌నగర్‌లోని అరూరి నివాసంలో జరిగిన కార్యక్రమంలో అరూరి, ధర్మారావులె పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో గుమ్మడి శ్రీనివాస్, వెంకట్‌రావు, ప్రసాద్, ప్రభాకర్, రామారావు, స్వామి, కేశవరావు, శేషాద్రీ లక్ష్మీనారాయణ, ప్రశాంత్, పవన్, సిద్ధు ఉన్నారు.

అందుబాటులో మెరుగైన వైద్యం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ కూరపాటి రమేశ్

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 8: కుల, మత, ప్రాంత బేధం లేకుండా సమాజంలోని ప్రతీ ఒక్కరికి మెరుగైన వైద్య సేవలు అందించడానికి ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, ప్రైవేట్ ఆస్పత్రులు కృషి చేయాల్సిందిగా కూరపాటి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ కూరపాటి రమేశ్ పిలుపునిచ్చారు. డబ్ల్యూహెచ్‌వో పిలుపు మేరకు మెరుగైన వైద్యం అందించడానికి కూరపాటి హాస్పిటల్ ఆధ్వర్యంలో పలు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏప్రిల్, మే నెలల్లో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారికి ప్రత్యేక రాయితీతో కూరపాటి హాస్పిటల్‌లో లాపరోస్కోపి, లేసర్ సేవలు అందించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం కార్యక్రమంలో వరల్డ్ హెల్త్ డే పోస్టర్‌ను డాక్టర్ కూరపాటి రమేశ్ ఆవిష్కరించారు.

బల్దియా వెహికిల్ షెడ్ తనిఖీ

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 8 వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో బాలసముద్రంలో నిర్వహించే వెహికల్ షెడ్డును నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే సోమవారం క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. అక్కడ విధులు నిర్వర్తించే సిబ్బంది పని తీరును వివరాలు అడిగి తెలుసుకున్నారు. హాజరు ఇరిజిస్ట్రర్‌ను పరిశీలించారు. ఎన్ని వాహనాలు తుప్పుపట్టి ఉన్నాయి ? ఎన్ని వాహనాలు మరమ్మత్తుకు నోచుకోకుండా ఉన్నాయి ? అని అక్కడి సిబ్బందిని అడిగారు. మరమ్మతుకు వచ్చే వాహనాలు వెంటనే రిపేరు చేసి పంపించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. చెత్త తరలింపు వాహనాలు మరమ్మతుకు వచ్చిన నేపథ్యంలో వెంటనే రిపేరు చేసి పంపించాలని చెప్పారు. అత్యవసర అవసరాలను గుర్తించి వాహనాలను రిపేరు చేసి సిబ్బందికి సహకరించాలని అన్నారు. ఇంకా వాహన కర్మాగారంలో అన్ని చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు.

'ఏకశిల'లో ఉగాది వేడుకలు



ఉగాది వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

న్యూశాయంపేట, ఏప్రిల్ 8 : హనుమకొండ కేయూరోడ్‌లోని ఏకశిల హైస్కూల్‌లో సోమవారం ఘనంగా ఉగాది వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు సాంప్రదాయ దుస్తులు ధరించారు. తీపి, పులుపు, వగరు, చేదు, ఉప్పు, కారం వంటి ఆరు రకాల రుచులతో చేసిన మధురమైన ఉగాది పచ్చడిని అందరికి పంచారు. అనంతరం పిల్లల చేత పంచాంగ పఠనం చేయించారు. ఈ సందర్భంగా ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి ప్రజలందరికీ ముందుగా ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకలలో స్కూల్ డైరెక్టర్ బేతి కొండల్ రెడ్డి, ప్రిన్సిపాల్ బేతి శైలజ, ఉపాధ్యాయులు, స్వప్న, స్వాతి, కల్పన, సుమలత, లక్ష్మి, వైశాలి, మౌనిక పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న ఆనాటి విద్యార్థులు

ఐనవోలు, ఏప్రిల్ 8: పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆత్మీయతను చాటింది. ఐనవోలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 2006-07 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు సోమవారం పాఠశాలలో సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. పదో తరగతి పూర్తయిన తరువాత ఉన్నత చదువులతోపాటు వివిధ రంగాల్లో స్థిరపడిన సుమారు 80 మంది విద్యార్థులు 17 సంవత్సరాలకు ఒక చోట సమావేశం కావడంతో ఆనందంలో మునిగిపోయారు.

'సమాచార హక్కు చట్టాన్ని విస్మరిస్తున్నారు'

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 8: కొన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టం ప్రకారం సమాచారం కోరితే నిర్లక్ష్యం చేస్తున్నారని వారిపై ఉన్నతస్థాయి అధికారులు చర్యలు చేపట్టాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దొగ్గెల తిరుపతి డిమాండ్ చేశారు. సోమవారం హనుమకొండ రాంనగర్‌లోని సీపీఎం జిల్లా కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడారు. ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన సమాచార హక్కు చట్టం 2005ని కొంత మంది అధికారులు దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు.

వాహనదారులకు జరిమానా

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 8: నిబంధనలు ఉల్లఘించిన 55 మంది వాహనదారులకు జరిమానా విధించినట్లు హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ షూకూర్ తెలిపారు. 55 మందినికోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రమేశ్ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 42 మందికి 68,000, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా పట్టుబడిన 10 మందికి రూ, 10,400 జరిమానాగా విధించారన్నారు.వీరు కాకుండా ముగ్గురు మైనర్‌లకు రూ, 3,200 జరిమానా విధించడం జరిగిం దన్నారు.

బెల్టు షాపులపై దాడి

రూ.31 వేల అక్రమ మద్యం స్వాధీనం

వరంగల్ క్రైం, ఏప్రిల్ 8 : గీసుగొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం దాడులు చేశారు. గీసుగొండ గ్రామంలో రెండు చోట్ల రూ.19200, రూ.5140 స్తంభంపల్లి గ్రామంలో రూ.7140 అక్రమ మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయాన్ని ఏసీపీ ఎ.మధుసూదన్ ధ్రువీకరించారు.

చలివేంద్రం ఏర్పాటు



మాట్లాడుతున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 8 : హోప్‌ఫుల్ హార్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ సర్కిల్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సీఎండీ వరుణ్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. నిత్యం రద్దీగా ఉండే నక్కలగుట్ట ప్రాంతంలో ప్రజలకు చలివేంద్రాన్ని అందుబాటులోకి తీసుకరావడం గొప్ప విషయమన్నారు. అలాగే సొసైటీ తరఫున అనాథ పిల్లలను కుల, మతాలకు అతీతంగా ఆదుకోవడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో హోప్‌ఫుల్ హార్ట్స్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు జాన్సన్, బాధ్యులు ఫాతిమారెడ్డి, నరేంద్రపాల్, రఘు, భాస్కర్, ప్రభాకర్, ఎన్పీడీసీఎల్ ఇంచార్జీ డైరెక్టర్స్ అశోక్‌కుమార్, సదర్‌లాల్, మోహన్‌రావు, తిరుపతిరెడ్డి, సీజీయంలు పాల్గొన్నారు.

శ్రీకరం.. శ్రీక్రోధి..

(5వ పేజీ తరువాయి)

నిర్వహి స్తారు. హనుమకొండ ఎక్సైజ్ కాలనీలోని వేంకటేశ్వర ఆలయంలో మంగళవారం ఆల య స్థానాచార్యులు సముద్రాల పురుషోత్తమచార్యచే పంచాంగ పఠనం నిర్వహిస్తారు.

టీటీడీ ఆధ్వర్యంలో..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పంచాంగ శ్రవణాలు, శ్రీరామ నవమి వేడుకల సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు టీటీడీ, హిందూ ధర్మప్రచార పరిషత్ నిర్వాహకులు రామిరెడ్డి కృష్ణమూర్తి చెప్పారు. ముఖ్యంగా హనుమకొండలోని ఏకశిలా పార్కు సమీపంలోని సీతారామచంద్రస్వామి ఆలయం వరంగల్ హంటర్ రోడ్‌లోని అభయాంజనేయస్వామి ఆలయంలో టీటీడీ ఆధ్వర్యంలో వేడుకలు జరగనున్నట్లు ఆయన చెప్పారు.

తెల్లవారుజామున్నే నిద్రలేచి అభ్యంగన స్నానం చేసి కొత్త బట్టలు ధరించి షడ్రుచుల పచ్చడిని తయారు చేసుకొని బక్తాలతో కలిసి భుజించడం ఈ పండుగకు ప్రత్యేకం. ప్రతీ ఇంటిని మామిడి తోరణాలతో అలంకరించి ఇష్ట దేవతలను పూజిస్తారు. సాయంత్రం ఆలయాల సందర్శనతోపాటు పంచాంగ శ్రవణాల్లో పాల్గొనడం ఈ పండుగకు ప్రత్యేకం.

టెన్నిస్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



టెన్నిస్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

జూలైవాడ, ఏప్రిల్ 8: వరంగల్ జిల్లా టెన్నిస్ అసోసియేషన్ 2024-27 సంవత్సరాల నూతన కార్యవర్గాన్ని సోమవారం హనుమకొండలోని ఆఫీసర్స్ క్లబ్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా జీఎస్ఎన్.రెడ్డి, కార్యదర్శిగా ఎన్.మనోహర్‌రెడ్డి, కోశాధికారిగా డాక్టర్ ప్రవీణ్, ఉపాధ్యక్షులుగా జి.రాజేశ్వర్‌రావు, ఇ.మురుగన్, జాయింట్ సెక్రటరీ బి.కన్నారెడ్డి, ఈసీ మెంబర్లుగా పి.రవీందర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, జి.కేశవరావు, డాక్టర్ వివిఎస్.రెడ్డి, గోపాల్‌రావు, టి.మధుసూదన్‌రావు, డాక్టర్ కె.శ్రీనివాస్, సి.భాస్కర్, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ మధుకర్‌రెడ్డి ఎన్నికయ్యారు. అనంతరం నూతన అధ్యక్షుడు జీఎస్ఎన్.రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 10న వరంగల్ జిల్లా టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమ్మర్ టెన్నిస్ కోచింగ్ క్యాంప్ నిర్వహించనున్నట్లు తెలిపారు క్యాంప్ వివరాల కోసం వరంగల్ ఆఫీసర్స్ క్లబ్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు ఐక్యంగా పోరాడాలి

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 8 : ఎస్సీ వర్గీకరణ కోసం తాడోపేడో తేల్చుకునే సమయం ఆసన్నమైందని అందరూ ఏకతాటిపై పోరాడితే ఎస్సీ వర్గీకరణ సాధిస్తామని ఎంఎస్పీ జాతీయ నేత సూరన్న అన్నారు. సోమవారం కేయూ మానవీయ శాస్త్ర భవనంలో ఎంఎస్ఎఫ్ కేయూ ఇన్‌చార్జి డాక్టర్ వడ్డెపలి మధు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సూరన్న మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణతోనే మాదిగ, మాదిగ ఉపకులాలకు న్యాయం జరుగుతోందని అన్నారు. వర్గీకరణ పోరాటం అంతిమదశకు చేరిందన్నారు. ఎస్సీ వర్గీకరణ పోరాటంలో అందరూ ఏకతాటి పైకిరావాలన్నారు. ఏప్రిల్ 10న కేయూలో ఎమ్మార్పీఎస్ అధినేత మంద కృష్ణమాదిగ నేతృత్వంలో విద్యార్థులతో రౌండ్ టేబుల్‌సమావేశం నిర్వహిస్తారని వెల్లడించారు. సమావేశంలో మేధావులు, విద్యార్థులు పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నేతలు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వంగపల్లికి ఎంపీ టికెట్ ఇవ్వాలి

కాళోజీ జంక్షన్, ఏప్రిల్ 8: రిజర్వ్‌డ్ స్థానమైన వరంగల్ లోక్‌సభ టికెట్‌ను వంగపల్లి శ్రీనివాస్‌కు కేటాయించి మాదిగల ఆత్మగౌరవాన్ని నిలుపాలని ఎమ్మార్పీఎస్-టీఎస్ రాష్ట్ర యువసేన అధ్యక్షుడు, కోర్ కమిటీ సభ్యులు పొట్ట పెంజర రమేశ్ మాదిగ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. సోమవారం హనుమకొండ రాయల్ గార్డెన్స్ సమీపంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమావేశానికి హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఇల్లందుల రాజేష్‌ఖన్నా అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో కోర్ కమిటీ సభ్యులు గణేష్, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి యాకయ్య పాల్గొన్నారు.

ఉగాది స్పెషల్

ఉగాది పచ్చడిలోని షడ్రుచుల్లో ఆరు రకాల ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. వేసవి నుంచి రక్షణ కల్పించే ఆ ఆరోగ్య ప్రయోజనాల గురించి తెలుసుకుందాం!

పచ్చడిలో ప్రయోజనాలు





ఆధునిక వైద్య శాస్త్రం విటమిన్లు, ఖనిజ లవణాలు మొదలైన పోషకాల తూకాన్ని బట్టి ఆహార పదార్థాల పోషక విలువను లెక్క కడుతుంది. ఆరు రుచుల సిద్ధాంతాన్ని అనుసరించే ఆయుర్వేద శాస్త్రం, షడ్రసోపేతమైన ఆహారాన్నే పోషకాహారంగా పరిగణిస్తుంది. ఈ వైద్య రహస్యాన్ని ఉగాది పచ్చడి గుర్తు చేస్తుంది. ఉగాది పచ్చడి శరీరంలోని వాత, పిత్త, కఫ దోషాలను తొలగిస్తుందని కూడా ఆయుర్వేదం చెప్తోంది. ఉగాది పచ్చడిలోని ఆరు రుచులు శరీరాన్ని రాబోయే కాలానికి తగ్గట్టు సిద్ధం చేస్తాయి. వగరు, తీపి, చేదు, పులుపు, కారం, ఉప్పు. ఈ ఆరు రుచులు రక్త దోషాలతో సంబంధమున్న దద్దుర్లు, అలర్జీలు, జ్వరం, ఇతర చర్మ సమస్యల నుంచి రక్షణ కల్పిస్తాయి.

చేదు చేసే మేలు

ఉగాది పచ్చడిలో ఉపయోగించే వేప పూలు క్రిమిసంహారకాలు. రోగనిరోధకశక్తిని పెంచడంతో పాటు, రక్తదోషాలను కూడా హరిస్తాయి. ఉగాది పచ్చడిలో కలుపుకోవడమే కాకుండా వేప పూలతో పచ్చడి, కారప్పొడి చేసుకుని అన్నంతో పాటు తినవచ్చు. వేప పూలు 35 రకాల వ్యాధులను అరికడతాయి. వేప ఆకులు, పూలు, పండ్లు, విత్తనాలు, వేర్లు, బెరడు, జిగురుల్లో కూడా ఔషధ గుణాలుంటాయి.

తీపి లాభం

ఉగాది పచ్చడిలో ఉపయోగించే బెల్లం వల్ల కాలేయం శరీరంలోని విషాలను బయటకు నెడుతుంది. సెలీనియం, జింక్ లాంటి ఆక్సిడెంట్స్ కలిగిన బెల్లం తినడం వల్ల ఫ్రీ ర్యాడికల్ డ్యామేజ్ ఆగిపోయి, ఇన్‌ఫెక్షన్ల బారిన పడకుండా శరీరం ఇమ్యూనిటీని పొందుతుంది.

వగరు అవసరం

వగరుగా ఉండే మామిడి ముక్కలు పేగుల్లోని పుండ్లు, రక్తస్రావాలను అరికడతాయి. వేసవిలో వేధించే ఎండదెబ్బ నుంచి కూడా రక్షణ కల్పిస్తాయి. వీటిలోని సి విటమిన్ ఎండ వేడి నుంచి చర్మాన్ని రక్షిస్తుంది.

పులుపు ప్రయోజనం

చింతపండులోని పులుపు డీహైడ్రేషన్ నుంచి కాపాడి, రక్తప్రసరణను మెరుగు పరుస్తుంది. ఛాతీలో మంట తగ్గుతుంది. పేగులను శుభ్రపరిచి, బ్యాక్టీరియా ఇన్‌ఫెక్షన్లు రాకుండా చేస్తుంది. రక్తనాళాలు సాగే గుణాన్ని పెంచుతుంది.

ఉప్పు ఉపయోగం

వేసవిలో లవణాలు కోల్పోవడం మూలంగా ఆవరించే నిస్సత్తువ తగ్గడం కోసం ఉప్పు ఉపయోగపడుతుంది. కీళ్ల నొప్పులను తగ్గించి, చెమటతో తగ్గిన శరీరంలోని సోడియం మోతాదులను సమం చేస్తుంది.

కారం లాభం

కారంతో స్వల్పకాలిక రుగ్మతలు, చర్మ సమస్యలు తగ్గుతాయి. కారం తినడం వల్ల శరీరం వ్యాధులతో పోరాడే శక్తిని పెంచుకుంటుంది.

డాక్టర్ జి.వి పూర్ణచందు
ఆయుర్వేద నిపుణులు

అవగాహన

ఊబకాయ గర్భిణులు ఎంత బరువు పెరగవచ్చు?

గర్భం దాల్చిన మహిళలు బరువు పెరగక తప్పదు. గర్భిణి పెరిగే బరువును బట్టి కడుపులో పెరిగే బిడ్డ ఆరోగ్యాన్ని వైద్యులు అంచనా వేయగలుగుతారు. అయితే ముందు నుంచే ఒబేసిటీతో బాధపడే గర్భిణుల పరిస్థితి ఏంటి? వాళ్లు ఏ మేరకు బరువు పెరగవచ్చు? పెరిగే బరువుతో వాళ్ల ఆరోగ్యం మీద పడే ప్రభావమెంత?

ఒబేసిటీతో బాధపడే గర్భిణులు 5 నుంచి 9 కిలోల వరకూ, ఎత్తుకు తగిన బరువున్న గర్భిణులు 11 నుంచి 16 కిలోల వరకూ బరువు పెరగవచ్చనే ప్రభుత్వ మార్గదర్శకాలున్నాయి. అయితే 25 - 30 బీఎమ్ఐను కలిగి ఉన్న క్లాస్ 1, 2 ఒబేసిటీ కోవకు చెందిన మహిళలు ప్రస్తుత ప్రభుత్వ ప్రమాణాల కంటే తక్కువ బరువు పెరగడం వల్ల, తల్లికీ, బిడ్డకూ ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ఉంటాయి. అలాగే క్లాస్ 3 ఒబేసిటీకి చెందిన మహిళలు సిఫార్సు చేసిన బరువు కంటే తక్కువ బరువు పెరగడం ప్రయోజనకరంగా ఉండవచ్చు. జెస్టేషనల్ డయాబెటిస్ (గర్భంతో ఉన్న




ప్పుడు మధుమేహం బారిన పడడం), ప్రసవం తర్వాత కూడా పెరిగిన బరువు తగ్గకపోవడం (ఎక్సెసివ్ పోర్ట్‌పార్టమ్ వెయిట్ రిటెన్షన్), మేటర్నల్ కార్డియో మెటబాలిక్ డిసీజ్, పిల్లలు నెలలు నిండకుండా పుట్టడం, పుట్టిన వెంటనే పసికందులు చనిపోవడం మొదలైన సమస్యలు తలెత్తకుండా ఉండాలంటే, గర్భంతో ఉన్నప్పుడు అవసరానికి మించి బరువు పెరగకుండా చూసుకోవాలి. ఊబకాయులైన మహిళలు గర్భం దాల్చడానికంటే ముందే వైద్యులను కలిసి బరువు తగ్గించుకునే ప్రయత్నం చేయాలి. వైద్యులు సూచించిన ఆహార నియమాలను కచ్చితంగా పాటిస్తూ, ప్రమాణాలకు మించి బరువు పెరగకుండా చూసుకోవాలి.

మీకు తెలుసా?

ఈ బ్యాండ్ ఎయిడ్ వద్దు

బ్యాండ్ ఎయిడ్ లేని ఫస్ట్ ఎయిడ్ బాక్సులు ఉండవు. అయితే మనందరం వాటర్ ప్రూఫ్ బ్యాండ్ ఎయిడ్‌లనే కొంటూ ఉంటాం. కానీ వీటిలో విషపూరిత 'ఫరెవర్ రసాయనాలు' ఉంటాయి.

వాటర్ ప్రూఫ్ బ్యాండ్ ఎయిడ్స్‌లో అనే ఫరెవర్ కెమికల్స్ ఉంటాయి. ఇవి గాయం ద్వారా రక్తప్రవాహంలో కలిసి, పలు రకాల ఆరోగ్య సమస్యలను కలిగిస్తాయి. ఈ రసాయనాలు పిల్లల ఎదుగుదల, పునరుత్పత్తులను ప్రభావితం చేయడంతో పాటు ఒబేసిటీ, పలు రకాల కేన్సర్లను కూడా కలిగిస్తాయి. మరి ఇంతటి దుష్ప్రభావాలను కలిగి ఉన్న ఫరెవర్ కెమికల్‌ను గాయాలను మాన్పే బ్యాండ్ ఎయిడ్ తయారీలో ఎందుకు ఉపయోగిస్తున్నారు? పిఎఫ్ఎఎస్ (పాలీఫ్లోరో ఆల్కైల్ సబ్‌స్టెన్సెస్) ఇది సింథటిక్ కెమికల్. నీటికి తడవవు, వేడికి చెక్కుచెదరవు, నూనె, జిడ్డుల్లాంటివి



వీటికి అంటుకోవు. కాబట్టే ఈ రసాయనాన్ని బ్యాండ్ ఎయిడ్స్‌తో పాటు జిగురును కలిగి ఉండే అథెసివ్స్, నాన్‌స్టిక్ వంట పాత్రలు, ఫుడ్ ప్యాకేజింగ్స్‌లో విరివిగా ఉపయోగిస్తూ ఉంటారు. ఈ ఫరెవర్ కెమికల్స్ (శాశ్వత రసాయనాలు)కు ఆ పేరు రావడానికి కారణం, ఇవి ఎప్పటికీ క్షీణించకపోవడమే! కాబట్టే ఇవి శరీరంలోకి చేరుకున్న తర్వాత ఎన్నో ఏళ్ల పాటు అక్కడే ఉండిపోతాయి. ఇవి గాయాల ద్వారా, స్పర్శ ద్వారా శరీరంలోకి చేరుకుని ఆరోగ్యకరమైన కణజాలాల్లో తిష్ఠ వేసుకుని అంతర్గత అవయవాలకు హాని కలిగిస్తాయి. కాబట్టి వాటర్ ప్రూఫ్ బ్యాండ్ ఎయిడ్‌లు, నాన్‌స్టిక్ కుక్‌వేర్, ప్యాకేజ్డ్ ఫుడ్స్ వాడకం మానేయాలి.



డయాబెటిస్

బొబ్బట్లు, పూర్ణాలు, పొంగలి, పాయసం... ఉగాది పిండివంటలు నోరూరిస్తుంటే మనసు చంపుకుని, నోరు కట్టేసుకోవడం ఎవరికైనా కష్టమే! మరి మధుమేహుల సంగతేంటి? తీపి జోలికి వెళ్లకుండా ఉండవలసిందేనా? అవసరం లేదంటున్నారు వైద్యులు. స్వీట్స్ తిన్నా, షుగర్ పెరగకుండా ఉండడం కోసం ఏం చేయాలో, 'డయాబెటిక్ నర్వ్ డ్యామేజ్'కు గురి కాకుండా ఉండాలంటే ఎలా నడుచుకోవాలో వైద్యులు చెప్తున్నారు.

మధుమేహులు తీపి తినొచ్చా?

మధుమేహులు పండుగలు, వేడుకల్లాంటి సందర్భాల్లో పరిమితంగా తీపి తినొచ్చు. అయితే ఏం తిన్నాం అనే దాని కంటే ఎంత తిన్నాం? అనేది గమనించుకోవాలి. తినే తీపి విషయంలో పరిమితి పాటించాలి. ఒక స్వీటుతో సరిపెట్టేసుకుంటే ఫర్వాలేదు. ఒక స్వీటుతో తినడం ఆపలేని వాళ్లు స్వీట్లకు దూరంగా ఉండడమే మేలు. అలాగే కొందరు మధుమేహులు 'నచ్చినవన్నీ స్వీట్లు తినేసి, ఒకటికి రెండు చక్కెర మాత్రలు వేసుకుంటే సరిపోతుందిలే!' అనుకుంటూ ఉంటారు. కానీ ఇది సరి కాదు. చక్కెర మాత్రలు దీర్ఘ సమయం పాటు ప్రభావాన్ని చూపుతాయి. మధ్యాహ్నం భోజనంలో స్వీట్లు తినేసి, రెండు చక్కెర మాత్రలు వేసుకుంటే రాత్రికి లేదా మరుసటి రోజు



ఉదయానికీ శరీరంలో చక్కెర మోతాదులు పడిపోవచ్చు. కాబట్టి ఒకటికి రెండు మాత్రలు తీసుకోవడం సరి కాదు. ఎప్పటి మాదిరిగానే మందులు వేసుకోవాలి. అలాగే స్వీట్ తిన్నా చక్కెర నియంత్రణలో ఉండడం కోసం కొన్ని జాగ్రత్తలు పాటించాలి. స్వీటు తిన్నప్పుడు మిగతా ఆహారంలో కోత విధించడం, అదనంగా మరొక 15 నిమిషాలు నడవడం లేదా వ్యాయామం చేయడం చేయాలి.

పిల్లల ఇన్సులిన్ ఇంజెక్షన్ ఇలా...

టైప్1 డయాబెటిస్ పిల్లల విషయంలో వాళ్లు స్వీటు తినేటప్పుడు, తిన్న గంటన్నర తర్వాత చక్కెరను పరీక్షించాలి. ఒకవేళ రక్తంలో చక్కెర పెరిగినట్టు కనిపిస్తే, అవసరాన్ని బట్టి ర్యాపిడ్ ఇన్సులిన్ రెండు నుంచి నాలుగు యూనిట్లు ఇవ్వాలి. అయితే ఇలా ఇన్సులిన్ కరెక్షన్ చేసే సమయంలో, అప్పటివరకూ పిల్లలు తిన్న పిండిపదార్థాల మోతాదును అంచనా వేయవలసి ఉంటుంది. ఇలా పిల్లల ఆహారపుటలవాట్లను కచ్చితంగా లెక్కించే తల్లితండ్రులు, వాళ్ల కార్బోహైడ్రేట్ల మోతాదును అంచనా వేసి, తిన్న స్వీటు ఆధారంగా పిల్లలకు ఇవ్వవలసిన ఇన్సులిన్ మోతాదును లెక్కించి ఇంజెక్షన్ ఇవ్వవచ్చు. అయితే అలాగని పిల్లలు తరచూ స్వీట్లు తినడానికి వీల్లేదు. అరుదుగా మాత్రమే ఇలా ర్యాపిడ్ ఇన్సులిన్ ఇంజెక్షన్ మీద ఆధారపడాలి.

వ్యాయామం అవసరం!

- అరగంట తగ్గకుండా, ఆపకుండా నడవాలి.
- యోగా, ఏరోబిక్స్, స్కిప్పింగ్, స్ట్రెచెస్, యాబ్స్, పుషప్స్, క్రంచెస్, లైట్ వెయిట్స్ మొదలైన వ్యాయామాలు చేయాలి.
- గదులు శుభ్రం చేయడం, తోట పని, పుస్తకాల అల్మారా సర్దడం లాంటి ఇంటిని శుభ్రపరిచే పనులు కూడా వ్యాయామ ఫలాన్నే అందిస్తాయి.
- శరీర బరువు అదుపులో ఉంచుకోవడం కోసం తాజా పళ్లు, కూరగాయలతో పక్కా ఆహార ప్రణాళిక తయారుచేసుకుని, అనుసరించాలి.
- గ్లైసెమిక్ ఇండెక్స్, క్యాలరీలు, పిండిపదార్థాలు, ఆహార పరిమాణాలు సరిచూసుకుంటూ పోషకాల లోపం ఏర్పడకుండా చూసుకోవాలి.
- ఇంట్లో చిరుతిళ్లు లేకుండా చూసుకోవాలి.

నాడులు దెబ్బతింటే...

దీర్ఘకాలంగా మధుమేహం కలిగి ఉన్న వాళ్లు, క్రమం తప్పకుండా షుగర్ మందులు వాడుకుంటున్నప్పటికీ, వాళ్లలో ఎంతో కొంత నాడీ నష్టం జరుగుతూ ఉంటుంది. పాదాలు, అర చేతుల్లో సూదులతో గుచ్చినట్టు, మండుతున్నట్టు అనిపిస్తే, డయాబెటిక్ నర్వ్ పెయిన్‌గా అనుమానించాలి. దెబ్బతిన్న నాడులకు రక్త సరఫరా మందగించడం మూలంగా ఆయా అవయవాల్లో నొప్పి వేధించడం మొదలుపెడుతుంది. దాంతో చిన్నపాటి పనులు కూడా చేయలేని దుస్థితి నెలకొంటుంది. ఆ పరిస్థితే... న్యూరోపతీ లేదా పెరిఫెరల్ నర్వ్ డ్యామేజ్. 60 నుంచి 70 శాతం మధుమేహుల్లో న్యూరోపతీ ఉంటున్నట్టు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డయాబెటిస్ అండ్ డైజెస్టివ్ అండ్ కిడ్నీ డిసీజ్ గణాంకాలు చెప్తున్నాయి. దీర్ఘకాలం పాటు అత్యధిక చక్కెర మోతాదులను కలిగి ఉన్న మధుమేహుల్లో న్యూరోపతీ, నాడి నొప్పితో మొదలవుతుంది. కొందర్లో అంతర్గతంగా న్యూరోపతీ ఉన్నప్పటికీ లక్షణాలు కనిపించకపోవచ్చు. మరికొందర్లో నొప్పి మూలంగా కదల్లేని పరిస్థితి కూడా కనిపించవచ్చు.

ఈ లక్షణాల మీద కన్నేసి...

న్యూరోపతీ లక్షణాలు మధుమేహులందర్లో ఒకేలా ఉంటాయి. కానీ ఎక్కువ శాతం మంది ప్రారంభంలో ఆ లక్షణాలను నిర్లక్ష్యం చేస్తూ ఉంటారు. కానీ సమస్య ముదిరి, అవయవం పాడైపోకుండా ఉండాలంటే లక్షణాలను మొదట్లోనే కనిపెట్టాలి.

- **మొద్దుబారడం:** నాడీ నొప్పి మొదలయ్యే ముందు ఆ ప్రదేశం మొద్దుబారుతుంది. నడిచేటప్పుడు పాదాల స్పర్శను కోల్పోతారు. పాదాలకు సాక్సు వేసుకుని నడుస్తున్నట్టు అనిపించవచ్చు. పాదాల్లో, అరచేతుల్లో తిమ్మిర్లు, మంట ఉండవచ్చు.
- **నొప్పి:** అకస్మాత్తుగా కరెంటు షాకు తగిలినట్టు అనిపించడం, తీవ్రమైన నొప్పి వేధించడం కూడా న్యూరోపతీ లక్షణాలే! కొన్నిసార్లు చేతుల్లోని వస్తువులు తెలియకుండా కింద పడిపోతూ ఉంటాయి. ఇలా పట్టు కోల్పోవడం కూడా న్యూరోపతీ లక్షణమే!
- **బ్యాలెన్స్ తప్పడం:** నేరుగా నడవలేకపోవడం, నడిచేటప్పుడు అడుగులు తడబడి, బ్యాలెన్స్ తప్పడం నర్వ్ డ్యామేజీ లక్షణాలు.
- **వేడి, చల్లదనం:** అతి వేడి, అతి చల్లదనాలను తట్టుకోలేకపోవడం. కాఫీ కప్పు నొప్పి కలిగించేటంత వేడిగా అనిపించవచ్చు. చల్లని చేతులతో ఎవరైనా తాకితే, ఆ చల్లదనం బాధను కలిగించవచ్చు.
- **పుండ్లు:** పాదాల్లో పుండ్లు ఏర్పడవచ్చు. లేదా దెబ్బ తగిలినప్పుడు ఆ ప్రదేశంలో నాడీ నష్టం వల్ల స్పర్శ తగ్గడం మూలంగా గాయం తీవ్రతను కనిపెట్టలేకపోవచ్చు.

నాడులు ఎందుకు దెబ్బతింటాయి?

అత్యధిక చక్కెర మోతాదులు నాడులను దెబ్బతీస్తాయి. అధిక రక్తపోటు, అధిక కొలెస్ట్రాల్, నాడుల ఇన్‌ఫ్లమేషన్.. వీటి వల్ల కూడా నాడులు దెబ్బతినవచ్చు. ఈ సమస్యలకు తోడు మందుల వాడకం క్రమం తప్పడం, సరిపడా మోతాదు మందులను వాడుకోకపోవడం, అస్తవ్యస్థ జీవనశైలి, దురలవాట్లు నర్వ్ డ్యామేజ్‌ను రెట్టింపు చేస్తాయి.

నియంత్రణ ఇలా...

మధుమేహులు క్రమం తప్పకుండా చక్కెరను పరీక్షించుకుంటూ, మందుల మోతాదుపరంగా వైద్యుల సూచనలను అనుసరిస్తూ ఉండాలి. ఆహార నియమాలను తప్పక అనుసరించాలి. వ్యాయామం చేయడంతో పాటు, పాదాలకు ఆర్థోపెడిక్ షూస్ లేదా చెప్పులు ధరించాలి. విటమిన్ బి12 సరిపడా అందేలా చూసుకోవాలి. పాదాల్లో ఏర్పడే గాయాలు, పుండ్ల మీద ప్రత్యేక శ్రద్ధ కనబరచాలి.

ఆహార నియమాలు!

మధుమేహులు అపరిమిత ఆహారం తీసుకోవడానికి వీలు లేదు. కాబట్టి ఈ కోవకు చెందిన వారు తక్కువ పరిమాణంలోనే అన్ని పోషకాలు అందే సంపూర్ణ, సమతులాహారం తీసుకోవాలి. ఇందుకోసం...

- రోజుకు మూడు పూటలూ, మూడు భారీ భోజనాలకు బదులుగా తక్కువ పరిమాణాల్లో ఎక్కువ సార్లు ఆహారం తీసుకోవాలి.
- తాజా పళ్లు, కూరగాయలు తీసుకోవాలి.
- తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ కలిగి ఉండే పదార్థాలు (కూరగాయలు, గోధుమలు, చిరుధాన్యాలు) తీసుకోవాలి.
- వేపుళ్లు వీలైనంత తగ్గించాలి.
- చక్కెర, శీతలపానీయాలు, తేనె, బెల్లం తీసుకోవడం తగ్గించాలి.
- ఆహారంలో మాంసకృత్తుల పరిమాణం పెంచాలి. పాలు, గుడ్లు, చేపలు, చికెన్ వాడకం పెంచాలి. మాంసాహారం పూర్తిగా ఉడకనివ్వాలి.

డాక్టర్ శ్రీ నగేష్
కన్సల్టెంట్ ఎండోక్రైనాలజిస్ట్ అండ్ డయాబెటాలజిస్ట్,
శ్రీ నగేష్ డయాబెటిస్ అండ్ ఎండోక్రైన్ క్లినిక్,
టోలిచౌకి, హైదరాబాద్.



కృత్రిమ రంగులు

మంచూరియా తింటున్నారా?

కృత్రిమ రంగులు ఆరోగ్యానికి హానికరం అనే విషయం మనందరికీ తెలిసిందే! కాబట్టే కృత్రిమ రంగు 'రోడమైన్ బి' వాడకాన్ని కర్నాటక ప్రభుత్వం నిషేధించింది. కాటన్ క్యాండీలు, గోబీ, చికెన్ మంచూరియాల్లో ఉపయోగించే ఈ హానికారక రంగు గురించిన మరిన్ని వివరాలివి.

రసాయనిక పదార్థం రోడమైన్ బి అనే సింథటిక్ రంగును సిల్క్, జూట్, లెదర్, కాటన్, ఊలు, చిల్లీ పౌడర్ (కారం), చిల్లీ ఆయిల్, సౌందర్యసాధనాలకు రంగును జోడించడం కోసం ఉపయోగిస్తారు. ప్లాస్టిక్ పరిశ్రమల్లో కూడా దీన్ని విస్తృతంగా ఉపయోగిస్తూ ఉంటారు. దీని ధర కూడా తక్కువ కాబట్టి పదార్థాలకు ఆకర్షణీయమైన రంగును తెప్పించడం కోసం కలరింగ్ ఏజెంట్‌గా దీన్ని ఉంటారు.

ఎంత హానికరం?

ఈ కృత్రిమ రంగుతో కళ్లు, చర్మ సమస్యలు, శ్వాసకోస సమస్యలు కలుగుతాయి. దీన్లో కేన్సర్ కారకాలు కూడా ఉన్నాయి. 2011 ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ (ఫుడ్ ప్రొడక్ట్స్ స్టాండర్డ్స్ అండ్ ఫుడ్ అడిటివ్స్) ప్రమాణాలను అందుకున్న కృత్రిమ రంగులనే ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ప్రకటించింది. అలా అనుమతి పొందిన కృత్రిమ రంగులు ఏవంటే...

ఎరుపు: పాంకో 4ఆర్ (కార్మొసీన్, ఎరిత్రోసిన్)
పసుపు: టార్ట్రాజీన్, సన్‌సెట్ ఎల్లో ఎఫ్‌సిఎఫ్
నీలం: ఇండిగో కార్మిన్, బ్రిలియంట్ బ్లూ ఎఫ్‌సిఎఫ్
ఆకుపచ్చ: ఫాస్ట్ గ్రీన్ ఎఫ్‌సిఎఫ్

కల్తీ ఇలా కనిపెట్టాలి

ప్రభుత్వ అనుమతి పొందిన సురక్షిత రంగులకు బదులుగా, నిషేధం విధించిన హానికారక రోడమీన్ బితో కల్తీ చేసిన పదార్థాలను కొన్ని చిట్కాల ద్వారా గుర్తుపట్టవచ్చు. అదెలాగంటే...



కారం: రెండు గ్రాముల కారాన్ని టెస్ట్‌ట్యూబ్‌లో వేసి, 5 మి.లీ ఎసిటోన్ (ఇది మెడికల్ షాపుల్లో కూడా దొరుకుతుంది. నెయిల్ పాలిష్ రిమూవర్ కూడా వాడుకోవచ్చు) కలపాలి. తర్వాత ఎసిటోన్ లేయర్ ఎరుపు రంగులోకి మారితే, కారంలో రోడమీన్ బి ఉందని అర్థం.

చిలకడదుంపలు: దూదిని నీళ్లలో లేదా వంట నూనెలో ముంచి, చిలకడదుంపల మీద రుద్దాలి. దూది ఎరుపు లేదా వంకాయ రంగులోకి మారితే దుంపలకు రోడమీన్ బి కలిపారని అర్థం.

కూల్ ఫుడ్స్

చల్లబడదాం!



వేసవి వేడి ప్రభావం ఆరోగ్యాన్ని దెబ్బ తీయకుండా ఉండాలంటే ఈ కాలంలో కొన్ని పదార్థాలను ఆహారంలో చేర్చుకుంటూ ఉండాలి. అవేంటంటే...

పుచ్చ: నీటి శాతం ఎక్కువగా ఉండే పుచ్చ పళ్లలో వేసవి వేడిమి నుంచి శరీరానికి రక్షణ కల్పించే సూక్ష్మ పోషకాలుంటాయి. కాబట్టి వేసవిలో ఈ పండు తరచూ తింటూ ఉండాలి.


నెయ్యి: నెయ్యి కీళ్లను ల్యూబ్రికేట్ చేసి, నొప్పులను అరికడుతుంది. వేసవిలో హైడ్రేషన్ మూలంగా శరీరంలో నీటి శాతం తగ్గకుండా ఉండడం కోసం, చర్మం పొడిబారిపోకుండా ఉండడం కోసం నెయ్యిని ఆహారంలో చేర్చుకోవాలి.

నిమ్మ: నిమ్మకాయల్లోని సి విటమిన్ శరీరం అలసటకు గురి కాకుండా నియంత్రించి శరీరాన్ని చల్లబరుస్తుంది. కాబట్టి వంటల్లో నిమ్మరసం ఎక్కువగా వాడుకోవాలి. తాగే నీళ్లలో కూడా నిమ్మరసం కలుపుకుంటూ ఉండాలి.

కొత్తిమీర: జీర్ణశక్తిని మెరుగుపరిచి శరీరాన్ని చల్లబరిచే శక్తి కొత్తిమీరకు ఉంటుంది. కాబట్టి వేసవిలో కొత్తిమీర ఎక్కువగా తీసుకుంటూ ఉండాలి.

కొబ్బరి: కొబ్బరి నీళ్లకూ, లేత కొబ్బరికీ శరీరాన్ని చల్లబరిచే గుణం ఉంటుంది. కాబట్టి వేసవిలో లేత కొబ్బరి తినాలి. కొబ్బరి నీళ్లు తాగుతూ ఉండాలి.

'దిక్సూచి' వెబ్ పేజీలో...
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/WMnyFMOలో చదవండి.


NBK'S HAT-TRICK DIRECT JUBILEE
FIRST TIME IN HISTORY
175 DAYS
NBK106
NBK107
NBK108
భగవంత్ కేసరి
I DON'T CARE
SILVER JUBILEE CELEBRATED IN 2022
SILVER JUBILEE CELEBRATED IN 2023
CELEBRATING SILVER JUBILEE IN 2024


HAPPY UGADI
APR 19TH 2024 WORLDWIDE
పారిజాత పర్వం



ఉగాది శుభాకాంక్షలు
గీతాంజలి మళ్ళీ వచ్చింది
APRIL 11 WORLDWIDE RELEASE


ఉగాది శుభాకాంక్షలతో...
ఏప్రిల్ 19 విడుదల
తెప్ప సముద్రం


ఉగాది శుభాకాంక్షలతో
ఏప్రిల్ 11న విడుదల
శ్రీరంగనీతులు


IGNORANCE OF THE LAW IS CRIME
COMING SOON
ఉగాది శుభాకాంక్షలు
హిట్ లిస్ట్


ఉగాది శుభాకాంక్షలు
VISHAL
రత్నం
HARI
DEVI SRI PRASAD
WORLDWIDE APRIL 26 RELEASE
PRODUCED BY KAARTHEKEYEN SANTHANAM - ZEE STUDIOS
SREE SIRI SAI CINEMAS


ADVENTUROUS BLOCKBUSTER
మలయాళంలో 200 కోట్లు సాధించిన
మంజుమ్మల్ బాయ్స్
ఉగాది శుభాకాంక్షలు



వకుళాభరణం రామకృష్ణ, మన్నం వెంకట రాయుడుకు పురస్కారాలను ప్రదానం చేస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య

మాతృభాష దూరమైతే శ్వాస ఆగినట్లే..

» మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు

» ఆవుల సాంబశివరావు స్మారక పురస్కారాల ప్రదానం

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): "మాతృభాష దూరమైతే మనకు శ్వాస ఆగిపోయినట్టే.. తెలుగు భాష, సంస్కృతులను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత." అని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ఉద్బోధించారు. పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, మండలి వెంకటకృష్ణారావు అంతర్జాతీయ తెలుగు కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం నాంపల్లిలోని ఎన్టీఆర్ సభామందిరం వేదికగా జస్టిస్ ఆవుల సాంబశివరావు స్మారక పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. 2023కు ప్రముఖ చరిత్ర పరిశోధకుడు ఆచార్య వకుళాభరణం రామకృష్ణకు, మనసు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మన్నం వెంకట రాయుడుకు-2024కు పురస్కారాలను ప్రదానం చేయడంతో పాటు వారిని శాలువా, జ్ఞాపికలతో వెంకయ్యనాయుడు సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... శాస్త్రీయ దృక్కోణంలో నుంచి చరిత్రను ఒడిసి పట్టి భావి తరాలకు అందించిన వకుళాభరణం రామకృష్ణ సేవలు విశేషమైనవని కొనియాడారు. తెలుగులో ముద్రితమైన అమూల్య గ్రంథాలన్నిటినీ డిజిటలైజ్ చేయడం ద్వారా మన్నం వెంకటరాయుడు... మన భాష, సాహిత్యాలకు అందిస్తున్న సేవ అసాధారణమైనదని ప్రశంసించారు. తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురించిన పుస్తకాలన్నిటిని డిజిటలైజ్ చేయడంతో పాటు ఉచితంగా వెబ్‌సైట్‌ను తయారుచేసి ఇవ్వడానికి తాము సిద్ధమని మనసు ఫౌండేషన్ మన్నం వెంకటరాయుడు తెలిపారు. తెలుగు వర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య తంగెడ కిషన్‌రావు, జస్టిస్ ఆవుల సాంబశివరావు కుమార్తె ఆవుల మంజులత, ఆచార్య రెడ్డి శ్యామల, వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

డీహెచ్, ఓఎస్‌డీ అవినీతిపై విచారణ జరపాలి

» లంబాడి హక్కుల పోరాట సమితి ఫిర్యాదు

హైదరాబాద్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకులు రవీంద్రనాయక్, ఆయన ఓఎస్‌డీ రవితేజ అవినీతిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర లంబాడి హక్కుల పోరాట సమితి(ఎల్‌హెచ్‌పీఎస్) డిమాండ్ చేసింది. నిబంధనలను తుంగలో తొక్కి డబ్బులు తీసుకొని అనుకూలంగా ఉన్న వారికి వర్క్ ఆర్డర్లు, డిప్యూటేషన్లు ఇస్తూ వారు అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) శాంతి కుమారితో పాటు అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) డైరెక్టర్ జనరల్, విజిలెన్స్ డైరెక్టర్ జనరల్, తెలంగాణ ఎన్నికల కమిషనర్‌కు వేర్వేరుగా ఫిర్యాదు చేసింది.

ట్యాపింగ్‌పై ప్రభుత్వం వెబ్‌సిరీస్ నడిపిస్తోంది

» కాంగ్రెస్ హయాంలో ట్యాపింగ్ జరగలేదా: క్రిశాంక్

హైదరాబాద్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై కాంగ్రెస్ ప్రభుత్వం వెబ్ సిరీస్ నడిపిస్తోందని బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ అన్నారు. కేసీఆర్‌పై ఆరోపణలు చేసిన రాహుల్‌గాంధీ.. కాంగ్రెస్ హయాంలో ఫోన్ ట్యాపింగ్ చేయలేదా? అన్నదానికి సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ఫోన్ ట్యాపింగ్ అవసరమని అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ చెప్పారని, ఆయనపై విచారణ చేయాలని రాహుల్ కోరతారా అని ప్రశ్నించారు. ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొంతమందిని కాపాడే ప్రయత్నం చేస్తోందని, అందుకే లీకులిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని క్రిశాంక్ ఆరోపించారు.

రాష్ట్ర భద్రతా కమిషన్‌ను ఏర్పాటు చేయండి

» అదే ఉంటే ట్యాపింగ్ వ్యవహారం ఉండేది కాదు:ఎఫ్‌జీజీ

పోలీసుశాఖపై రాజకీయ నాయకుల ఒత్తిడిని తగ్గించేందుకు, చట్ట విరుద్ధంగా పని చేయకుండా ఉండేందుకు రాష్ట్ర భద్రతా కమిషన్‌ను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ (ఎఫ్‌జీజీ) సీఎంను కోరింది. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి ఎఫ్‌జీజీ అధ్యక్షుడు ఎం.పద్మనాభరెడ్డి లేఖ రాశారు. భద్రతా కమిషన్‌కు సంబంధించి హైకోర్టులో కేసు ఉండడంతో 2021లో అప్పటి ప్రభుత్వం ఆదరబాదరాగా కమిషన్‌ను ఏర్పాటు చేసిందని తెలిపారు. కానీ అది కాగితాలకే పరిమితమైందని, ఎక్కడా పని చేయడం లేదని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో భద్రతా కమిషన్ పని చేస్తున్నట్లయితే ప్రస్తుతం దుమారం రేపుతున్న ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం ఉండేది కాదని తెలిపారు.

రాష్ట్రంలో భగభగలకు కాస్త బ్రేక్..!

» 41 డిగ్రీలకు పడిపోయిన ఉష్ణోగత్రలు

» నేడు, రేపు మరింత తగ్గనున్న ఎండలు

హైదరాబాద్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): భానుడి భగభగలకు కాస్త బ్రేక్ పడింది.. గతం వారం రోజులుగా సాధారణం కంటే 4 డిగ్రీల వరకు అధికంగా నమోదైన ఎండలు సోమవారం తగ్గాయి. గద్వాల జిల్లా వడ్డేపల్లిలో అత్యధికంగా 41.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవగా, వనపర్తి, మహబూబ్‌నగర్ జిల్లా జానంపేట, గద్వాలలో 41.4 డిగ్రీలుగా రికార్డయింది. రాష్ట్రంలో నాలుగైదు రోజులుగా 44.5 డిగ్రీలకు పగటి ఉష్ణోగ్రతలు చేరుకున్న సంగతి తెలిసిందే. ఇక మంగళ, బుధవారాల్లో ఉష్ణోగ్రతలు మరింత తగ్గనున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 35-38 డిగ్రీల మధ్య నమోదయ్యే అవకాశముందని వెల్లడించింది. ఖమ్మం జిల్లాలోని కొన్ని ప్రాంతాలతో పాటు భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, నల్లగొండ, గద్వాల, జనగామ, యాదాద్రి భువనగిరి, సిద్దిపేట, మంచిర్యాలలోని కొన్ని ప్రాంతాల్లో వడగాలులు వీస్తాయని పేర్కొంది. అలాగే ఈ రెండ్రోజులు అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది.

ఏపీ నుంచి కొల్లి రఘురామిరెడ్డి 'ఔట్'

» పోలీసు పరిశీలకుడిగా అసోంలో విధులు

» ఏపీ సీఎం జగన్‌కు ఎన్నికల కమిషన్ మరో షాక్

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఏపీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి ఎన్నికల కమిషన్ మరో గట్టి 'షాక్' ఇచ్చింది. వైసీపీకి కళ్లూ చెవులుగా వ్యవహరిస్తూ, అపరిమిత అధికారాలతో విపక్షాలను లక్ష్యంగా చేసుకున్న ఐపీఎస్ అధికారి కొల్లి రఘురామిరెడ్డిని స్టేట్ నుంచి బయటికి పంపింది. ఆయనను అసోంలో ఎన్నికల పోలీసు అబ్జర్వర్‌గా నియమించింది. ఇప్పటికే ఆరుగురు 'అస్మదీయ' ఐపీఎస్‌లు, ముగ్గురు ఐఏఎస్‌లను ఈసీ పక్కనపెట్టిన సంగతి తెలిసిందే. తాజాగా కొల్లిని రాష్ట్రం నుంచి దూరంగా... ఏకంగా ఈశాన్య రాష్ట్రానికి పంపించేయడం గమనార్హం. సోమవారం సాయంత్రం ఈ ఆదేశాలు వెలువడ్డాయి. ఇప్పటికే రాష్ట్రానికి చెందిన పలువురు అధికారులను ఇతర రాష్ట్రాలకు పరిశీలకులుగా పంపించారు. కొల్లి రఘురామిరెడ్డిని అసోంలోని పది అసెంబ్లీ నియోజకవర్గాలకు పోలీసు పరిశీలకుడిగా నియమించారు. ఆయన... గువాహటి కేంద్రంగా ఉండి విధులు నిర్వహిస్తారు. జగన్ అధికారంలోకి రాగానే కొల్లి రఘురామిరెడ్డిని తన 'అంతరంగిక' అధికారుల్లో ఒకరిగా నియమించుకున్నారు. రాజధాని భూములపై వేసిన 'సిట్'కు ఆయనే అధిపతి. 'స్కిల్' కేసులో చంద్రబాబును అరెస్టు చేసిన అధికారి ఈయనే. ఎన్నికల వేళ కొల్లి ద్వారా అటు తమ మాట వినని అధికారులు, ఇటు విపక్షాలను మరింతగా వేధించేందుకు జగన్ భారీ ప్రణాళిక రచించారనే ఆరోపణలున్నాయి. సరిగ్గా ఇదే సమయంలో జగన్‌కు ఈసీ గట్టి దెబ్బ కొట్టింది. కొల్లిని స్టేటు దాటించేసింది!


మేడిగడ్డ మరింత కుంగింది!

(మొదటిపేజీ తరువాయి)

పగుళ్లు మరింత పెరుగుతున్నాయి. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నిపుణుల బృందం పర్యటించి దెబ్బతిన్న భాగాన్ని అధ్యయనం చేసి వెళ్లిన కొద్ది రోజులకే ఈ మూడు పియర్ల వద్ద ఏప్రన్ మరింత కుంగినట్లు తెలుస్తోంది. దెబ్బతిన్న పియర్లను పరిశీలించేందుకు సోమవారం మేడిగడ్డను సందర్శించిన సీపీఎం బృందంతోపాటు వెళ్లిన మీడియా ప్రతినిధులకు పియర్లు మరింత కుంగిపోయిన దృశ్యం స్పష్టంగా కనిపించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ బృందం, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలోని ఎమ్మెల్యేల బృందం పర్యటించిన సందర్భాల్లో పియర్లు, ఏప్రన్ల వద్ద అడుగున్నర మాత్రమే కుంగిపోయి ఉంది. మార్చి 7 నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ నిపుణుల పరిశీలన సమయంలోనూ దాదాపుగా అదే తీరుగా కనిపించింది. నెల రోజుల తర్వాత సోమవారం పరిశీలించినపుడు ఎక్కువగా కుంగినట్లు స్పష్టంగా తెలుస్తోంది. తాజాగా ఏప్రన్లతో పాటు బ్యారేజీ బే ఏరియాలోను పగుళ్లు ఏర్పడుతూ ఉండడం గమనించాల్సిన విషయం. దెబ్బతిన్న ఏప్రన్ మరమ్మతులో భాగంగా మొత్తంగా ఏడో బ్లాక్‌ను తొలగించి పునర్నిర్మిస్తే తప్ప బ్యారేజీ నిలబడదని ఇంజనీర్లు చెబుతున్నారు. అయితే, మరమ్మతుల కోసం నిపుణుల బృందం సూచించిన మేరకు నిర్మాణ సంస్థ బ్యారేజీకి ఎగువ భాగంలో నీటికి అడ్డుగా వేసిన మట్టి కట్ట నుంచి కూడా నీటి ఊటలు ఎక్కువగా వస్తున్నాయి. ఇలా నీరు లీకేజీ జరిగితే దెబ్బతిన్న ఆప్రాన్‌కు మరింత నష్టం చేకూరే అవకాశం ఉందని చెబుతున్నారు.

భూ అంతర్గత పొరల బలహీనత వల్లేనా?

మేడిగడ్డ బ్యారేజీ పియర్లు దెబ్బ తినడానికి ఏడో బ్లాక్ ప్రాంతంలో ఉన్న భూమి అంతర్గత పొరలు బలహీనంగా ఉండటమే కారణం కావచ్చని రిటైర్డ్ ఇంజనీర్లు అంచనా వేస్తున్నారు. బ్యారేజీలో భారీ పరిమాణంలో ఇసుక మేటలు వేసి ఉండటం, దాదాపు 250 మీటర్ల లోతు వరకు భూమి పొరలు బలహీనంగా ఉండటం వల్ల కూడా ఏప్రన్లపై ఒత్తిడి పడుతోందని అంటున్నారు. దీనివల్ల భూ అంతర్గత పొరల్లో సర్దుబాట్లు జరిగి పిల్లర్లు క్రమంగా కుంగిపోతున్నాయని చెబుతున్నారు. క్రస్ట్ స్పిల్‌వే వరకు దాని ప్రభావం పడి ప్రాజెక్టు దెబ్బ తింటోందని వివరిస్తున్నారు. ఈ కారణంగానే క్రస్ట్ స్పిల్‌వేలో పగుళ్లు ఏర్పడి అవి పెరుగుతూ పోతున్నట్లు అభిప్రాయపడుతున్నారు. నిర్మాణ సమయంలో డ్రిల్లింగ్ సందర్భంగా భూ అంతర్గత పొరల్లో ఉన్న బలహీనతలు స్పష్టంగా తెలిసిపోతాయని, బహిర్గత ఒత్తిళ్లో లేదా నిర్మాణ సంస్థ, ఇంజనీర్ల నిర్లక్ష్యం వల్లనో వాటిని పట్టించుకోకుండా ముందుకు సాగడం వల్ల ఇప్పటి



కుంగిపోయి కనిపిస్తున్న బ్యారేజీ ఏప్రన్

పరిస్థితి ఏర్పడిందని వ్యాఖ్యానించారు. ఏప్రన్ల నిర్మాణం కోసం తవ్విన గుంతల్లో బొగ్గు బయటపడినట్లు ప్రచారం సాగుతోంది. విషయం బయటకు వస్తే నిర్మాణం ఆగిపోతుందని మూడో కంటికి తెలియకుండా మహారాష్ట్ర వైపు తరలించారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. అదే నిజమైతే, ఏడో భాగం నుంచి మహారాష్ట్ర వైపు పియర్లన్నీ ప్రమాదంలో ఉన్నట్టే భావించాల్సి ఉంటుందని చెబుతున్నారు.

బీఆర్ఎస్‌కు డిపాజిట్లు కూడా రావు

కాంగ్రెస్‌ది హిందూ వ్యతిరేక మ్యానిఫెస్టో.. ఫిరాయింపులపై రాహుల్ మాట్లాడటం హాస్యాస్పదం: కిషన్‌రెడ్డి

» డీ ఫ్యాక్టో సీఎంలా శ్రీధర్‌బాబు: ఏలేటి

మొయినాబాద్ రూరల్/కేశంపేట/హైదరాబాద్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): తెలంగాణతో పాటు ఢిల్లీలోనూ అవినీతికి పాల్పడిన బీఆర్ఎస్‌కు ఎంపీ ఎన్నికల్లో డిపాజిట్లు కూడా రావని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. న్యాయ్‌పత్ర పేరుతో కాంగ్రెస్ విడుదల చేసిన మ్యానిఫెస్టో హిందువులకు వ్యతిరేకమని విమర్శించారు. ఇటీవల తుక్కుగూడ సభలో పార్టీ ఫిరాయింపుదారులను పక్కన పెట్టుకొని ఫిరాయింపుల నిరోధక చట్టంపై రాహుల్‌గాంధీ మాట్లాడటం ఆశ్చర్యంగా ఉందన్నారు. సోమవారం రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం హిమాయత్‌నగర్‌లోని జేపీఎల్ కన్వెన్షన్ హాలులో నిర్వహించిన చేవెళ్ల నియోజకవర్గ బూత్ కమిటీల అధ్యక్షుల సమ్మేళనంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో దేశంలో జరిగిన కుంభకోణాలను ప్రజలు మరచిపోలేదన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఒక్క హామీనీ కాంగ్రెస్ అమలు చేయలేదన్నారు. రైతులకు రూ.2 లక్షల రుణ మాఫీ, రూ.15వేల రైతు భరోసా, వరికి రూ.500 బోనస్ ఏమయ్యాయని ప్రశ్నించారు. తెలంగాణలో అత్యధిక ఎంపీ సీట్లు గెలిపిస్తే 2028లో రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటయ్యేలా చూసే బాధ్యత తనదని మోదీ తనతో అన్నారని కిషన్‌రెడ్డి తెలిపారు. త్వరలో వికారాబాద్ జిల్లాలో నిర్వహించే సభకు మోదీ లేదా అమిత్‌షాను తీసుకువస్తామని చెప్పారు. రాష్ట్రంలో రైల్వే లైన్లను అభివృద్ధి చేశామని తెలిపారు. రూ.100 కోట్లతో అనంతగిరిని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని అన్నారు. పోలీసు శాఖలోనూ లవ్ జిహాదీలున్నారని కిషన్‌రెడ్డి ఆరోపించారు. అబద్ధపు ప్రచారాలు, అసాధారణ హామీలతో కాంగ్రెస్ ప్రజలను మోసం చేస్తోందని చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు అభ్యర్థులే కరువయ్యారని.. పోటీకి తనను చాలాసార్లు సంప్రదించారని చెప్పారు.



హిమాయత్‌నగర్‌లో బీజేపీ బూత్ అధ్యక్షుల సమ్మేళనంలో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

గుడ్డిలో మెల్లలా గెలుపు: డీకే అరుణ

దేశంలో కాంగ్రెస్ పని అయిపోయిందని, గుడ్డిలో మెల్లలా తెలంగాణలో ఆ పార్టీ అధికారంలోకి వచ్చిందని మహబూబ్‌నగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ మీద ప్రేమతో ప్రజలు ఓట్లు వేయలేదని, కేసీఆర్ మీద వ్యతిరేకతతో వేశారని అన్నారు. రంగారెడ్డి జిల్లా కేశంపేటలోని శారదా గార్డెన్‌లో సోమవారం నిర్వహించిన బీజేపీ కార్యకర్తల సమావేశంలో అరుణ మాట్లాడారు. కాంగ్రెస్ హామీలను తుంగలో తొక్కిందని విమర్శించారు. కేసీఆర్ కుటుంబం ప్రాజెక్టుల పేరుతో రూ.లక్షల కోట్లు దోచుకుందని ఆరోపించారు.

కాంగ్రెస్ డిక్లరేషన్లు అమలు కావు: ఏలేటి

అమలుకు సాధ్యం కాని రైతు డిక్లరేషన్‌ను రాహుల్ చేత, నిరుద్యోగ భృతిని ప్రియాంక చేత ప్రకటింపజేసిన రేవంత్.. వీటిపై భవిష్యత్తులో ఎవరూ తనను ప్రశ్నించకుండా జాగ్రత్తపడ్డారని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. ఆయన కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చే రోజు ఈ డిక్లరేషన్లతో తనకు సంబంధం లేదని చెబుతారని మహేశ్వర్‌రెడ్డి జోస్యం చెప్పారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మహేశ్వర్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. రైతు రుణ మాఫీని ఎగ్గొట్టేందుకు కాంగ్రెస్ యోచిస్తోందని ఆరోపించారు. ఎన్నికల కోడ్‌తో నిలిచిపోయిన రూ.7వేల కోట్ల రైతుబంధు నిధులను దేని కోసం వినియోగించారని నిలదీశారు. మంత్రి శ్రీధర్‌బాబు డీఫ్యాక్టో సీఎంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఎస్సారెస్పీలో 8టీఎంసీల నీటిని ఒక ప్రాంతానికి తరలించుకుపోయారని ఆరోపించారు. దీంతో తమ ప్రాంత రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. మహిళలకు మెట్రో, ఎంఎంటీఎస్‌లో ఉచిత ప్రయాణం కల్పించాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ డిమాండ్‌చేశారు. ఇతర రాష్ట్రాల మహిళలు హైదరాబాద్‌లో నివసిస్తున్నారని.. బస్సుల్లో ఉచిత ప్రయాణానికి ఆధార్‌ను ప్రామాణికంగా తీసుకోవడం వల్ల వారు నష్టపోతున్నారని తెలిపారు.

మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిపై 'కోడ్' ఉల్లంఘన కేసు

» రంగధాంపల్లిలో ప్రభుత్వ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారని ఆరోపణ

» ఈసీ, ఈడీకి రఘునందన్ ఫిర్యాదు

సిద్దిపేట అర్బన్/హైదరాబాద్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మెదక్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామి రెడ్డి, సుడా మాజీ చైర్మన్ రవీందర్‌రెడ్డిపై సిద్దిపేట త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సిద్దిపేట అర్బన్ మండలం రంగధాంపల్లి సమీపంలో ఉన్న రెడ్డి సంక్షేమ భవన్‌లో ఆదివారం రాత్రి ప్రభుత్వ ఉద్యోగులతో వెంకట్రామిరెడ్డి సమావేశమయ్యారని బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావు సోమవారం సీఈవో వికాస్‌రాజ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎన్నికల అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమావేశానికి సంబంధించిన సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నామని, అక్కడికి ఉద్యోగులు ఎందుకు వచ్చారు? సమావేశం ఎందుకు జరిగింది? అన్న విషయాలపై ఆరా తీస్తున్నామని పోలీసులు తెలిపారు. ఫిర్యాదు అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. వెంకట్రామిరెడ్డి రంగధాంపల్లిలో పలువురు ఉద్యోగులతో సమావేశమయ్యారన్నారు. సెర్ప్, ఐకేపీ ఉద్యోగుల వివరాలను ఆ శాఖ కమిషనర్ అనితా రామచంద్రన్‌కు అందజేసి.. వారిపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు రఘునందన్ వెల్లడించారు. కాగా, వెంకట్రామిరెడ్డితో పాటు కేసీఆర్, కేటీఆర్‌లపై మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద కేసు నమోదు చేయాలని రఘునందన్ ఈడీకి ఫిర్యాదు చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్టయిన మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా కేసు పెట్టాలని కోరారు.

106 మంది ఉద్యోగుల సస్పెన్షన్..?

రంగధాంపల్లిలో సమావేశానికి హాజరైన 106 మంది ఐకేపీ, ఈజీఎస్ ఉద్యోగులను సస్పెండ్ చేయడానికి కలెక్టర్ నివేదిక సిద్ధం చేసినట్లు తెలిసింది. కాంగ్రెస్, బీజేపీ నాయకుల సమాచారంతో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు రెడ్డి సంక్షేమ భవన్‌కు వెళ్లి సీసీ ఫుటేజీని పరిశీలించారు. ప్రతి ఉద్యోగినీ గుర్తించి, వారి జాబితాను కలెక్టర్‌కు అందించారు. కలెక్టర్ ఆ జాబితాను ఈసీకి పంపించినట్లు సమాచారం.



చిత్రం చూసి.. చిత్తరువైన సీఎం!

» ఎక్స్‌లెంట్.. కీప్ ఇట్ అప్ అంటూ.. ఆర్టిస్ట్ వెంకటేష్‌ను అభినందించిన రేవంత్

హైదరాబాద్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పేపర్‌పై పెన్సిల్‌తో వేసిన తన చిత్రాన్ని చూసి.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్తరువయ్యారు. చాలా బాగుందంటూ ఉప్పొంగిపోయారు. చిత్రాన్ని వేసిన కళాకారుడు వెంకటేష్ కందునూరిని ఎక్స్‌లెంట్, కీప్ ఇట్ అప్ అంటూ ఆయన అభినందించారు. మహబూబాబాద్ జిల్లా కొమ్ములవంచ గ్రామానికి చెందిన ఆర్టిస్ట్ వెంకటేష్ కందునూరి పేపర్‌పై పెన్సిల్‌తో వేసిన సీఎం రేవంత్‌రెడ్డి బొమ్మను ఆయనకు బహూకరించాడు. కాగా ఈ చిత్రాన్ని గీసేందుకు 15 రోజుల సమయం పట్టిందని వెంకటేష్ తెలిపారు.

సిట్ ఆవరణలో కీలక పత్రాల దహనం

» ఎన్నికల ముందు ఏపీ సీఐడీ ఘనకార్యం

» అవి హెరిటేజ్ డాక్యుమెంట్ ప్రతులు

» కేసు తప్పుదారి పట్టించేందుకే: టీడీపీ

» ప్రింట్ సరిగాలేక కాల్చేశామన్న సీఐడీ

అమరావతి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఓ కీలక కేసుకు సంబంధించిన పత్రాలను ప్రత్యేక దర్యాప్తు సంస్థ(సిట్)...తగుల బెట్టేసింది. తాడేపల్లిలోని తమ కార్యాలయ ప్రాంగణంలో పలు డాక్యుమెంట్లను సిబ్బంది దహనం చేశారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు కుటుంబానికి చెందిన హెరిటేజ్ సంస్థ డాక్యుమెంట్లు కావడంతో కలకలం రేగింది. సంచిలో బండిల్స్‌గా తీసుకొచ్చిన సిట్ సిబ్బంది మంటపెడుతున్న డాక్యుమెంట్లను స్థానికులు గమనించారు. ఏంటని అక్కడికెళ్లి చూడగా వాటిపై సీఐడీ అధికారిక ముద్ర, హెరిటేజ్ లోగో, చంద్రబాబుపై నమోదైన కేసుకు సంబంధించిన వివరాలు కనిపించడంతో వీడియో తీశారు. ఆ వీడియోలు వైరల్ కావడంతో రాష్ట్రవ్యాప్తంగా సంచలనమైంది. రాజధాని అమరావతిని నిర్వీర్యం చేసే క్రమంలో అక్కడ అవినీతి జరిగిందంటూ జగన్ ప్రభుత్వం చంద్రబాబును టార్గెట్ చేసిన విషయం తెలిసిందే. అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణంలో అవినీతి జరిగిందంటూ మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డితో 2022 ఏప్రిల్ 27న సీఐడీకి చంద్రబాబుపై ఫిర్యాదు చేయించారు. ఒక ప్రణాళిక ప్రకారం జరిగిన ఈ వ్యవహారంలో కేసు నమోదు చేసి టీడీపీ అధినేతను ఎలాగైనా జైలుకు పంపాలన్న లక్ష్యంతో ఆ బాధ్యతను సీఐడీకి జగన్ అప్పగించారు. తాను చెప్పినట్లు చేసే అనుంగు అధికారి కొల్లి రఘురామి రెడ్డి నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) ఏర్పాటు చేశారు. అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు మలుపులు తిరగడంలో హెరిటేజ్ సంస్థకు లబ్ధి చేకూరిందని అభియోగం మోపారు. అసలు ఆ రోడ్డే వేయలేదని, అందుకోసం నిధులు ఖర్చు చేయలేదని బాధితులు వివరణ ఇచ్చినా ససేమిరా అంటూ, జగన్ కళ్లల్లో ఆనందం కోసం కొల్లి రఘురామి రెడ్డి మొండిగా ముందుకెళ్లారు. కేసు దర్యాప్తులో భాగంగా చంద్రబాబు కుటుంబసభ్యులకు సంబంధించిన ఆదాయపు పన్ను డాక్యుమెంట్లతోపాటు కుటుంబ వ్యాపారాలకు సంబంధించిన డాక్యుమెంట్లు సిట్ స్వాధీనం చేసుకుంది. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను విచారణకు పిలిచి సిట్ అధికారులు ప్రశ్నించారు. ఈ సమయంలోనే డాక్యుమెంట్ల విషయం వెలుగులోకి వచ్చింది. రాజకీయాలతో సంబంధంలేని తన తల్లి భువనేశ్వరి, భార్య బ్రహ్మణికి సంబంధించిన ఆదాయ పన్ను వివరాలు ఇతరత్రా డాక్యుమెంట్లు ఎలా సేకరిస్తారంటూ సిట్ అధికారులను ఆయన అడిగినా స్పందన లేదు. అవే డాక్యుమెంట్లను తాడేపల్లి పాతూరు రోడ్డులోని సంవృద్ధి నెక్సా అపార్ట్‌మెంట్ ప్రాంగణంలో ఉన్న సిట్ కార్యాలయం వెనుక భాగంలో సోమవారం ఉదయం పదిగంటల ప్రాంతంలో సిబ్బంది తగలబెట్టారు. దానిని గుర్తించిన స్థానికులు...సిబ్బందిని ప్రశ్నించడంతో తమ బాస్(కొల్లి రఘురామి రెడ్డి)ఆదేశాల మేరకు దహనం చేస్తున్నట్లు చెప్పారు. ఆ డాక్యుమెంట్లపై హెరిటేజ్ లోగో, చంద్రబాబు పేరు ఉండటంతో సెల్‌ఫోన్లో ఆ తతంగాన్ని చిత్రీకరించి టీడీపీ కార్యదర్శి నాదెండ్ల బ్రహ్మం చౌదరికి పంపారు. సమీపంలోనే ఉన్న ఆయన వెంటనే అక్కడికి వచ్చి సీఐడీ తీరును తీవ్రంగా ఖండించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా ఎలాంటి అనుమతి తీసుకోకుండా హై ప్రొఫైల్ కేసుకు సంబంధించిన డాక్యుమెంట్లు తగలబెట్టడం వివాదాస్పదం అయింది. ఎన్నికల తర్వాత రాష్ట్రంలో ప్రభుత్వం మారుతుందన్న సంకేతాలతో కేసును తప్పుదారి పట్టించేందుకు డాక్యుమెంట్లు కాల్చేస్తున్నారని టీడీపీ ఆరోపించింది. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన వెంటనే జైలుకు వెళ్లడం ఖాయమనే భయంతోనే కొందరు అధికారులు ఇలాంటి వాటికి పాల్పడుతున్నారని వ్యాఖ్యానించింది.

అవును... తగలబెట్టాం: రఘురామి రెడ్డి

మంటల వీడియోలు, టీడీపీ ఆరోపణలతో ఉలిక్కిపడ్డ కొల్లి రఘురామి రెడ్డి, 'అవును...మేమే తగలబెట్టా'మని ధ్రువీకరిస్తూ ప్రకటన విడుదల చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా సరైన సాక్ష్యాధారాల కోసం లక్షలాది ఫొటోస్టాట్ కాపీలు తీస్తుంటామని తెలిపారు. తాజాగా తగలబెట్టినవన్నీ జిరాక్స్ సరిగా రాని పేపర్లని, అసలు డాక్యుమెంట్లు కోర్టుకు సమర్పించామని వివరణ ఇచ్చారు.

విద్యార్థినులతో ప్రధానోపాధ్యాయుడి అసభ్య ప్రవర్తన

» పోలీసులకు ఫిర్యాదు.. పోక్సో కేసు నమోదు

» యాదాద్రిభువనగిరి జిల్లా గుండాలలో ఘటన

గుండాల, ఏప్రిల్ 8: మనవరాలి వయసున్న ముగ్గురు విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించిన ఓ ప్రధానోపాధ్యాయుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. యాదాద్రిభువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో అండెం మాధవరెడ్డి ఏడేళ్లుగా ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. ఐదో తరగతి చదువుతున్న ఒక విద్యార్థిని, మూడో తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థినులను హెచ్ఎం మాధవరెడ్డి తన కార్యాలయానికి పిలిపించుకుని, అసభ్యకరంగా ప్రవర్తించేవాడని, ఈ విషయం ఎవరికీ చెప్పవద్దని కొట్టి బెదిరించేవాడని బాధిత విద్యార్థినులు తెలిపారు. సోమవారం పాఠశాల వదిలిపెట్టే సమయం కాకముందే పిల్లలు ఇంటికి రావడంతో తల్లిదండ్రులు వారిని ప్రశ్నించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తమతో ఆరు నెలలుగా అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని విద్యార్థినులు తెలిపారు. ఈ మేరకు వారు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ప్రధానోపాధ్యాయుడిపై ఫిర్యాదు చేశారు. హెచ్ఎం మాధవరెడ్డిని అదుపులోకి తీసుకుని పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ యాకన్న తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులకు కుటుంబం బలి

» మూడేళ్ల కుమారుడికి విషమిచ్చి చంపి ఆత్మహత్యకు పాల్పడిన దంపతులు

» రాజేంద్రనగర్ సన్‌సిటీలో విషాదం

రాజేంద్రనగర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు.. ఆ కారణంగా తలెత్తిన గొడవలు ఓ కుటుంబాన్ని బలిగొన్నాయి. ముద్దులొలికే మూడేళ్ల బాబుకు విషమిచ్చి చంపి.. భార్యాభర్తలు ఆత్మహత్యకు పాల్పడ్డారు. హైదరాబాద్ రాజేంద్రనగర్ పరిధిలోని సన్‌సిటీలో సోమవారం ఈ ఘటన జరిగింది. ఇంటి యజమాని... ఊర్లో ఉంటున్న సోదరుడి వరుసయ్యే వ్యక్తికి ఫోన్ చేసి తాము ఆత్మచేసుకుంటున్నామని చెప్పడంతో అతనొచ్చి చూసేసరికి ముగ్గురూ విగతజీవులుగా పడివున్నారు. నల్లగొండ జిల్లాకు చెందిన ఆనంద్(38)కు చేవెళ్ల మల్కాపురం గ్రామానికి చెందిన ఇందిర(38)తో నాలుగేళ్ల క్రితం పెళ్లయింది. వీరికి కుమారుడు శ్రేయాన్స్(3) ఉన్నాడు. బతుకుదెరువు కోసం నగరానికొచ్చి బండ్లగూడ సన్‌సిటీలోని యమునా రెసిడెన్సీలో నివాసం ఉంటున్నారు. ఆనంద్ పాల వ్యాపారం చేస్తుండగా, ఇందిర ఓ సంస్థలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తోంది. వీరికి ఆర్థిక సమస్యలు చుట్టుముట్టినట్లు తెలుస్తోంది. దీంతో భార్యభర్తల మధ్య గొడవలు జరుగుతుండటాన్ని ఇందిర బావ, చేవెళ్ల మల్కాపురంలో ఉంటున్న నగేశ్ గుర్తించాడు. ఈ విషయమై వారం క్రితం ఆయన సన్‌సిటీకొచ్చి ఆనంద్‌కు, ఇందిరకు సర్దిచెప్పాడు. ఇందిరకు తల్లిదండ్రులు లేరని, తాను అప్పుడప్పుడూ వచ్చి దంపతుల బాగోగులు చూసేవాడినని నగేశ్ చెప్పాడు. ఆర్థిక ఇబ్బందులు పెరగడం ఇందిర బంగారం అంతా అమ్మేయడంతో దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయని చెప్పాడు. వారం క్రితమే వచ్చి ఉగాదికి ఊరికి రండి అని చెపినట్లు, సోమవారం వచ్చి తానే తీసుకెళ్తానని చెప్పినట్లు వెల్లడించాడు. సోమవారం సాయంత్రం ఆనంద్ తనకు ఫోన్ చేసి ఆత్మహత్య చేసుకుంటున్నామని చెప్పాడని, ఆ తర్వాత ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్విచాఫ్ వచ్చిందని చెప్పాడు. తాను సన్‌సిటీకి వచ్చి చూసేసరికి ఘోరం జరిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశాడు. 15 రోజుల నుంచి ఆనంద్, ఇందిర గొడవ పడుతున్నారని, పలుమార్లు వారి బంధువులొచ్చి నచ్చచెప్పి వెళ్లారని వాచ్‌మన్ వెంకటయ్య చెప్పాడు. కాగా ఆనంద్ ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌లకు పాల్పడి అప్పుల పాలైనట్లు భావిస్తున్నారు. అయితే ఇంట్లో ఇందిర మృతదేహం ఓ గదిలో.. ఆనంద్, శ్రేయాన్స్ మృతదేహాలు మరో గదిలో కనిపించాయి. ఆనంద్, శ్రేయాన్స్ నోట్లోంచి నురుగులు వచ్చాయి. శ్రేయాన్స్‌కు విషమిచ్చి.. ఆ తర్వాత ఆనంద్ విషం తాగి చనిపోయినట్లు భావిస్తున్నారు. ఇందిర ఎలా ఆత్మహత్య చేసుకుందనేది తెలియాల్సి ఉంది. అప్పుల బాధతోనే ఆత్మహత్య చేసుకొని ఉంటారని భావిస్తున్నట్లు రాజేంద్రనగర్ ఏసీపీ టి.శ్రీనివాస్ పేర్కొన్నారు.

కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడే వర్షాభావం

» అందుకు శీతాకాలంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ది బాధ్యతెలా? :శ్రీధర్‌బాబు

గోదావరిఖని, ఏప్రిల్ 8: గడిచిన వర్షాకాలమంతా కేసీఆరే ముఖ్యమంత్రిగా ఉన్నారని, ఆ సమయంలోనే వర్షాభావ పరిస్థితులు ఏర్పడి వానలు పడకపోతే శీతాకాలంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను బాధ్యులను చేస్తారా అని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రశ్నించారు. సోమవారం నిర్వహించిన రామగుండం నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాలు పడకపోవడం ప్రకృతి వైపరీత్యమని, దానిని ఒక పార్టీకి అంటగట్టి కేసీఆర్ ప్రజలను వంచించాలని చూస్తున్నారని ఆరోపించారు. గడిచిన అక్టోబరు మాసంలో వర్షాలు పడలేదని, బొట్టు బొట్టు కాపాడుకోవాలని బీఆర్ఎస్ అధికార పత్రికలో రాశారని, వారు ఇపుడు అధికారం కోల్పోయినందువల్ల తమపై నిందలు మోపుతున్నారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రైతాంగానికి మేలు చేసేందుకు ఉన్న నీళ్లను సద్వినియోగం చేసి పంట పొలాలు ఎండిపోకుండా చూసేందుకు మంత్రులు, ఎమ్మెల్యేలంతా రాత్రిపగలూ శతవిధాలుగా శ్రమిస్తున్నారని చెప్పారు. రైతులను వంచించేందుకు బీఆర్ఎస్ దొంగ దీక్షలు చేస్తోందని, గతంలో బస్తాకు ఐదు కిలోలు, క్వింటాల్‌కు 10 నుంచి 12కిలోలు తరుగు విధించి దోచుకున్నారని ఆరోపించారు.

మళ్లీ భయపెట్టిన బోయింగ్ విమానం

- టేకాఫ్ వేళ.. ఊడి, ఎగిరిపోయిన ఇంజన్ కవర్
- అప్రమత్తమై సురక్షితంగా కిందికి దించిన పైలట్

న్యూయార్క్, ఏప్రిల్ 8: తరచుగా.. వరుసగా.. ఏదో ఒక ప్రమాదంతో వార్తల్లోకెక్కుతున్న బోయింగ్ ఖాతాలో మరో ప్రమాదం! అయితే అదృష్ట వశాత్తూ ఈ ప్రమాదంలో ఎవరికీ ఏమీ కాలేదు. 135 మంది ప్రయాణికులతో అమెరికాలోని డెన్వర్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు నుంచి బయల్దేరిన బోయింగ్ (737-800 రకం) విమానం టేకాఫ్ అవుతున్నప్పుడే.. దాని ఇంజన్ పైభాగంలో ఉండే కవర్ పెనుగాలికి చిగురుటాకులా అల్లల్లాడి ఊడిపోయింది. ఈలోగా విమానం గాల్లో 10,300 అడుగుల ఎత్తుకు వెళ్లిపోయింది! ఇంజన్ కవర్ ఊడిపోయేటప్పుడు వచ్చిన శబ్దాలతో ప్రయాణికులంతా భయంతో వణికిపోయారు. పెద్దగా కేకలు పెడుతూ ఫ్లైట్ అటెండెంట్స్‌ను అప్రమత్తం చేశారు. దీంతో పైలట్ ఎమర్జెన్సీ ప్రకటించి.. వెంటనే విమానాన్ని వెనక్కి తిప్పి డెన్వర్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో సురక్షితంగా ల్యాండింగ్ చేశాడు. ప్రయాణికులంతా క్షేమంగా బయటపడ్డారు. విమానం ఇంజన్ కవర్ అలా గాలికి ఎగిరిపోతున్న దృశ్యాలను లోపల కూర్చున్న ఒక ప్రయాణికుడు వీడియో తీశాడు. కాగా.. విమానాల తయారీలో ప్రపంచప్రఖ్యాతిగాంచిన బోయింగ్ సంస్థ తయారుచేసిన 737 మాక్స్ రకం విమానాలు తరచూ ప్రమాదాలకు గురవుతుండడంతో ఆ సంస్థకు తలనొప్పిగా మారింది. 2018, 2019 సంవత్సరాల్లో రెండు 737 మాక్స్ విమానాలు కూలి 346 మంది మరణించారు. దీంతో 18 నెలలపాటు ప్రపంచవ్యాప్తంగా ఆ విమానాలను ఎక్కడా ఎగరనివ్వకుండా నిలిపివేశారు. మళ్లీ ఈ ఏడాది జనవరి నుంచి తరచూ ఏదో ఒక ప్రమాదంతో బోయింగ్ వార్తల్లో చోటు చేసుకుంటోంది. ఒక్క ఈ ఏడాదిలోనే బోయింగ్ విమానాలకు సంబంధించి 29 ప్రమాదాలు జరిగినట్టు అమెరికాకు చెందిన నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ బోర్డ్ వెల్లడించింది. దీంతో బోయింగ్ అంటేనే అందరూ భయపడే పరిస్థితి వచ్చింది. చివరకు అమెరికా అధ్యక్షుడు బైడెన్ సైతం ఒక సందర్భంలో.. తాను తన ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలో తలుపు పక్కన కూర్చోను అని చలోక్తి విసిరారు. ఎందుకంటే ఆయన విమానం బోయింగ్ (747-200బి రకం) విమానమే!

జైల్ కా జవాబ్ ఓట్ సే

- కేజ్రీవాల్‌కు మద్దతుగా ఆప్ కొత్త ప్రచారం

మద్యం కుంభకోణం కేసులో తీహాడ్‌లో ఉన్న ఢిల్లీ సీఎం, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌కు మద్దతుగా ఆప్ కొత్త ప్రచారానికి శ్రీకారం చుట్టింది. కేజ్రీవాల్‌ను జైలుకు పంపినందుకు ఓటుతో సమాధానం చెప్పాలని ప్రజలకు ఆప్ పిలుపునిచ్చింది. ఆప్ ఎంపీ సందీప్ పాఠక్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. పెద్ద కుట్రలో భాగంగా కేజ్రీవాల్‌ను అరెస్టు చేశారని ఆరోపించారు. ఇందుకు ఓటుతోనే సమాధానం చెప్పాలంటూ 'జైల్ కా జవాబ్ ఓట్ సే" ప్రచారానికి పిలుపునిచ్చారు. ప్రజలు ఓటేసేందుకు వెళ్లినప్పుడు కేజ్రీవాల్ మొఖాన్ని గుర్తు చేసుకోవాలని ఇదే కేసులో ఇటీవల బెయిల్‌పై విడుదలయిన ఆప్ రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్ కోరారు.

బోట్ కంపెనీ డేటా చోరీ

- రిస్క్‌లో 75 లక్షల మంది కస్టమర్లు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8: ప్రముఖ ఆడియో కంపెనీ 'బోట్'.. కస్టమర్ల డేటా చోరీకి గురయిందని, దాంతో ఆ కంపెనీకి చెందిన దాదాపు 75 లక్షల మంది కస్టమర్లు రిస్క్‌లో పడ్డారని ఫోర్బ్స్ ఇండియా సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. 'షాపిఫైగయ్' అనే హ్యాకర్ ఈ నెల 5వ తేదీన బోట్ కంపెనీ కస్టమర్ల డేటాను దొంగిలించి డార్క్ వెబ్‌లో పెట్టాడని పేర్కొంది. కస్టమర్ల పేర్లు, చిరునామాలు, ఫోన్ నెంబర్లతో పాటు వారి ఈ మెయిల్ అడ్రస్‌లు అందులో ఉన్నాయని వెల్లడించింది. కస్టమర్ల డేటాను హ్యాకర్ కేవలం 2 యూరోలకే విక్రయానికి పెట్టాడని, దాంతో బోట్ కంపెనీ కస్టమర్లకు ఏ క్షణమైన స్కామర్ల నుంచి ఫోన్లు, ఫిషింగ్ మెయిల్స్ వచ్చే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్‌ను ఉపయోగించుకుని స్కామర్లు ఏ తరహా మోసాలకైనా పాల్పడే వీలుందని, బోట్ కంపెనీ కస్టమర్లు కొన్ని వారాల పాటు అప్రమత్తంగా ఉండాలని ఫోర్బ్స్ హెచ్చరించింది.

కేంద్ర ఏజెన్సీల చీఫ్‌లను మార్చండి

- ఎన్నికల కమిషన్ వద్ద తృణమూల్ ఎంపీల ధర్నా.. లాగిపారేసిన పోలీసులు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8: రాజకీయ కారణాలతో ప్రతిపక్ష సభ్యులను వేధిస్తున్న నాలుగు కేంద్ర సంస్థల అధిపతులను వెంటనే మార్చాలని డిమాండు చేస్తూ సోమవారం తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు ఇక్కడి ఎన్నికల కమిషన్ కార్యాలయం వద్ద ధర్నాకు దిగారు. ఎన్నికలు జరుగుతున్న సమయంలో కేంద్ర సంస్థలైన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), సీబీఐ, ఎన్ఐఏ, ఆదాయపు పన్ను శాఖలు ప్రతిపక్ష సభ్యులను అడ్డుకుంటున్నాయని ఆరోపించారు. 24 గంటల పాటు ధర్నా చేస్తామంటూ ఆ పార్టీకి చెందిన పది మంది ఎంపీలు బైఠాయించారు. ఎన్నికల్లో అన్ని పార్టీలకు సమాన అవకాశాలు కల్పించాలని డిమాండు చేస్తూ ఆ పార్టీ ఎంపీలు డెరెక్ ఓబ్రెయిన్, డోలా సేన్, సాగరికా ఘోష్, సాకేత్ గోఖలే, శంతను సేన్ తదితరులు ఈ ఆందోళనకు దిగారు. ధర్నాకు కూర్చొన్న గంట అనంతరం పోలీసులు వచ్చి అక్కడి నుంచి నుంచి వెళ్లిపోవాలంటూ పలుమార్లు కోరారు. అయితే వారు వినకపోవడంతో బలవంతంగా ఈడ్చిపారేశారు. 63 ఏళ్ల ఓబ్రెయెన్‌ను బలవంతంగా బస్సులో తోసివేయడం కనిపించింది.

ఎన్నికల ముందు ఎంతమందిని జైల్లో పెడతారు?

- ఆరోపణలు చేసిన అందరినీ జైల్లో పెడుతుంటే ఎంతమంది జైల్లో ఉంటారో ఊహించండి: సుప్రీం



న్యూఢిల్లీ, ఏప్రిల్ 8: సోషల్ మీడియాలో ఆరోపణలు చేసిన ప్రతి ఒక్కరినీ జైల్లో పెట్టలేరని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్‌పై 2021లో అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న ఒక యూట్యూబర్‌కు సోమవారం బెయిల్‌ను పునరుద్ధరించింది. 'ఎన్నికల ముందు యూట్యూబ్‌లో ఆరోపణలు చేసిన ప్రతి ఒక్కరినీ మనం జైల్లో పెట్టడం ప్రారంభిస్తే గనుక.. ఎంతమంది జైల్లో ఉంటారో ఊహించండి!' అని జస్టిస్ అభయ్ ఎస్.ఓకా, జస్టిస్ ఉజ్వల్ భుయాన్‌లతో కూడిన సుప్రీం ధర్మాసనం వ్యాఖ్యానించింది. తమిళనాడు ప్రభుత్వం తరఫున వాదిస్తున్న సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీని ఉద్దేశించి ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. యూట్యూబర్ దురై మురుగన్ సత్తై బెయిల్ రద్దు ఆదేశాన్ని సుప్రీం ధర్మాసనం పక్కన పెట్టింది. బెయిల్‌పై ఉన్న సమయంలో అపఖ్యాతి కలిగించే వ్యాఖ్యలు చేయకుండా నిందితుడిపై పరిమితులు విధించాలని తమిళనాడు ప్రభుత్వం చేసిన అభ్యర్థననూ ధర్మాసనం తోసిపుచ్చింది. స్టాలిన్‌తోపాటు మరికొందరిపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన ఆరోపణపై మురుగన్‌ను అరెస్టు చేశారు. కోర్టు అతనికి షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేయగా, కోర్టుకు ఇచ్చిన ప్రమాణ పత్రాన్ని ఉల్లంఘించాడంటూ మద్రాసు హైకోర్టు అతని బెయిల్‌ను రద్దు చేసింది. దీనిపై నిందితుడు సుప్రీంకోర్టును ఆశ్రయించాడు.

అవినీతిపరులు జైలుకే!

(మొదటి పేజీ తరువాయి)



మహారాష్ట్రలోని చంద్రాపూర్ సభలో మహిళలకు అభివాదం చేస్తున్న మోదీ

నిర్లక్ష్యం చేసిందన్నారు. వారి బాధలు దానికి తెలియవని చెప్పారు. ఆ పార్టీ పాలనలో అవినీతి మన దేశానికి గుర్తింపుగా మారిందన్నారు. దోపిడీ చేయడానికి తనకు లైసెన్స్ ఉందని భావిస్తోందని.. తాను వచ్చాక దానిని రద్దుచేశానని.. ప్రజలే తనకీ అధికారం ఇచ్చారని.. దీంతో విపక్ష నేతలు తనను దూషిస్తున్నారని విమర్శించారు. అయితే దేశ ప్రజలు, తల్లులు, సోదరీమణులు తనకు రక్షణ కవచంలా నిలబడ్డారని చెప్పారు. లోక్‌సభ ఎన్నికలకు కాంగ్రెస్ తెచ్చిన మేనిఫెస్టోపై ముస్లింలీగ్ ముద్ర కనిపిస్తోందని పునరుద్ఘాటించారు. కాంగ్రెస్‌ను ఆయన కాకరకాయతో పోల్చారు. నేతిలో వేపినా, చక్కెరలో కలిపినా దాని రుచి మారదని చెప్పారు. దేశంలోని అన్ని సమస్యలకూ ఆ పార్టీయే మూలమని ఆరోపించారు. మతప్రాతిపదికన దేశ విభజన, కశ్మీరు సమస్య, నక్సలిజానికి దానిదే బాధ్యతని దుయ్యబట్టారు. 'అవినీతి.. పేదల హక్కులను నాశనం చేస్తుంది. 2014కి ముందు లక్షల కోట్ల విలువచేసే కుంభకోణాలకు పాల్పడ్డారు. అభివృద్ధి కోసం కేటాయించే ప్రతి రూపాయిలో 15 పైసలు మాత్రమే లబ్ధిదారులకు అందుతోందని మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ స్వయంగా చెప్పారు. మిగతా 85 పైసలు ఎవరు స్వాహా చేశారు? బీజేపీ ప్రభుత్వం గత పదేళ్లలో లబ్ధిదారుల ఖాతాల్లో రూ.34 లక్షల కోట్లు జమచేసింది. ఢిల్లీ నుంచి పంపే ప్రతి రూపాయి వంద శాతం లబ్ధిదారులకు చేరుతోంది. అదే కాంగ్రెస్ ఇప్పుడు అధికారంలో ఉండి అదే 15 పైసల ఆనవాయితీ కొనసాగి ఉంటే సదరు 34 లక్షల కోట్లలో 28 లక్షల కోట్లు బొక్కేసేవారు. కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతిపై నేను కఠిన చర్యలు తీసుకుంటున్నందున కర్రలతో నా తల బద్దలు కొట్టాలని ఆ పార్టీ నేతలు అంటున్నారు. మోదీ ఇలాంటి బెదిరింపులకు భయపడడు. నాకు నా దేశమే నా కుటుంబం. అవినీతిని నిర్మూలించాలని నేను పిలుపు ఇస్తుంటే.. అవినీతిపరులను కాపాడండని విపక్షాలు అంటున్నాయి' అని ధ్వజమెత్తారు.

రామాలయ ప్రతిష్ఠకు రమ్మంటే..

అయోధ్య రామాలయంలో బాలరాముడి ప్రతిష్ఠ కార్యక్రమానికి ఆహ్వానిస్తే విపక్షాలు నిరాకరించడంపై మోదీ ఆగ్రహం వ్యక్తంచేశారు. 'ఆలయ నిర్మాణంపై కాంగ్రెస్, ఇండీ కూటమి ఆగ్రహంగా ఉన్నాయి. శ్రీరాముడి ఉనికినే ప్రశ్నించిన కాంగ్రెస్ రాజకుటుంబం ఆలయ ప్రతిష్ఠ ఆహ్వానాన్ని తిరస్కరించింది. ఇది తప్పని చెప్పిన కాంగ్రెస్ నేతలను పార్టీ నుంచి బహిష్కరించారు. అలాగే ఆలయ ప్రతిష్ఠాపనకు వచ్చినవారిపైనా ఆరేళ్ల వేటు వేశారు. ముస్లింలను సంతృప్తి పరచడానికి కాంగ్రెస్ ఎందాకైనా వెళ్తుందనడానికి ఇదే నిదర్శనం. శ్రీరామనవమి ఎంతో దూరంలో లేదు. ఈ దఫా రామ్‌లల్లాను టెంట్‌లో కాకుండా భవ్య ఆలయంలో అందరూ చూడబోతున్నారు' అని తెలిపారు. ఛత్తీస్‌గఢ్ శ్రీరాముడి మాతామహుల జన్మస్థలమని.. 500 ఏళ్ల తర్వాత రామాలయ నిర్మాణ కల నెరవేరడంపై ఆ రాష్ట్ర ప్రజలు ఆనందంగా ఉండడం సహజమేనని చెప్పారు. గిరిజనులు బీజేపీకి ప్రాధాన్య వర్గమని స్పష్టం చేశారు.

జాతీయ పతాకాన్ని కించపరిచేలా పోస్టు

- భారత్‌కు మాల్దీవుల మాజీ మంత్రి క్షమాపణలు

మాలె, ఏప్రిల్ 8: భారత్‌తో గత కొన్ని నెలలుగా దౌత్యపరమైన వివాదాలు కొనసాగుతున్నప్పటికీ మాల్దీవుల నేతల తీరు మారడం లేదు. గతంలో దేశ ప్రధాని నరేంద్రమోదీ లక్షద్వీప్ పర్యటనపై అనుచిత వ్యాఖ్యలు చేయడంతో సస్పెన్షన్‌కు గురైన ముగ్గురు మంత్రుల్లో ఒకరైన మరియం షియునా ఎక్స్‌లో ఓ వివాదాస్పద పోస్టు చేశారు. తమ దేశంలోని ప్రతిపక్ష మాల్దీవియన్ డెమొక్రాటిక్ పార్టీని ఉద్దేశించి ఆమె చేసిన పోస్టులో భారత జాతీయ పతాకంలోని అశోక చక్రాన్ని వినియోగించారు. దీనిపై తీవ్ర విమర్శలు రావడంతో వెంటనే ఆ పోస్టును తొలగించారు. దీనిపై ఆమె భారత్‌కు క్షమాపణలు తెలిపారు. 'ఇటీవల నేను చేసిన పోస్టుతో ఏర్పడిన గందరగోళం పట్ల చింతిస్తున్నాను. ఎండీపీని ఉద్దేశించి చేసిన ఆ పోస్టులోని ఓ చిత్రం భారత జాతీయ పతాకాన్ని పోలి ఉందని తెలిసింది. అందుకు క్షమాపణలు తెలియజేస్తున్నాను. ఇందులో ఎలాంటి దురుద్దేశం లేదు. భారత్‌తో సంబంధాలను మేము ఎంతగానో గౌరవిస్తాం. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా అప్రమత్తంగా ఉంటాను" అని మరియం ఎక్స్‌లో ట్వీట్ చేశారు.

'పొగ'బట్టి చంపేసింది

- యువతి సిగరెట్ తాగుతుండగా వీడియో తీసిన యువకుడు
- అదే పనిగా ఆమెను చూడడంతో ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం
- స్నేహితులను పిలిచి.. యువకుడిని వెదికిపట్టుకుని మరీ దాడి
- తీవ్ర గాయాలతో యువకుడు మృతి.. నాగపూర్‌లో ఘటన..

నాగపూర్, ఏప్రిల్ 8: సిగరెట్ తాగుతుండగా వీడియో తీస్తున్న యువకుడితో గొడవ పడిన యువతి.. అనంతరం అతడిని వెదికిపట్టుకుని మరీ దారుణంగా హత్య చేసింది. మహారాష్ట్ర నాగపూర్‌లో శనివారం అర్థరాత్రి రంజిత్ రాథోడ్ (28) సిగరెట్ కోసం మహాలక్ష్మీనగర్‌లోని షాప్‌నకు వెళ్లాడు. అక్కడ జయశ్రీ పంజాడే (30) స్నేహితురాలు సవితతో కలిసి సిగరెట్ తాగుతోంది. వీరిని రంజిత్ అదే పనిగా చూశాడు. వీడియో కూడా తీస్తుండడంతో వాగ్వాదం మొదలైంది. ఇది ముదరడంతో దుర్భాషలకు దిగిన జయశ్రీ.. రంజిత్ ముఖంపైకి పొగ ఊదింది. ఇదంతా రంజిత్ తీసిన వీడియోలో రికార్డయింది. అనంతరం అతడు వెళ్లిపోయాడు. కానీ, కోపం చల్లారని జయశ్రీ తన స్నేహితులు ఆకాశ్ రౌత్, జీతూ జాదవ్‌ను పిలిచింది. అందరూ కలిసి రంజిత్‌ను వెదికి పట్టుకున్నారు. ఒక్కసారిగా అతడిపై దాడిచేశారు. తొలుత ఆకాశ్, అనంతరం జయశ్రీ కత్తితో పలుసార్లు పొడిచారు. పోలీసులు హుటాహుటిన చేరుకుని గాయాలైన రంజిత్‌ను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ చనిపోయాడు. జయశ్రీ, సవిత, ఆకాశ్, యశ్వంత్ సయారేపై పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

జగడం వద్దు.. సహకరించుకోండి

- నిధుల విడుదల అంశంపై కేంద్ర, రాష్ట్రాలకు సుప్రీం సూచన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8: కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వాలు కోర్టును ఆశ్రయిస్తున్న పరిస్థితులపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. జగడం బదులు పరస్పరం సహకరించుకోవాలని ఇరువర్గాలకు సూచించింది. కేంద్ర, రాష్ట్రాల మధ్య పోరు ఉండకూడదని పేర్కొంది. కరువు నిధులు విడుదల చేసేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ కర్ణాటక ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో కరువు నెలకొన్నప్పటికీ కేంద్రం ఆర్థిక సాయం అందించడం లేదని పిటిషన్‌లో కర్ణాటక ప్రభుత్వం ఆరోపించింది. నిధుల విడుదల విషయంలో రాష్ట్ర ప్రజల ప్రాథమిక హక్కుల ఉల్లంఘన జరుగుతున్నందునే కోర్టును ఆశ్రయించాల్సి వచ్చిందని తెలిపింది. అయితే, మరో 11 రోజుల్లో లోక్‌సభ ఎన్నికలు జరుగనున్న సందర్భాన్ని కేంద్రం ప్రస్తావించింది. రాష్ట్ర ప్రభుత్వం కోర్టును ఆశ్రయించే ముందు ప్రధానమంత్రి మోదీని ఆశ్రయించి ఉండాల్సిందని పేర్కొంది. కాగా, దీనిపై స్పందన తెలియజేసేందుకు కేంద్ర ప్రభుత్వం తరఫున హాజరైన అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాలకు సుప్రీంకోర్టు 2 వారాల గడువు ఇచ్చింది.

మోదీ ప్రసంగాల్లో 'ఆర్ఎస్ఎస్ కంపు'

- ఎవరెవరి పక్షమో అందరికీ తెలుసు
- బీజేపీ గ్రాఫ్ దిగజారుతోంది
- అందుకే మా మేనిఫెస్టోపై నిందలు
- కాంగ్రెస్ న్యాయపత్రలో ముస్లింలీగ్ వ్యాఖ్యలపై నిప్పులు చెరిగిన ఖర్గే
- ప్రధానిపై ఈసీకి ఫిర్యాదు



న్యూఢిల్లీ, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఇటీవల విడుదల చేసిన మేనిఫెస్టో 'న్యాయపత్ర'లో ముస్లిం లీగ్ ముద్ర ఉందంటూ ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై దుమారం కొనసాగుతూనే ఉంది. తాజాగా కాంగ్రెస్ పార్టీ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధానిపై తీవ్రస్థాయిలో నిప్పులు చెరిగారు. మోదీ ప్రసంగాలు ఆర్ఎస్ఎస్ కంపు కొడుతున్నాయని దుయ్యబట్టారు. మరోవైపు ప్రధాని చేసిన వ్యాఖ్యలపై కేంద్ర ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ నేతలు ఫిర్యాదు చేశారు. సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో వరుస పోస్టులు పెట్టిన ఖర్గే ప్రధాని సహా బీజేపీ సైద్ధాంతిక వాది, జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామా ప్రసాద్ ముఖర్జీపై నిప్పులు చెరిగారు. స్వాతంత్ర్యోద్యమకాలంలో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా బ్రిటిషర్లకు ముఖర్జీ మద్దతు పలికారని విమర్శలు గుప్పించారు. "మోదీ-అమిత్‌షాలు తమ రాజకీయ సైద్ధాంతికులుగా పేర్కొంటున్న వారు స్వాతంత్ర్యోద్యమకాలంలో భారతీయులకు వ్యతిరేకంగా బ్రిటీషర్లకు, ముస్లింలీగ్‌కు మద్దతు పలికారు. ఆఖరుకు ఈ రోజు కూడా కాంగ్రెస్ న్యాయపత్రకు వ్యతిరేకంగా ముస్లింలీగ్‌ను ప్రయోగిస్తున్నారు. కానీ, మా న్యాయపత్ర.. దేశంలోని సాధారణ పౌరుల అవసరాలు, ఆకాంక్షలు, వారి డిమాండ్లకు అద్దం పడుతోంది" అని ఖర్గే పేర్కొన్నారు. "మోదీ ప్రసంగాలు ఆర్ఎస్ఎస్ కంపు కొడుతున్నాయి. బీజేపీ ఎన్నికల గ్రాఫ్ రోజు రోజు పడిపోతోంది. అందుకే ఆర్ఎస్ఎస్ తమ ప్రియమిత్రుడు ముస్లింలీగ్‌ను గుర్తు చేసుకుంటోంది" అన్నారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోపై ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలు అత్యంత బాధాకరమని సీనియర్ నేత సల్మాన్ ఖుర్షీద్ అన్నారు. ప్రధాని మోదీపై కఠిన చర్యలు తీసుకోవాలని తాము కోరుతున్నట్టు చెప్పారు. మరోనేత పవన్ ఖేరా మాట్లాడుతూ.. కాంగ్రెస్ మేనిఫెస్టోకు ముస్లింలీగ్‌ను ఎందుకు ఆపాదిస్తున్నారని ప్రశ్నించారు.

కాంగ్రెస్, ఎన్సీ సీట్ల ఒప్పందం ఖరారు

జమ్ము కశ్మీర్‌లోని ఐదు, లడక్‌లోని ఒక లోక్‌సభ స్థానానికి సంబంధించి కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్సీ) మధ్య సీట్ల పంపకం ఒప్పందం కుదిరింది. చెరో మూడు స్థానాల్లో పోటీ చేయాలని నిర్ణయించాయి. ఈ మేరకు ఎన్సీ అధినేత ఫరూక్ అబ్దుల్లా సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. ఉధంపూర్, జమ్ము, లడక్ సీట్ల నుంచి కాంగ్రెస్ అభ్యర్థులు, అనంత్‌నాగ్, బారాముల్లా, శ్రీనగర్‌ల నుంచి తమ పార్టీ అభ్యర్థులు పోటీ చేస్తారని వెల్లడించారు. కాగా, అనంత్‌నాగ్ నుంచి పీడీపీ అధినాయకురాలు మెహబూబా ముఫ్తీ స్వయంగా పోటీ పడుతున్నారు. దీంతో ఇక్కడ ఎన్సీ, పీడీపీ, డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ ఆజాద్ పార్టీ అధినేత గులాం నబీ ఆజాద్ మధ్య త్రిముఖ పోటీ నెలకొనే అవకాశం ఉంది. అయితే, బరిలోఉండాలా? వద్దా? అన్నదానిపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని ఆజాద్ చెప్పారు.

వచ్చేది మేమే!: రాహుల్

శివనీ, ఏప్రిల్ 8: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు తథ్యమని ఆ పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీ ధీమా వ్యక్తంచేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఈ సారి విప్లవాత్మక నిర్ణయాలు చేర్చామన్నారు. దేశంలోని ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ మహిళలతో పాటు పేద మహిళల బ్యాంకు ఖాతాల్లో ఏటా రూ.లక్ష చొప్పున జమ చేస్తామని తెలిపారు. సోమవారం మధ్యప్రదేశ్ శివనీ జిల్లా మాండ్లా లోక్‌సభ స్థానం పరిధిలోని ధనోరాలో జరిగిన ఎన్నికల సభలో ఆయన ప్రసంగించారు. 'ఆశా, అంగన్వాడీ కార్యకర్తలకు ఇప్పుడిస్తున్న వేతనాలను రెట్టింపు చేస్తాం. దేశంలోని ప్రతి నిరుద్యోగికీ ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఏడాదిపాటు అప్రెంటిస్‌షిప్ ఇచ్చేలా కొత్త చట్టం తెస్తాం. కాంట్రాక్టు ఉద్యోగాల విధానానికి స్వస్తి చెబుతాం. పంటలకు కనీస మద్దతు కోసం చట్టం రూపొందిస్తాం.' అని రాహుల్ పేర్కొన్నారు

బరిలో నేరచరితులే అధికం

అఫిడవిట్ల ఆధారంగా ఏడీఆర్ నివేదిక

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి తొలివిడత పోలింగ్ దగ్గరపడుతున్న వేళ ఎన్నికల హక్కుల సంస్థ అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రీఫార్మ్స్(ఏడీఆర్) ఆసక్తికర విషయాలను వెల్లడించింది. తొలిదశలో ఎన్నికలు జరగబోయే 102 స్థానాల్లో... దాదాపు 42 స్థానాల్లో బరిలో ఉన్న అభ్యర్థుల్లో ముగ్గురు కంటే ఎక్కువ మంది నేరచరితులేనని తేల్చింది. 102 స్థానాల్లో మొత్తం 1,625 మంది అభ్యర్థులు పోటీలో ఉండగా వారిలో 1,618 మంది ఆఫిడవిట్లను పరిశీలించిన ఏడీఆర్ ఈ విషయాన్ని వెల్లడించింది. అందులో 16 శాతం మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయని, మరో 10 శాతం మంది తీవ్రనేరాల్లో నిందితులుగా ఉన్నారని స్పష్టం చేసింది. అలాగే ఏడుగురిపై హత్య కేసులు, 19 మందిపై హత్యాయత్నం కేసులు, 18 మందిపై మహిళలను వేధించిన కేసులుండగా అందులో ఒకరిపై రేప్ కేసు ఉన్నట్లు ఆఫిడవిట్‌లో పేర్కొన్నారని తెలిపింది. దాదాపు 40 శాతానికి మించి స్థానాల్లో ముగ్గురు కంటే ఎక్కువ అభ్యర్థులు నేరచరితులు కావడంతో వీటిని 'రెడ్ అలర్ట్ నియోజకవర్గాలు'గా ఏడీఆర్ తన నివేదికలో పేర్కొంది. ఇక పార్టీల వారీగా విశ్లేషిస్తే... ఆర్జేడీ తరఫున బరిలో ఉన్న నలుగురి అభ్యర్థులపై కేసులున్నాయని, డీఎంకే 22 మందికి గానూ 13 మంది(59 శాతం), సమాజ్‌వాదీ పార్టీ తరఫున 7 గురిలో ముగ్గురి(43 శాతం)పై, తృణమూల్ ఐదుగురులో ఇద్దరిపై, బీజేపీ తరఫున 77 మందికి గానూ 28 మంది(36 శాతం)పై కాంగ్రెస్ 56లో 19 మంది(34 శాతం)పై క్రిమినల్ కేసులున్నట్లు ఏడీఆర్ వెల్లడించింది. ఇదేగాక పోటీలో ఉన్న అభ్యర్థుల్లో దాదాపు 28 శాతం కోటీశ్వరులే! మధ్యప్రదేశ్ చింద్వారా స్థానం నుంచి కాంగ్రెస్ తరఫున బరిలో ఉన్న మాజీ ముఖ్యమంత్రి కమల్‌నాథ్ తనయుడు నకుల్‌నాథ్ రూ. 716 కోట్లతో అత్యంత సంపన్న అభ్యర్థిగా నిలిచారు.

విజయవంతంగా నింగిలోకి
టీశాట్- 1ఏ ఉపగ్రహం



న్యూఢిల్లీ, ఏప్రిల్ 8: టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ (టీఏఎస్ఎల్) దేశీయ పరిజ్ఞానంతో రూపొందించిన టీశాట్-1ఏ ఉపగ్రహం విజయవంతంగా పంపారు. అమెరికాలోని కెనడీ స్పేస్ స్టేషన్ నుంచి స్పేస్ ఎక్స్‌కు చెందిన ఫాల్కన్ 9- రాకెట్ ద్వారా దీన్ని నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ (టీఏఎస్ఎల్), శాటిలాజిక్ సంస్థలు సంయుక్తంగా ఈ సబ్ మీటర్ ఆప్టికల్ ఉపగ్రహాన్ని కర్ణాటకలోని వెమగాల్ ఫెసిలిటీలో రూపొందించి పరీక్షించాయి. ఈ ఉపగ్రహం, తక్కువ లేటెన్సీతో అధిక రిజల్యూషన్ ఆప్టికల్ చిత్రాలను అందించనుంది. ఈ విజయం పట్ల టీఏఎస్ఎల్ సీఈవో సుకరన్ సింగ్ ఆనందం వ్యక్తం చేశారు. ఇది అంతరిక్ష రంగంలో టీఏఎస్ఎల్ వేసిన మొదటి అడుగని ఈ ఉపగ్రహ తయారీకి భారత ప్రభుత్వం అందించిన సహకారం మరువలేనిదని ఆయన పేర్కొన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి

దిక్సూచి

diksuchi@andhrajyothy.com

హైదరాబాద్ ● మంగళవారం 9 ఏప్రిల్ 2024

భిలాయ్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)-ఎంటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. అభ్యర్థులు ముందుగా సీఓఏపీ పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకోవాలి. సంబంధిత నెంబర్‌ను దరఖాస్తు ఫారంలో సూచించాలి.

ఐఐటీ భిలాయ్‌లో ఎంటెక్



స్పెషలైజేషన్‌లు: బయో ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, డేటా సైన్స్ అండ్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్(పవర్ సిస్టమ్స్ అండ్ పవర్ ఎలక్ట్రానిక్స్/కంట్రోల్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్/ఎలక్ట్రిక్ వెహికిల్ టెక్నాలజీ), ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రిక్ వెహికిల్ టెక్నాలజీ, మెటీరియల్స్ సైన్స్ అండ్ మెటలర్జికల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్(డిజైన్ అండ్ మాన్యుఫాక్చరింగ్/థర్మల్ అండ్ ఫ్లూయిడ్స్ ఇంజనీరింగ్), మెకట్రానిక్స్ ఇంజనీరింగ్.

అర్హత: సంబంధిత ఇంజనీరింగ్ విభాగంలో బీఈ/బీటెక్ పూర్తిచేసి ఉండాలి. మాస్టర్స్ ఇన్ సైన్స్ లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైనవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి. బయో ఇంజనీరింగ్ విభాగానికి బీఫార్మసీ/ఎంబీబీఎస్/బీడీఎస్ అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. విభాగానికి నిర్దేశించిన మేరకు జీప్యాట్/గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి. ఐఐటీల నుంచి కనీసం 8 సీజీపీఏతో బీఈ/బీటెక్ ఉత్తీర్ణులైనవారికి గేట్ స్కోర్ అవసరం లేదు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.200; మహిళలు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.100
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 17
- **దరఖాస్తుతోపాటు అప్‌లోడ్ చేయాల్సిన పత్రాలు:** అభ్యర్థి ఫొటో; పదోతరగతి, ఇంటర్/డిప్లొమా, డిగ్రీ/పీజీ సర్టిఫికెట్స్, మార్కుల పత్రాలు; కులం, ఆదాయం, అనుభవం ధ్రువీకరణ పత్రాలు
- **అభ్యర్థుల షార్ట్‌లిస్టింగ్, సెలెక్షన్ ప్రాసెస్:** ఏప్రిల్ 18 నుంచి
- **వెబ్‌సైట్:** www.iitbhilai.ac.in



కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం కోల్‌కతాలో నిర్వహిస్తున్న ఇండియన్ అసోసియేషన్ ఫర్ ద కల్టివేషన్ ఆఫ్ సైన్స్(ఐఏసీఎస్)-ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. సైన్స్ స్పెషలైజేషన్లతో ఇంటిగ్రేటెడ్ బ్యాచిలర్స్-మాస్టర్స్, మాస్టర్స్/ఇంటిగ్రేటెడ్ మాస్టర్స్-పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి.

ప్రోగ్రామ్‌లను అందిస్తున్న స్కూళ్లు

- స్కూల్ ఆఫ్ అప్లయిడ్ అండ్ ఇంటర్‌డిసిప్లినరీ సైన్సెస్
- స్కూల్ ఆఫ్ బయలాజికల్ సైన్సెస్
- స్కూల్ ఆఫ్ కెమికల్ సైన్సెస్
- స్కూల్ ఆఫ్ మెటీరియల్స్ సైన్సెస్
- స్కూల్ ఆఫ్ మేథమెటికల్ అండ్ కంప్యూటేషనల్ సైన్సెస్
- స్కూల్ ఆఫ్ ఫిజికల్ సైన్సెస్

ఐఏసీఎస్‌లో ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్‌లు

ఇంటిగ్రేటెడ్ బ్యాచిలర్స్-మాస్టర్స్ ప్రోగ్రామ్ ఇన్ సైన్స్

- ప్రోగ్రామ్ వ్యవధి అయిదేళ్లు. సెమిస్టర్ విధానాన్ని అనుసరిస్తారు. మొదటి మూడు సెమిస్టర్లలో ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథమెటిక్స్, కంప్యూటర్ సైన్స్, బయలాజికల్ సైన్సెస్ సబ్జెక్టులకు సంబంధించిన ఫౌండేషనల్ కోర్సులు ఉంటాయి. నాలుగో సెమిస్టర్ నుంచి పై సబ్జెక్టులలో ఒకదాన్ని మేజర్ సబ్జెక్టుగా ఎంచుకోవాల్సి ఉంటుంది. ఏడో సెమిస్టర్ నుంచి రీసెర్చ్ కోర్సులు ఉంటాయి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి సైన్స్ స్ట్రీమ్‌లో ప్రథమ శ్రేణి మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎంపిక: యూజీ ప్రీ ఇంటర్వ్యూ స్క్రీనింగ్ టెస్ట్(యూపీఎస్‌టీ) ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. దీనిని కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో అన్నీ మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలే ఇస్తారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథమెటిక్స్ సబ్జెక్టుల నుంచి 20 ప్రశ్నలు; కంప్యూటర్ సైన్స్/బయలాజికల్ సైన్సెస్ సబ్జెక్టు నుంచి మరో 20 ప్రశ్నలు అటెమ్ట్ చేయాల్సి ఉంటుంది. ప్రశ్నకు 2 మార్కులు నిర్దేశించారు. మూడు ప్రశ్నలకు సమాధానాలు తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు. ఈ టెస్ట్‌లో సాధించిన మెరిట్ ప్రకారం అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి మొత్తం 80 మందిని ఎంపిక చేస్తారు. ఈ ప్రోగ్రామ్‌లో ప్రవేశం పొందిన అభ్యర్థులందరికీ సంస్థ నిబంధనల ప్రకారం నాలుగో సెమిస్టర్ నుంచి ప్రతినెలా స్టయిపెండ్ ఇస్తారు.

మాస్టర్స్/ఇంటిగ్రేటెడ్ మాస్టర్స్-పీహెచ్‌డీ ప్రోగ్రామ్ ఇన్ సైన్స్

- మొదట మాస్టర్స్ ప్రోగ్రామ్ పూర్తిచేయాల్సి ఉంటుంది. తరవాత పీహెచ్‌డీ రిజిస్ట్రేషన్‌కు అనుమతిస్తారు. దీనినే ఇంటిగ్రేటెడ్ మాస్టర్స్-పీహెచ్‌డీగా పరిగణిస్తారు. సంస్థ నిబంధనల ప్రకారం జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్(జేఆర్ఎఫ్) కూడా ఇస్తారు.

స్పెషలైజేషన్‌లు: కెమికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్, మెటీరియల్స్ సైన్సెస్, మేథమెటికల్ అండ్ కంప్యూటేషనల్ సైన్సెస్, అప్లయిడ్ అండ్ ఇంటర్ డిసిప్లినరీ సైన్సెస్.

అర్హత: ప్రథమ శ్రేణి మార్కులతో సంబంధిత సబ్జెక్టులతో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. మేథమెటికల్ అండ్ కంప్యూటేషనల్ సైన్సెస్ స్పెషలైజేషన్‌కు ఇంజనీరింగ్ డిగ్రీ పూర్తిచేసి ఉండాలి.

ఎంపిక: అభ్యర్థులను మాస్టర్స్ ప్రీ ఇంటర్వ్యూ స్క్రీనింగ్ టెస్ట్(ఎంపీఎస్‌టీ) ద్వారా ఎంపిక చేస్తారు. దీనిని కూడా సీబీటీ విధానంలోనే నిర్వహిస్తారు. ఇందులో సంబంధిత స్పెషలైజేషన్‌నుంచి మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. ఇందులో అర్హత పొందినవారిని ఇంటర్వ్యూకి పిలుస్తారు. స్పెషలైజేషన్‌కు 20 మంది అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఈ ప్రోగ్రామ్‌లో ప్రవేశం పొందిన అభ్యర్థులందరికీ మొదటి రెండేళ్లు నెలకు రూ.12,000ల స్టయిపెండ్ ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1200; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.600
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 13
- **ఆన్‌లైన్ రిటెన్ టెస్ట్ తేదీలు:** జూన్ 16 నుంచి
- **తరగతులు ప్రారంభం:** ఆగస్టు 8 నుంచి
- **వెబ్‌సైట్:** www.iacs.res.in

యాదాద్రి భువనగిరి జిల్లాలో తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వామి రామానంద తీర్థ రూరల్ ఇన్‌స్టిట్యూట్ - ఉపాధి ఆధారిత సాంకేతిక శిక్షణ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. తెలంగాణకు చెందిన నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంపికైన అభ్యర్థులకు శిక్షణ, భోజనం, వసతి ఉచితం. సంస్థ నిబంధనల ప్రకారం కోర్సులు పూర్తిచేసినవారికి ఉద్యోగావకాశాలు కల్పిస్తారు. ఆసక్తిగల అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్‌లు, వాటి జిరాక్స్ కాపీలు, ఆధార్ కార్డ్, ఆదాయ ధ్రువపత్రం, ఫొటోలతో కింది చిరునామాకు హాజరు కావాలి.

రామానంద తీర్థ ఇన్‌స్టిట్యూట్‌లో ఉపాధి కోర్సులు



మూడు నెలల కోర్సులు-అర్హత: బేసిక్ కంప్యూటర్స్(డేటా ఎంట్రీ ఆపరేటర్), కంప్యూటర్ హార్డ్‌వేర్ అసిస్టెంట్ కోర్సుల్లో ప్రవేశానికి ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. అకౌంట్స్ అసిస్టెంట్(ట్యాలీ) కోర్సుకు బీకాం; ఆటో మొబైల్-2 వీలర్ సర్వీసింగ్ కోర్సుకు పదోతరగతి ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు.

నాలుగు నెలల కోర్సులు-అర్హత: సెల్‌ఫోన్& ఎలక్ట్రానిక్ వస్తువుల రిపైర్, సోలార్ సిస్టమ్ ఇన్‌స్టలేషన్-సర్వీసెస్ కోర్సుల్లో ప్రవేశానికి పదోతరగతి/ఐటీఐ పూర్తిచేసి ఉండాలి.

అయిదు నెలల కోర్సు-అర్హత: ఎలక్ట్రీషియన్ (డొమెస్టిక్) కోర్సులో ప్రవేశానికి పదోతరగతి/ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.

ముఖ్య సమాచారం

- **ఇతర అర్హతలు:** అభ్యర్థులు గ్రామీణ ప్రాంతాలకు చెందినవారై ఉండాలి. వయసు 18 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి. చదువు మధ్యలో ఉన్నవారు దరఖాస్తుకు అనర్హులు.
- **అడ్మిషన్స్ తేదీ:** ఏప్రిల్ 15
- **ఎంపికైనవారు చెల్లించాల్సిన రిఫండబుల్ డిపాజిట్:** రూ.250
- **చిరునామా:** స్వామి రామానంద తీర్థ రూరల్ ఇన్‌స్టిట్యూట్, జలాల్‌పూర్ గ్రామం, పోచంపల్లి మండలం, యాదాద్రి భువనగిరి జిల్లా, తెలంగాణ-508284
- **ఫోన్ నెంబర్లు:** 9133908000, 9133908111, 9133908222, 9948466111
- **వెబ్‌సైట్:** www.srtri.com

జాబ్ కార్నర్

నైపర్ మొహాలీలో టీచింగ్ ఖాళీలు

ఖాళీలు 32

పంజాబ్ మొహాలీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(నైపర్)... తాత్కాలిక ప్రాతిపదికన కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

1. ప్రొఫెసర్: 13
2. అసోసియేట్ ప్రొఫెసర్: 12
3. అసిస్టెంట్ ప్రొఫెసర్: 7

విభాగాలు: ఫార్మాకోఇన్ఫర్మాటిక్స్, నేచురల్ ప్రొడక్ట్స్, ఫార్మాస్యూటికల్ అనాలసిస్, ఫార్మకాలజీ అండ్ టాక్సికాలజీ, ఫార్మాస్యూటిక్స్, ఫార్మసీ ప్రాక్టీస్, ఫార్మాస్యూటికల్ టెక్నాలజీ- ఫార్ములేషన్స్, బయోటెక్నాలజీ, మెడికల్ డివైజెస్, మెడిసినల్ కెమిస్ట్రీ, క్లినికల్ రీసెర్చ్.

అర్హత: పీహెచ్‌డీతో పాటు బోధన/రీసెర్చ్/ఇండస్ట్రియల్ అనుభవం ఉండాలి.

జీతం: ప్రొఫెసర్ పోస్టుకు రూ.1,59,100- రూ.2,20,200. అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టుకు రూ.1,39,600- రూ.2,11,300. అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుకు రూ.1,01,500 - రూ.1,67,400.

వయోపరిమితి: 50 ఏళ్లు మించరాదు.

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా

చిరునామా: ద రిజిస్ట్రార్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ సెక్టార్-67, ఎస్.ఎ.ఎస్. నగర్(మొహాలీ), పంజాబ్.

దరఖాస్తుకు చివరి తేదీ: మే 6

వెబ్‌సైట్: https://niper.gov.in/

రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్‌లో ఎస్ఐ, కానిస్టేబుల్స్



మొత్తం ఖాళీలు: 4660

రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్‌పీఎఫ్)/రైల్వే ప్రొటెక్షన్ స్పెషల్ ఫోర్స్ (ఆర్‌పీఎస్ఎఫ్)లో ఎస్ఐ, కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.

ఆర్ఆర్‌బీ రీజియన్లు: అహ్మదాబాద్, అజ్మీర్, బెంగళూరు, భోపాల్, భువనేశ్వర్, బిలాస్‌పూర్, చండీగఢ్, చెన్నై, గువాహటి, జమ్ము అండ్ శ్రీనగర్, కోల్‌కతా, మాల్డా, ముంబై, ముజఫర్‌పూర్, పట్నా, ప్రయాగ్‌రాజ్, రాంచీ, సికింద్రాబాద్, సిలిగురి, తిరువనంతపురం, గోరఖ్‌పూర్.

1. **కానిస్టేబుల్: 4,208 పోస్టులు**
2. **సబ్ ఇన్‌స్పెక్టర్: 452 పోస్టులు**

అర్హత: కానిస్టేబుల్ పోస్టులకు పదో తరగతి, ఎస్ఐ ఉద్యోగాలకు డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.

రీజియన్ల వారీ ఖాళీలు, విద్యార్హత, రాత పరీక్ష, సిలబస్ తదితర పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తారు. సంక్షిప్త ఉద్యోగ ప్రకటనను ఎంప్లాయ్‌మెంట్ న్యూస్(మార్చి 2-8)లో చూడవచ్చు.

వయోపరిమితి: 2024 జూలై 1 నాటికి కానిస్టేబుల్ పోస్టులకు18-28 ఏళ్ల మధ్య, ఎస్ఐ పోస్టులకు 20-28 ఏళ్ల మధ్య ఉండాలి.

ప్రారంభ వేతనం: నెలకు ఎస్ఐ పోస్టులకు రూ.35,400; కానిస్టేబుల్ పోస్టులకు రూ.21,700

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష(కంప్యూటర్ బేస్డ్ టెస్ట్), ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్, ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్ట్, మెడికల్ స్టాండర్డ్ టెస్ట్, సర్టిఫికెట్ వెరిఫికేషన్ తదితరాల ఆధారంగా ఎంపిక చేస్తారు.

దరఖాస్తు ఫీజు: ఎస్సీ, ఎస్టీ, మాజీ సైనికోద్యోగులు, మహిళలు, ట్రాన్స్‌జెండర్, మైనారిటీ, ఈబీసీ అభ్యర్థులకు రూ.250. ఇతరులకు రూ.500.

దరఖాస్తులు ప్రారంభం: ఏప్రిల్ 15

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మే 14

వెబ్‌సైట్: https://rpf.indianrailways.gov.in/RPF/

చిత్తరంజన్ లోకోమోటివ్ వర్క్స్‌లో అప్రెంటిస్

ఖాళీలు 492

చిత్తరంజన్(పశ్చిమబెంగాల్)లోని చిత్తరంజన్ లోకోమోటివ్ వర్క్స్...2024-25 సంవత్సరానికి గాను కింద పేర్కొన్న అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: యాక్ట్ అప్రెంటిస్

ట్రేడులు: ఫిట్టర్, టర్నర్, మెషినిస్ట్, వెల్డర్, ఎలక్ట్రీషియన్, ఏసీ మెకానిక్, పెయింటర్

అర్హత: అభ్యర్థులు పదో తరగతి, సంబంధిత ట్రేడ్‌లలో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.

వయోపరిమితి: 2024 మార్చి 27 నాటికి 15 నుంచి 24 సంవత్సరాల మధ్య ఉండాలి.

ఎంపిక ప్రక్రియ: విద్యార్హతలో సాధించిన మార్కుల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 18

వెబ్‌సైట్: clw.indianrailways.gov.in/

రైట్స్‌లో ఇంజనీర్, టీమ్ లీడర్ ఖాళీలు

ఖాళీలు 31

గుర్‌గావ్‌లోని రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనామిక్ సర్వీస్(రైట్స్)...కాంట్రాక్ట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

1. ప్రాజెక్ట్ లీడర్(సివిల్): **1 పోస్టు**
2. టీమ్ లీడర్(సివిల్): **5 పోస్టులు**
3. డిజైన్ ఎక్స్‌పర్ట్(సివిల్): **6 పోస్టులు**
4. రెసిడెంట్ ఇంజనీర్(బ్రిడ్జ్/ట్రాక్/సివిల్/ఎస్ అండ్ టి/ఎలక్ట్రికల్): **18 పోస్టులు**
5. ఇంజనీర్(డిజైన్): **1 పోస్టు**

అర్హత: సంబంధిత విభాగంలో డిప్లొమా, బ్యాచిలర్ డిగ్రీతోపాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 2024 ఏప్రిల్ 16 నాటికి 55 సంవత్సరాలు మించకూడదు.

ఎంపిక ప్రక్రియ: విద్యార్హత, పని అనుభవం, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

దరఖాస్తు రుసుము: లేదు

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 16

ఇంటర్వ్యూ తేదీలు: ఏప్రిల్ 12, 15, 16

వేదిక: రైట్స్ భవన్(గుర్‌గావ్), రైట్స్ ఆఫీస్(అహ్మదాబాద్), రైట్స్ ఆఫీస్(ముంబయి)

వెబ్‌సైట్: www.rites.com/Career

సీబీఎస్ఈలో గ్రూప్- ఎ, బి, సి పోస్టులు

ఖాళీలు 118

న్యూఢిల్లీలోని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్... డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. అసిస్టెంట్ సెక్రటరీ(అడ్మినిస్ట్రేషన్): **18 పోస్టులు**
2. అసిస్టెంట్ సెక్రటరీ(అకడమిక్): **16 పోస్టులు**
3. అసిస్టెంట్ సెక్రటరీ(స్కిల్ ఎడ్యుకేషన్): **8 పోస్టులు**
4. అసిస్టెంట్ సెక్రటరీ(ట్రెయినింగ్): **22 పోస్టులు**
5. అకౌంట్స్ ఆఫీసర్: **3 పోస్టులు**
6. జూనియర్ ఇంజనీర్: **17 పోస్టులు**
7. జూనియర్ ట్రాన్స్‌లేషన్ ఆఫీసర్: **7 పోస్టులు**
8. అకౌంటెంట్: **7 పోస్టులు**
9. జూనియర్ అకౌంటెంట్: **20 పోస్టులు**

అర్హతలు: పోస్టును అనుసరించి విద్యార్హతలు, అనుభవం తదితర పూర్తి సమాచారం మార్చి 12న సంస్థ వెబ్‌సైట్‌లో లభ్యమవుతుంది.

ఎంపిక విధానం: రాత పరీక్ష, ధ్రువపత్రాల పరిశీలన తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రారంభం: మార్చి 12

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: ఏప్రిల్ 11

వెబ్‌సైట్: https://www.cbse.gov.in/

లిటిల్స్



కోతుల మూర్ఖత్వం

ఒక అడవిలో రెండు కోతులు ఉండేవి. అవి రెండూ తెలివవైనవి. రెండూ మూర్ఖంగా ఉండేవి. ఇతర కోతులు కూడా ఇవి చెప్పినట్లు నడుచుకుండేవి. ఇవి తెలివైనవని అవి భావించేవి.

ఒకసారి రెండు కోతులు అడవిని విడిచి దగ్గరగా ఉండే ఓ గ్రామానికి వెళ్లాయి. అది చలికాలం సమయం కావటం వల్ల ఊరిలోని జనాలు పుల్లలు అంటించి ఆ శాకానికి చేతులు కాపుతూ ఉన్నారు. ఆ మంటను చూసి ఈ రెండు కోతులూ అలానే చేయాలని నిర్ణయించుకున్నాయి. అసలే కోతులు అనుకరించటంలో ముందుంటాయి. కాబట్టి వారి స్వస్థలానికి వెళ్లి అలా మంటను కాచుకోవాలనుకున్నాయి.

ఒకవారం తర్వాత మరింత చలి పెరిగింది. దీంతో తట్టుకోలేక కచ్చితంగా అగ్గివేయాలని నిర్ణయించుకున్నాయి ఆ రెండు కోతులు. అదే సమయంలో కోతుల రారాజు 'ఈ చలిని తట్టుకోవటానికి ఉపాయం ఉందా?' అని అడిగింది. ఈ రెండు కోతులు విషయాన్ని చెప్పాయి. ఆ బాధ్యత మీదే అనటంతో.. ఈ రెండు కోతులు అప్రమత్తమయ్యాయి. విషయాన్ని రాజుకు చెప్పాయి. ఆ రెండు కోతులకు నిప్పు ఎలా పుట్టించాలో తెలీదు. అడవంతా అగ్గి కోసం తిరిగాయి. నిప్పు కనిపించలేదని చెప్పాయి. రాజుగారు కోపంతో గద్దించారు. దీంతో మళ్లీ వెళ్లిపోయాయి నిప్పుకోసం.




అడవిలో తిరుగుతుంటే ఒక మిణుగురు పురుగు కనపడింది. అది మెరుస్తూ ఉంది. రెండు కోతులూ ఆ పురుగును వెంబడించనా దొరకలేదు. దూరంగా వందల మిణుగురు పురుగులు. వీటన్నింటినీ ఒకేచోటకు తీసుకొచ్చి వెచ్చదనం పొందవచ్చునని ఈ రెండు కోతులు ఆలోచించాయి. దీంతో కోతులు ఆ మిణుగురు పురుగుల వెంట పడ్డాయి. కొన్ని దొరికాయి. రాజుగారిని అడిగి మరిన్ని వానరాల్ని వీటి వెంట తెచ్చుకున్నాయి. కోతులన్నీ ఎగురుతూ కొన్ని మిణుగురు పురుగులను తెచ్చి ఒక చోట కుప్పగా పోశాయి. మంచి వెలుతురు వస్తోంది. అయితే వెచ్చదనం రాలేదు. అదే సమయంలో రాత్రి మేలుకున్న ఓ గుడ్లగూడ ఇలా అన్నది.. 'మీకు తెలివే లేదు. ఈ మిణుగురు పురుగులు స్వయంగా మెరిసేవి. వీటి వల్ల అగ్గిపుట్టదు. మీ మూర్ఖత్వం అందరికీ అంటిస్తే ఎలా? ' అన్నది. 'ముసలి గుడ్లగూడ నీకేం తెలుసు?' అంటూ కోతులు గద్దించాయి. మిణుగురు పురుగులు పెడుతూనే అవి పైకి ఎగిరిపోతున్నాయి. వాటిని చంపితే వెలుగు రాదని ఆ రెండు కోతులకు తెలుసు. అందుకే వాటిని చంపొద్దన్నాయి. అలా కోతులన్నీ అలసిపోయి మిణుగురులను కొన్నింటని తెచ్చాయి. వెలుగు అయితే వచ్చింది. మంట రాలేదు. వెచ్చదనం రాలేదు. కోతులు అలసిపోయి రాత్రికి నిద్రపోయాయి. మిణుగురులు ఎగిరిపోయాయి. కొమ్మ మీద ఉండే గుడ్ల గూబ అరుస్తూ 'మూర్ఖం కోతులు' అంటూ తిట్టింది.


సరైన నీడ ఏది?



దారి కనుక్కోండి



6 తేడాలు గుర్తించండి



డైలీ సుడోకు - 276

2		6			4		7	
	9		8	1				
		3					9	
		2			9			
7		9				5		8
			2			1		
	5					9		
				3	8		1	
	7		9			4		2

సుడోకు - 275 సమాధానం

6	8	2	4	7	9	1	5	3
4	5	7	3	1	8	6	9	2
3	9	1	6	5	2	7	4	8
5	3	4	1	2	6	8	7	9
2	6	8	7	9	5	3	1	4
1	7	9	8	3	4	5	2	6
7	4	3	2	6	1	9	8	5
8	1	5	9	4	3	2	6	7
9	2	6	5	8	7	4	3	1

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.